'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 11 సంచిక: 318

శుక్రవారం 8-2-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రుణాలిక.. బిం'దాస్'!

రెపో రేటు పావు శాతం తగ్గించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా -14లో



రంజీ ట్రోఫీ విజేత విదర్భ

ఫైనల్లో 78 పరుగులతో సౌరాష్ట్రపై విజయం –స్పోర్ట్స్‌లో



ఛత్తీస్‌లో ఎన్‌కౌంటర్

ఎదురుకాల్పుల్లో **10** మంది మావోల మృతి

భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం

రాయ్‌పూర్/చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పులతో గురువారం ఉదయం బీజాపూర్ అటవీ ప్రాంతం దద్దరిల్లిపోయింది. ఈ భారీ ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి పోలీసులు పెద్ద ఎత్తున ఆయుధ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర డీజీపీ డీఎం అవస్థి మీడియాకు వెల్లడించారు. బీజాపూర్ జిల్లా బైరంగఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టు డివిజనల్ కమిటీ సభ్యులు రాజ్‌మన్ మందవీ, సుఖ్‌లాల్‌లు సుమారు 50 నుంచి 60 మంది సభ్యులతో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు బుధవారం రాత్రి నుంచి అక్కడ కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయానికి భద్రతా బలగాలు బోర్గా గ్రామ పరిధిలోకి ప్రవేశించగానే వారిపైకి మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. దీంతో పోలీసులు కూడా మావోయిస్టులపైకి ఎదురు కాల్పులు ప్రారంభించారు. సుమారు రెండున్నర గంటల సేపు జరిగిన

మిగతా 2వ పేజీలో ▶

సాగుకు నీళ్లివ్వాల్సిందే

ఇయ్యకుంటే.. పాపం చేసినోళ్లమవుతాం!

- ప్రజాప్రతినిధులు, అధికారులతో సీఎం కేసీఆర్
- ఎస్సారెస్పీ ఆయకట్టు మొత్తానికి సాగునీరివ్వాలి
- కాల్వల లైనింగ్ మొదలవ్వాలి.. వర్షాకాలంలోగా పూర్తిచేయండి
- నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖకు ఆదేశం..
- ఎస్సారెస్పీ కాలువలతో అన్ని చెరువులు నింపాలి
- మే 15 నాటికి చనాఖా–కొరాటా పూర్తి చేయాలన్న సీఎం
- పలు సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించిన కేసీఆర్

సాక్షి, హైదరాబాద్

వచ్చే వర్షాకాలంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) పరిధిలోని మొత్తం 14.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి వీలుగా అన్ని పనులను వేసవికాలంలోగా పూర్తిచేయాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. జూన్ నాటికి.. కాల్వలు, తూముల నిర్మాణం, లైనింగ్ పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మేడిగడ్డ బ్యారేజీ నుంచి ఈ వర్షాకాలంలో నీటిని ఎత్తిపోయడం ప్రారంభమవుతుందని.. ఆ నీటిని మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యాములకు తరలిస్తామని చెప్పారు. ఈ రెండు డ్యాములకు 50టీఎంసీల సామర్థ్యం ఉంది. ఆ నీటితో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా అన్ని చెరువులు నింపాలని సీఎం ఆదేశించారు. 'ప్రాజెక్టుల ద్వారా నీళ్లొస్తున్నాయి. పనులు చేయడానికి నిధులిస్తున్నాం. అయినా పంట పొలాలకు నీరందించకుంటే పాపం చేసిన వారమవుతాం' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో కేసీఆర్ గురువారం ప్రగతిభవన్‌లో సమావేశమయ్యారు. ఎంపీలు జోగినపల్లి సంతోష్ కుమార్, అజ్మీరా సీతారాంనాయక్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఆరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, గ్యాదరి కిశోర్, వి సతీష్‌కుమార్, దాసరి మనోహర్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బాల్క సుమన్, సుంకె రవిశంకర్, సంజయ్ కుమార్, కోరుకంటి చందర్, నన్నపునేని నరేందర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ,

మిగతా 2వ పేజీలో ▶



గురువారం ప్రగతి భవన్‌లో ఎస్సారెస్పీపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఈటల

అది మహా కల్తీ కూటమి



దాన్ని మన ప్రజాస్వామ్యం అంగీకరించదు

- విపక్షాల మహాకూటమిపై మోదీ ధ్వజం
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో ప్రసంగం
- 55 నెలల ఎన్డీయే పాలనను 55 ఏళ్ల పాలనతో పోల్చిన ప్రధాని
- తాను వ్యవస్థల్ని ధ్వంసం చేశానంటున్న కాంగ్రెసే ఎన్నో తప్పులు చేసిందని మండిపాటు
- అవినీతిని తగ్గించి, ఉద్యోగాల కల్పనను పెంచామని ఉద్ఘాటన

13లో

కాంగ్రెస్‌తో కలవడం ఆత్మహత్య చేసుకోవడంతో సమానమని అంబేడ్కర్ నాడే చెప్పారు. స్వాతంత్య్రం రాగానే కాంగ్రెస్‌ను రద్దు చేయాలని గాంధీ కోరుకున్నారు.

"కాలావధుల్ని సూచించే బీసీ (బిఫోర్ క్రైస్ట్), ఏడీ (ఆనో డొమిని)లకు కాంగ్రెస్ దృష్టిలో వేరే అర్థాలున్నాయి. బీసీ (బిఫోర్ కాంగ్రెస్) అంటే కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు అక్కడేం లేదని, ఏడీ (ఆఫ్టర్ డైనాస్టీ) అంటే తమ కుటుంబం అధికారంలోకి వచ్చాకే అంతా జరిగిందని వారు ప్రచారం చేసుకుంటున్నారు

–మోదీ

కాంగ్రెస్‌కు నయా జోష్

31 జిల్లాలకు డీసీసీ అధ్యక్షుల నియామకం



- నలుగురు పాత వారు మినహా మిగిలిన చోట్ల కొత్త వారే..
- 12 బీసీ, 10 మంది రెడ్డి సామాజిక వర్గాల నేతలకు చాన్స్
- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నేతలకూ పగ్గాలు
- మొత్తంగా ముగ్గురు మహిళలకు అవకాశం
- ఖమ్మం సిటీకి వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా...
- పెండింగ్‌లోనే ములుగు, నారాయణపేట

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత డీలా పడిన రాష్ట్ర కాంగ్రెస్‌లో జోష్ నింపేందుకు పార్టీ అధిష్టానం అన్ని జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను ప్రకటించింది. పార్టీలో 'కొత్త రక్తాన్ని' ఎక్కించడంతోపాటు సామాజిక సమతౌల్యత పాటిస్తూ 31 డీసీసీలకు అధ్యక్షులను నియమించింది. ఇందులో ప్రస్తుతం డీసీసీ అధ్యక్షులుగా ఉన్న వారిలో నలుగురికే అవకాశం ఇవ్వగా మిగిలిన అన్ని జిల్లాల్లో కొత్త వారినే నియమించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం ఢిల్లీలో ప్రకటన విడుదల చేశారు. సామాజిక వర్గాలవారీగా పరిశీలిస్తే 12 జిల్లాలకు బీసీ సామాజిక వర్గాలకు చెందిన నేతలను, మరో 10 జిల్లాలకు రెడ్డి సామాజికవర్గ నేతలకు అవకాశమిచ్చారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారికి రెండు జిల్లాల చొప్పున అధ్యక్ష పదవులు కేటాయించారు. బ్రాహ్మణ, వెలమ, కమ్మ సామాజిక వర్గాలకు చెందిన ఐదుగురు నేతలను కూడా డీసీసీ అధ్యక్షులుగా నియమించారు. మొత్తం మీద 3 జిల్లాలకు మహిళలను డీసీసీ అధ్యక్షులుగా ప్రకటించగా, అందులో ఇద్దరు ఎమ్మెల్యేల భార్యలు, ఒక మాజీ ఎమ్మెల్సీ సతీమణి ఉన్నారు. ఎమ్మెల్యేలుగా ప్రస్తుతం ఎన్నికయిన సీనియర్లు, యువ శాసనసభ్యులకు, మాజీ ఎమ్మెల్సీలకు, మాజీ డీసీసీ అధ్యక్షులకు కూడా అవకాశమిచ్చారు.

హైదరాబాద్ సిటీకి అంజన్ కొనసాగింపు...

కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ నగర అధ్యక్షుడిగా అంజన్‌కుమార్ యాదవ్‌ను కొనసాగించిన అధిష్టానం ఖమ్మం సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మైనారిటీ నేత జావేద్‌ను నియమించింది. ఖమ్మం రూరల్ జిల్లాకు కమ్మ సామాజిక వర్గానికి చెందిన పువ్వాడ దుర్గాప్రసాద్, నాగెండ్ల దీపక్‌చౌదరిలను అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్షులుగా నియమించారు. ఇటీవలే ప్రకటించిన ములుగు, నారాయణపేట జిల్లాలకు మాత్రం అధ్యక్షులను నియమించలేదు. మహిళా నేతలు గండ్ర జ్యోతి (జయశంకర్ భూపాలపల్లి), కొక్కిరాల సురేఖ (మంచిర్యాల), నిర్మలాగౌడ్ (సంగారెడ్డి)లకు డీసీసీ అధ్యక్షులుగా అవకాశమిచ్చారు. ఇక ఎమ్మెల్యేలుగా ఉన్న వనమా వెంకటేశ్వరరావు (భద్రాద్రి కొత్తగూడెం), పైలట్ రోహిత్‌రెడ్డి (వికారాబాద్)లను కూడా డీసీసీ


మిగతా 2వ పేజీలో ▶



మళ్లీ ఈడీ ముందుకు వాద్రా

- మనీలాండరింగ్ కేసులో రెండో రోజూ హాజరు

- వివరాలు 13లో



ఇంజనీరింగ్‌లో 10,000 సీట్లు కోత!


- కాలేజీల రద్దు కోసం 13 దరఖాస్తులు..
- ఏఐసీటీఈ మంజూరు చేసిన సీట్ల ఆధారంగానే ఫ్యాకల్టీ

- వివరాలు 16లో



త్వరలో హైసెక్యూరిటీ పాస్‌పోర్ట్‌లు

- అత్యంత భద్రతా ఫీచర్లు గల ఈ–చిప్‌లతో తయారీ
- మరో 3 నెలల్లో గ్రేటర్ వాసులకు అందుబాటులోకి



సాక్షి, హైదరాబాద్

గ్రేటర్ వాసులు మరో 3 నెలల్లో అత్యంత భద్రతా ఫీచర్లున్న హై సెక్యూరిటీ పాస్‌పోర్ట్‌లు అందుకోనున్నారు. ఉన్నత విద్య, వైద్యం, పర్యాటకం, తాత్కాలిక నివాసం తదితర అవసరాల నిమిత్తం విదేశీ పర్యటనలు చేసేందుకు పాస్‌పోర్ట్‌లు తప్పనిసరి. దీంతో మహానగరం పరిధిలో నెలకు సుమారు లక్షకు పైగా నూతన పాస్‌పోర్ట్‌ల జారీ, పాతవాటి రెన్యువల్స్ జరుగుతుంటాయి. రాజధానిలోని పాస్‌పోర్ట్ కార్యాలయాల నుంచి పాస్‌పోర్ట్‌లు పొందేవారు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో హైసెక్యూరిటీ గల ఈ–చిప్‌లు ఉండే పాస్‌పోర్ట్‌లను అందజేసేందుకు హైదరాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అనుమతితో దేశవ్యాప్తంగా పాస్‌పోర్ట్‌ల డిమాండ్ అధికంగా ఉన్న నగరాలకు అత్యంత భద్రతా ఫీచర్లతో పాస్‌పోర్ట్‌లను ముద్రించే ప్రింటింగ్ యంత్రాలను సరఫరా చేయనున్నట్లు పాస్‌పోర్ట్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ యంత్రాలను నాసిక్‌లోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ ఆధ్వర్యంలో నిపుణుల పర్యవేక్షణలో తయారు చేస్తున్నట్లు వివరించారు. మరో 3 నెలల తర్వాత నూతనంగా పాస్‌పోర్ట్ దరఖాస్తు చేసుకున్నవారికి, పాతవాటిని రెన్యువల్ చేసుకునేవారికి ఈ–చిప్‌లు ఉన్న అత్యంత భద్రమైన పాస్‌పోర్ట్‌లను అందజేయనున్నారు.

నో ట్యాంపరింగ్: పాస్‌పోర్ట్‌లో అత్యంత కీలకమైన పుట్టిన తేదీ, తండ్రి, భార్య, భర్త పేరు, ఆధార్ నంబర్, ప్రస్తుత, శాశ్వత

మిగతా 2వ పేజీలో ▶

కొత్తగా 2 రెవెన్యూ డివిజన్లు

- కోరుట్ల, కొల్లాపూర్ డివిజన్లకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల
- ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో రెండు కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు కానున్నాయి. జగిత్యాల జిల్లాలో కోరుట్ల, నాగర్‌కర్నూల్ జిల్లాలో కొల్లాపూర్‌లను రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం మెట్‌పల్లి డివిజన్ పరిధిలో ఉన్న కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్ మండలాలతో కోరుట్ల రెవెన్యూ డివిజన్, నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలోని కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, కోడేరు, పెంట్లవెల్లి మండలాలతో కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్‌ల ఏర్పాటుకు ప్రాథమిక నోటిఫికేషన్ ఉత్తర్వులను రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ గురువారం జారీ చేశారు. నోటిఫికేషన్ విడుదలైన 30 రోజుల్లో ఈ ప్రతిపాదనలపై అభ్యంతరాలు, సూచనలను ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయాలకు ఇంగ్లిషు, హిందీ, తెలుగు భాషల్లో పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాళేశ్వరం కాల్వల పనులకు టెండర్లు

- మొత్తం రూ.1,094.56 కోట్ల పనులు
- 21 వరకు టెండర్ల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ దిగువన పూర్వ మెదక్ జిల్లా, రంగారెడ్డి జిల్లాలో కాల్వల నిర్మాణ పనులకు నీటి పారుదల శాఖ టెండర్లు పిలిచింది. మొత్తం రూ.1,094.56 కోట్ల పనులను మూడు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు ఆహ్వానించింది. సంగారెడ్డి కాల్వలను కొండపోచమ్మ దిగువన వర్గల్ మండలం గౌరారం నుంచి మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామం వరకు 37 కిలోమీటర్ల కాల్వను తొలి రీచ్‌గా విభజించారు. దీనికి రూ.365.54 కోట్లకు టెండర్ పిలిచారు. జీడిపల్లి నుంచి నర్సాపూర్ మండల పరిధిలోని చిప్పలపర్తి వరకు 73 కిలోమీటర్ల కాల్వను రెండో రీచ్‌గా విభజించి రూ.375.54 కోట్లతో టెండర్లు పిలిచారు. కొండపోచమ్మ సాగర్ దిగువన ఉన్న రావల్‌కోల్ కాల్వల ద్వారా శామిర్‌పేట్ చెరువు నింపడం, దాని కింద 31 కి.మీ.ల బొమ్మలరామారం కాల్వల ద్వారా 15,676 ఎకరాలకు నీరివ్వడం, ఇదే చెరువు నుంచి కీసర కాల్వ ద్వారా 20 కి.మీ.ల మేర కాల్వలు తవ్వి 4,324 ఎకరాలకు నీళ్లిచ్చే పనులకు మరో రూ.353.48 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. ఈ నెల 8 నుంచి 21 వరకు టెండర్లు స్వీకరిస్తారు. ఈ నెల 22న టెక్నికల్ బిడ్ తెరవనుండగా, 27న ప్రైస్ బిడ్ తెరుస్తారు. తక్కువ ధరకు కోట్ చేసిన ఏజెన్సీలకు పనులు అప్పగిస్తారు. వచ్చే నెలలోనే ఈ పనులను ఆరంభించే అవకాశాలున్నాయి.



గవర్నర్ నరసింహన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గజానన్ మాల్యా

గవర్నర్‌ని కలసిన దక్షిణ మధ్య రైల్వే జీఎం

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే జీఎంగా నియమితులైన గజానన్ మాల్యా గవర్నర్ నరసింహన్‌ని కలిశారు. ఇటీవల జీఎంగా బాధ్యతలు చేపట్టిన గజానన్ గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తరువాత కొద్దిసేపు పలు విషయాలపై చర్చించారు.

ఎన్‌హెచ్‌పీపై వరల్డ్ బ్యాంకుతో చర్చలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులతో వరల్డ్ బ్యాంకు ప్రతినిధులు గురువారం సమావేశమయ్యారు. నదీ జలాల వృథాను అరికట్టడం, భూగర్భ జలాల కాలుష్యం తగ్గించడం, వరదలను కచ్చితంగా అంచనా వేయడం, రిజర్వాయర్ల సామర్థ్యం పెంపునకు అవసరమైన పరిజ్ఞానాన్ని అందించేందుకు ఉద్దేశించిన నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ)పై ఈ భేటీలో చర్చించారు. జల సంరక్షణతో పాటు ఈ రంగంలో పలు అంశాలపై పరిశోధనల కోసం ఎన్‌హెచ్‌పీకి 50 శాతం నిధులు ప్రపంచ బ్యాంకు సమకూర్చనుండగా, మరో 50 శాతం కేంద్ర బడ్జెట్ నుంచి కేటాయిస్తారు. ఈ నిధుల అంశమై వరల్డ్ బ్యాంకు ప్రతినిధులతో నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్, ఈఎన్‌సీ మురళీధర్, సీఈ శంకర్‌నాయక్, భూగర్భ జల శాఖ డైరెక్టర్ పండిత్ మధునురేలు చర్చించారు.

అంగన్‌వాడీ టీచర్లతో సమాన వేతనాలివ్వాలి

కేంద్ర మంత్రిని కోరిన తెలంగాణ మినీ అంగన్‌వాడీ టీచర్లు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో, దేశవ్యాప్తంగా పనిచేస్తున్న మినీ అంగన్‌వాడీ టీచర్లకు అంగన్‌వాడీ టీచర్లతో సమాన వేతనాలు కల్పించాలని, వేసవి సెలవులు ఇవ్వాలని కేంద్ర శిశు, సంక్షేమ శాఖ మంత్రి మేనకాగాంధీకి తెలంగాణ మినీ అంగన్‌వాడీ టీచర్లు విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర ప్రతినిధులు వరలక్ష్మీ, యాదమ్మ, సంధ్య, శోభ, రేణుక, సుజాత తదితరులు గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలసి ఈ మేరకు వినతిపత్రాన్ని ఇచ్చారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇస్తున్న రూ.10,500 వేతనాన్ని వారికంటే ఎక్కువ పనిచేస్తున్న మినీ అంగన్‌వాడీలకు కూడా ఇవ్వాలని కోరారు. వేసవి సెలవులు కూడా లేకుండా పనిచేస్తున్న తమకు గౌరవ వేతనం విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని వివరించారు. తమ విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ఈ విషయమై ఆర్థిక మంత్రితో మాట్లాడి త్వరలోనే మాట్లాడతానని హామీ ఇచ్చినట్టు సంఘం ప్రతినిధులు మీడియాకు తెలిపారు.



గవర్నర్ నరసింహన్‌కు పంచాయతీ ఎన్నికల నివేదికను అందజేస్తున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి. నాగిరెడ్డి

గవర్నర్‌కు పంచాయతీ ఎన్నికల నివేదిక

సాక్షి, హైదరాబాద్: ఇటీవల ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికల నివేదికను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డి గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌కు సమర్పించారు. ఈ మేరకు గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో సమావేశమైన నాగిరెడ్డి, పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన తీరును ఆయనకు వివరించారు.

ఇన్‌చార్జి కమిటీల పదవీకాలం పొడిగింపు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రాథమిక చేనేత సంఘాల పర్సన్ ఇన్‌చార్జి కమిటీల పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ఈ మేరకు గురువారం సహకారశాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ప్రాథమిక చేనేత సంఘాల పర్సన్ ఇన్‌చార్జి కమిటీల పదవీకాలం ఈ నెల 11తో ముగియనుంది. దీంతో ఎన్నికలు జరిగే వరకు లేదా మరో ఆరు నెలలు పర్సన్ ఇన్‌చార్జిల పాలన కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

‘భవిష్యత్’ బలహీనం!

సత్తువ లేని భావిపౌరులు • వసతిగృహాల్లోని చిన్నారుల్లో రక్తహీనత

65.3 శాతం	13.1 శాతం
పిల్లల్లో అనీమియా	పిల్లల్లో తీవ్ర సమస్యలు

- బాలుర కంటే బాలికల్లోనే అత్యధికం
- ఆరోగ్యకరంగా ఉన్నది 34.7 శాతమే
- నివారణ చర్యలు పట్టని సంక్షేమ శాఖలు



శరీరానికి సరిపడా పోషకాహారాన్ని తీసుకోకపోవడంతో భావిపౌరులు సత్తువ కోల్పోతున్నారు. వసతిగృహాల్లో పౌష్టికాహారాన్ని ఇస్తున్నప్పటికీ అక్కడి విద్యార్థుల్లో రక్తహీనత అధికంగా ఉంటోంది. తీసుకునే ఆహారంలో పోషకాలు లోపిస్తున్నాయో... లేక సరైన ఆహారమే అందడం లేదో కాని అత్యధికుల్లో రక్తహీనత లోపం కనిపిస్తోంది. ఒక ప్రైవేటు సంస్థ చేసిన సర్వేలో ఈ విషయం వెలుగు చూసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,245 సంక్షేమ వసతి గృహాలున్నాయి. వీటి పరిధిలో 2.85 లక్షల మంది విద్యా ర్థులు వసతి పొందుతున్నారు. ప్రస్తుతమున్న వసతి గృహాల్లో 1,722 వసతి గృహాలు ప్రీ మెట్రిక్ హాస్టళ్లు కాగా.. మిగతా 523 వసతి గృహాలు పోస్టుమెట్రిక్ హాస్టళ్లు. తాజాగా ప్రీ మెట్రిక్ హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్య స్థితిపై ఓ సంస్థ అధ్యయనం చేసింది. అనీమియా కారణంగా దాదాపు 65.3 శాతం చిన్నారుల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తేలింది. వీరిలో అత్యధికంగా బాలికలే ఉండడం గమనార్హం. – సాక్షి, హైదరాబాద్

రక్తహీనత బాలుర కంటే బాలికల్లోనే అత్యధికంగా ఉంది. సాధారణంగా పిల్లల రక్తంలో ప్రతీ డెసీలీటర్‌కు కనీసం 12 గ్రాముల హిమోగ్లోబిన్ ఉండాలి. అంతకంటే తక్కువగా ఉంటే రక్తహీనత సమస్య ఉన్నట్లే. కానీ చాలామంది చిన్నారుల్లో 10 గ్రాములు/డీఎల్ కంటే తక్కువ ఉన్నట్లు తేలింది. ప్రతి 100 మంది బాలికల్లో 55 మందిలో రక్తహీనత తీవ్రంగా ఉంది. అదే బాలుర కేటగిరీలో 50 మంది పిల్లల్లో రక్తహీనత ఉన్నట్లు స్పష్టమైంది. ప్రతి 100 మందిలో 13 మంది పిల్లల ఆరోగ్యం ప్రమాదకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. రక్తహీనత తోపాటు పోషక లోపాలతో ఇతర అనారోగ్యాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. నూరు మందిలో కేవలం 35 మంది పిల్లలు మాత్రమే ఆరోగ్యకరంగా ఉన్నట్లు సర్వేలో తేలింది.

అనర్థాలకు దారితీసేలా..

ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 లోపించిన చిన్నారుల్లో రక్తహీనత సమస్యలు తలెత్తుతాయి. పిల్లల్లో రక్తహీనత సమస్య పలు అనర్థాలకు దారితీస్తాయి. ముఖ్యంగా చిన్నారుల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. అదే విధంగా శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పలు రకాల ఇన్ఫెక్షన్లు సోకి దీర్ఘకా లిక వ్యాధులకు ఆస్కారం ఉంటుంది. రోగ నిరోధక శక్తి కోల్పోయి పలు రకాల వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. దీంతో వారు ఏకాగ్రతను క్రమంగా కోల్పోయి అనారోగ్యానికి గురవుతారు. ఏఎన్‌ఎమ్‌లు వసతి గృహాలకు క్రమం తప్పకుండా వెళ్లి పిల్లల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించాల్సి ఉంది. అయితే అదేమీ లేకపోవడంతో పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మరోవైపు సంక్షేమ శాఖలు కూడా దీనికి సంబంధించి ఎటువంటి నివారణ చర్యలను చేపట్టడం లేదు.

సాగుకు నీళ్లివ్వాల్సిందే..

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే, నీటి పారుదల ఈఎన్‌సీలు మురళీధర్, అనిల్‌కుమార్, నాగేందర్, సీఈలు శంకర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధుల విడుదలకు ఆదేశం

ఎస్సారెస్పీ పరిధిలోని మొత్తం ఆయకట్టుకు నీరందించడానికి అనుసరించాల్సిన వ్యూహంపై కూలంకశంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఎక్కడెక్కడ ఏయే సమస్యలున్నాయో గుర్తించి అప్పటికప్పుడే వాటిని పరిష్కరించారు. భూసేకరణకు, ఇతర పనులకు కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. ‘గోదావరిలో పుష్కలంగా నీళ్లున్నాయి. ఈ నీటిని ఎత్తిపోయడానికి భారీ వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తున్నాం. ఈ ఏడాది వర్షాకాలం నుంచే మేడిగడ్డ నుంచి నీరు ఎత్తిపోసి మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యాములకు తరలిస్తాం. అలా తరలించిన నీటిని ఎస్సారెస్పీ కాల్వల ద్వారా అన్ని చెరువులను మళ్లించాలి. చెరువులను నింపడమే మొదటి ప్రాధాన్యంగా గుర్తించాలి. దీనికోసం ఎస్సారెస్పీ కాల్వలన్నింటినీ మరమ్మత్తు చేయాలి. కావాల్సిన చోట వెంటనే తూములను నిర్మించాలి. భూసేకరణ పూర్తి చేయాలి. రెండో దశలో నిర్మించిన కాల్వలకు లైనింగ్ పూర్తి చేయాలి. అవసరమైతే కాల్వల నీటి ప్రవాహ ఉధృతి సామర్థ్యాన్ని (క్యారీయింగ్ కెపాసిటీ) పెంచుకోవాలి. పనులను నిర్ణయించేందుకు వెంటనే 50 మంది ఇంజనీర్లను నియమించండి. యుద్ధ ప్రాతిపదికన సర్వే చేసి అంచనాలు రూపొందించండి. కావాల్సిన నిధులు వెంట వెంటనే మంజూరు చేస్తాం. అన్ని పనులు పూర్తి చేసి ఈ వర్షాకాలానికి ఎట్టి పరిస్థితుల్లో ఎస్సారెస్పీ పరిధిలోని 14.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి’ అని కేసీఆర్ స్పష్టం చేశారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ప్రాంతం నుంచి మొదలుకుని చివరి ఆయకట్టు కలిగిన డోర్నకల్, తుంగతుర్తి, భూపాలపల్లి, పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల వరకు అన్ని దిక్కులకు నీరందాలని అధికారులను ఆదేశించారు.

సీఎం చెప్పిన మరికొన్ని కీలకాంశాలు:

- కాకతీయ కాలువ, వరద కాలువ మధ్య ఉన్న 1.10 లక్షల ఎకరాలకు సాగునీరందించాలి. అవసరమైన చోట తూములు ఏర్పాటు చేయాలి. వెంటనే ఈ పనుల కోసం సర్వే నిర్వహించి పనులు ప్రారంభించాలి.
- ఎస్సారెస్పీ రెండో దశలో అన్ని డిస్ట్రిబ్యూటరీలకు లైనింగ్ చేయాలి. దీనికోసం వెంటనే అంచనాలు రూపొందించి టెండర్లు పిలవాలి. ఎండాకాలంలోపు పనులు పూర్తి కావాలి.
- ఎస్సారెస్పీ కాల్వల పనులు అన్ని చోట్ల పనులు సమాంతరంగా జరగాలి.
- అన్ని ప్రాజెక్టుల కాల్వలకు సంబంధించిన హద్దులను నిర్ణయించాలి. ప్రాజెక్టుల భూముల సమగ్ర వివరాలను రూపొందించాలి.
- ఎస్సారెస్పీ పంట కాల్వలను ఎవరైనా దున్నుకుంటే వాటిని పునరుద్ధరించాలి. ఈ విషయంలో ఎమ్మెల్యేలు చొరవ చూపి రైతులను ఒప్పించాలి.
- అన్ని ప్రాజెక్టుల సమగ్ర స్వరూపం తయారు చేయాలి. ప్రతి ప్రాజెక్టుకు ఆపరేషన్ రూల్స్ తయారు చేయాలి.
- ప్రాజెక్టుల నిర్వహణ వ్యయం అంచనా వేయాలి. వచ్చే బడ్జెట్‌లో నిధులు.
- చనాఖా–కొరాటా పనులు మే 15 నాటికి పూర్తి కావాలి. కడెం గేటు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలి.
- దేవాదుల నీటిని తరలించే రామప్ప, లక్నవరం, ఘన్‌పూర్, పాకాల కాల్వల పనులను ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ ఎండాకాలంలోనే పూర్తి చేయాలి.
- దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించతలపెట్టిన పాలకుర్తి, ఉప్పుగల్లు, చెన్నూరు రిజర్వాయర్ల నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలి.

రూ.18వేలతో ఐఏఎస్ ఇంట పెళ్లి!

సాక్షి, విశాఖపట్నం: సామాన్యుడి పెళ్లికే రూ.లక్షలు మంచినీళ్లలా ఖర్చుపెడుతున్న రోజులివి. అలాంటిది ఓ ఐఏఎస్ కుమారుడి వివాహానికి రూ.18 వేలు, అందులో ఒకొక్కరికి భోజనానికి రూ.20లోపే వెచ్చిస్తున్నారంటే ఆశ్చర్యంగా ఉంది కదా? విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ.. పూర్వపు వుడా) కమిషనర్ బసంత్‌కుమార్ కుమారుడి వివాహం ఈనెల 10వ తేదీ ఉదయం విశాఖ సాగర తీరంలోని వుడా పార్క్ హెలిపాడ్ గ్రౌండ్‌లో జరగనుంది. రాధాస్వామి సత్సంగ్ సభ్యులు వివాహ వేడుకలను చాలా నిరాడంబరంగా జరుపుకుంటారు. వీరి వివాహ ఖర్చు ఎంతో కుటుంబ పెద్ద ఆదాయాన్ని బట్టి సత్సంగ్ గురువు నిర్దేశిస్తారు. ఆ మొత్తానికి మించి ఒక్కపైసా కూడా అధికంగా ఖర్చు పెట్టడానికి వీల్లేదు. రాధాస్వామి సత్సంగ్ సభ్యుడైన బసంత్‌కుమార్.. తన కుమార్తె బినతికి రెండేళ్ల క్రితం జరిగిన వివాహ ఖర్చుకు సత్సంగ్ ప్రతినిధులకు రూ.18 వేలు మాత్రమే చెల్లించారు. అయితే, అన్ని లెక్కలూ సరిచూశాక రూ.1,900 వెనక్కి ఇచ్చేశారు. అంటే, ఆమె పెళ్లికి రూ.16,100 మాత్రమే ఖర్చయింది! ఈసారి రాబడిని బట్టి కుమారుడు అభినవ్ మానస్ పెళ్లి ఖర్చు రూ.18 వేలుగా నిర్ణయించారు. ఈ వివాహ వేడుకకు బసంత్‌కుమార్ 100 మందిని ఆహ్వానించారు. వీరిలో అమ్మాయి తరఫున 65, అబ్బాయి తరఫున 35 మంది ఉన్నారు. పెళ్లిరోజు భోజనాల ఖర్చు ఒకొక్కరికి రూ.20కి మించడానికి వీల్లేదు. అందుకనుగుణంగా ఆ రోజు పులిహోర, బిర్యానీ, స్వీటు, రెండు కూరలు, పెరుగుతో భోజనం పెడతారు. నగరంలోని దయాళ్‌నగర్ సత్సంగ్ కాలనీలో పండిన కూరగాయలను ఉచితంగా సమకూర్చడంతో ఖర్చు ఆదా అవుతుంది. మరోవైపు.. వధువు పెళ్లి ఖర్చు కూడా రూ.18 వేలుగానే నిర్ణయించారు. పెళ్లి చేసే పురోహితునికి (సత్సంగ్ సభ్యుడు) సంభావన కేవలం రూ.వెయ్యి మాత్రమే ఇస్తారు. పెళ్లికి ముందు జరిగే సగాయ్ (నిశ్చితార్థం)కి వచ్చే వారికి రూ.5కు మించని స్వీట్ అందజేస్తారు. వివాహ అనంతరం ఇచ్చే రిసెప్షన్ ఖర్చు కూడా ఒకొక్కరికి రూ.20 మించకుండా చూస్తారు. ఇక పెళ్లి కార్డు ఖరీదు రూ.5 లోపే. ఇలా ఈ ఐఏఎస్ కుమారుడి పెళ్లి రూ.18 వేలకు మించకుండానే అయిపోతుందన్నమాట!

చెన్నైలో 8 కిలోల బంగారం దోపిడీ

అన్నానగర్(చెన్నై): చెన్నైలో రూ.2.75 కోట్ల విలువైన 8 కిలోల బంగారు నగలను పట్టపగలే ముగ్గురు వ్యక్తులు దోచుకెళ్లారు. ముంబాయికి వెళ్లాల్సిన బంగారు నగలను కొరియర్ బాయ్ స్కూటర్‌పై ఎయిర్‌పోర్ట్‌కు తీసుకెళుతుండగా ఈ దోపిడీ జరిగింది. బైకుపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు వాహనాన్ని ఢీకొట్టి కిందపడిన అతనిపై కారంపొడి చల్లి నగల బ్యాగుతో ఉడాయించారు. ఈ ఘటన తమిళనాడులోని కోవైలో గురువారం చోటు చేసుకుంది. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన మాంగోసింగ్ కుమారుడు పృథ్వీసింగ్ (26) కోవై మిల్‌రోడ్డుబాక్కం, మరక్కడైలో ప్రైవేటు కొరియర్ సర్వీస్ సంస్థలో ఉద్యోగి. కోవైలో ఉన్న నగల తయారీ కేంద్రం నుంచి ముంబైకి పంపుతుంటారు. వీటిని ఈ కొరియర్ సంస్థ ద్వారానే ఎయిర్‌పోర్ట్ వరకు తరలిస్తారు. ఈ క్రమంలో ముంబైకి పంపేందుకు ఇచ్చిన 8 కిలోల బంగారాన్ని పృథ్వీసింగ్ గురువారం ఉదయం 5.50కి బ్యాగులో పెట్టుకుని బైక్‌లో విమానాశ్రయానికి బయలుదేరాడు. మధ్యలో బైకుపై హెల్మెట్ ధరించి వచ్చిన ముగ్గురు పృథ్వీసింగ్ వెళుతున్న స్కూటర్‌ను ఢీకొన్నారు. అతను కిందపడగానే ముఖంపై కారంపొడి చల్లి, నగల బ్యాగ్‌ను లాక్కొని పరారయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

కాంగ్రెస్‌కు నయా జోష్

▶ మొదటి పేజీ తరువాయి

అధ్యక్షులుగా నియమించారు. రంగారెడ్డి జిల్లాకు సబితా ఇంద్రారెడ్డి ప్రతిపాదించిన నర్సింహారెడ్డిని అధ్యక్షుడిగా ప్రకటించి వికారాబాద్‌కు చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి సన్నిహితుడు రోహిత్‌రెడ్డికి అవకాశమిచ్చారు. నల్లగొండ జిల్లాకు అనూహ్యంగా లంబాడా సామాజిక వర్గానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కె. శంకర్ నాయక్‌ను నియమించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన టి.నర్సారెడ్డిని సిద్దిపేట జిల్లాకు అధ్యక్షుడిగా నియమించడం గమనార్హం.

కొత్త డీసీసీలు వీరే...

భార్గవ్ దేశ్‌పాండే	ఆదిలాబాద్
కొక్కిరాల సురేఖ	మంచిర్యాల
రామారావు పటేల్ పవార్	నిర్మల్
ఆత్రం సక్కు	ఆసిఫాబాద్
కె. మృత్యుంజయం	కరీంనగర్
ఎ. లక్ష్మణ్‌కుమార్	జగిత్యాల
ఈర్ల కొమురయ్య	పెద్దపల్లి
సత్యనారాయణ గౌడ్	రాజన్న సిరిసిల్ల
ఎం. మోహన్‌రెడ్డి	నిజామాబాద్
కైలాష్ శ్రీనివాస్‌రావు	కామారెడ్డి
నాయిని రాజేందర్‌రెడ్డి	వరంగల్ అర్బన్ అండ్ రూరల్
గండ్ర జ్యోతి	భూపాలపల్లి
జంగా రాఘవరెడి	జనగామ
నిర్మలా గౌడ్	సంగారెడ్డి
తిరుపతిరెడ్డి	మెదక్
టి.నర్సారెడ్డి	సిద్దిపేట
పి.రోహిత్‌రెడ్డి	వికారాబాద్
కూన శ్రీశైలం గౌడ్	మేడ్చల్ మల్కాజిగిరి
చల్లా నరసింహారెడ్డి	రంగారెడ్డి
ఒబేదుల్లా కొత్వాల్	మహబూబ్‌నగర్
శంకర్ ప్రసాద్	వనపర్తి
పటేల్ ప్రభాకర్‌రెడ్డి	జోగులాంబ గద్వాల
డాక్టర్ వంశీకృష్ణ	నాగర్ కర్నూలు
వెంకన్న యాదవ్	సూర్యాపేట
బి.భిక్షమయ్య గౌడ్	యాదాద్రి భువనగిరి
జె.భరత్ చంద్రా రెడ్డి	మహబూబాబాద్
కె.శంకర్ నాయక్	నల్లగొండ
వనమా వెంకటేశ్వరరావు	కొత్తగూడెం
పువ్వాడ దుర్గాప్రసాద్	ఖమ్మం

సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు వీరే...

గ్రేటర్ హైదరాబాద్	అంజన్‌కుమార్ యాదవ్
వరంగల్ సిటీ	కేదారి శ్రీనివాసరావు
నిజామాబాద్ సిటీ	కేశ వేణు
ఖమ్మం సిటీ	జావీద్

వీరితోపాటు ఖమ్మం సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్. దీపక్ చౌదరిని నియమించారు.

మోగనున్న జరిమానాల మోత!

ఆచరణాత్మకంగా వివిధ అంశాల అమలు • పంచాయతీరాజ్ చట్టంలో కఠిన నిబంధనలు

సాక్షి, హైదరాబాద్: పంచాయతీల్లో కొత్త పాలక మండళ్లు ఏర్పడిన నేపథ్యంలో గ్రామాల్లో నూతన మార్పులకు శ్రీకారం చుట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం కార్యాచరణ ప్రణాళిక అమలుకు నడుం బిగించింది. కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని అమల్లోకి తీసుకురావడం ద్వారా ప్రజల రోజువారీ జీవనవిధానం, శైలిలో మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గతంలోని చట్టాల్లో వివిధ అంశాలకు సంబంధించి నిబంధనలున్నా వాటిని పెద్దగా పట్టించుకున్న, కచ్చితంగా అమలుచేసిన సందర్భాలు తక్కువే. ఈ నేపథ్యంలో కొత్త చట్టం ద్వారా తీసుకొచ్చిన వివిధ అంశాలను ఆచరణాత్మకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని భావిస్తోంది. పరిసరాల పరిశుభ్రత కొనసాగేలా చూడటం తోపాటు వివిధ రూపాలు, చర్యల ద్వారా ఉల్లంఘనలకు పాల్పడే వారినుంచి జరిమానా వసూలు చేయాలని యోచిస్తోంది. తద్వారా వారిలో పరివర్తన తీసుకురావడంతో పాటు ఆయా నిబంధనలు పటిష్టంగా అమలుచేసే దిశగా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయంతో ఉంది. కొత్త చట్టంలోని అంశాల గురించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాక నియమ నిబంధనలు అమలు చేయడం మొదలుపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఉల్లంఘనులను ఉపేక్షించరు..

కొత్తగా నిర్దేశించిన నిబంధనలు కచ్చితంగా అమల్లోకి వస్తే పల్లెల్లో జరిమానాల మోత మోగనుంది. గ్రామాల పరిధిలో వివిధ అంశాలకు సంబంధించి ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కొరడా ఝుళిపించే అవకాశాలున్నాయి. గ్రామపంచాయతీలు రూపొందించిన నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే వ్యక్తి నుంచి పంచాయతీ ఖరారు చేసిన మేర జరిమానా (రూ.ఐదు వేలు మించకుండా) వసూలు చేసేలా ఏర్పాట్లు చేశారు. ఈ ఉల్లంఘనలు అదే రీతిలో కొనసాగించిన పక్షంలో రోజుకు రూ.వంద చొప్పున జరిమానా విధిస్తారు.

రోడ్లపై అశుద్ధం పారితే రూ. 5వేలు.



- పబ్లిక్ రోడ్లపై మురుగు, అశుద్ధం ప్రవహింపజేస్తే రూ.ఐదువేలు జరిమానా
- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ మార్కెట్‌ను తెరిచి ఉంచితే రూ.ఐదు వేలు
- మురుగునీటి కాల్వ పూడ్చి, దానిపై అనధికార భవన నిర్మాణం చేపడితే రూ.రెండు వేలు
- ఆక్రమణలు తొలగించడంలో, మార్చుచేయడంలో విఫలమైతే రూ.రెండు వేలు
- రోడ్లపై, గ్రామ పంచాయతీ పరిధిలోని ఇతర చోట్ల అనుమతి లేకుండా మొక్కలు నాటితే రూ. 2 వేలు



- పంచాయతీ పరిధి, క్రమబద్ధీకరించిన భూమి లేదా పోరంబోకు భూమిలో చెట్లు అనుమతి లేకుండా నరికితే రూ. రెండు వేలు
- గ్రామపంచాయతీ ఆస్తులు ఆక్రమించుకున్నా లేదా అనధికారికంగా కలిగి ఉన్నా రూ.2 వేలు
- లైసెన్స్ లేకుండా లేదా ఇచ్చిన లైసెన్స్‌లకు విరుద్ధంగా రోడ్డును ఆనుకుని ఉన్న స్థలాన్ని వాహనాలు నిలిపి ఉంచే ప్రదేశంగా వాడుకుంటే రూ. 2వేలు
- లైసెన్స్ లేకుండా ఇచ్చిన లైసెన్స్‌లకు విరుద్ధంగా కొత్త ప్రైవేట్ పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినా, ప్రైవేట్ పార్కింగ్ స్థలాన్ని కొనసాగిస్తే రూ. 2వేలు
- వధశాలకు వెలుపల పశువులను వధించినా, చర్మం వలిచినా రూ. 2 వేలు
- రిజిస్ట్రేషన్ లేకుండా అనధికార శ్మశానాలు తెరవడం, శవాలు ఖననం చేస్తే రూ.వెయ్యి
- తాగునీటి సరఫరా వనరుకు లేదా నివాస ప్రాంతాలకు 200 మీటర్ల పరిధిలో శవాల ఖననం, దహనం వంటివి చేస్తే రూ.వెయ్యి
- నిషేధిత స్థలంలో శవాలు పాతిపెట్టినా, దహనం చేసి, ఇతర పద్ధతులు పాటించినా రూ.వెయ్యి



- పబ్లిక్ రోడ్డుపై లేదా రోడ్డు మీదుగా అనధికారికంగా గోడ లేదా ఫెన్స్ నిర్మిస్తే రూ.వెయ్యి
- నీటిని వృథా చేయకుండా నిషేధిస్తూ ఇచ్చిన నోటీసును పట్టించుకోకపోతే రూ.500
- తాగునీటి కోసం ఏర్పాటుచేసిన స్థలంలో బట్టలు ఉతికితే రూ.500
- తాగునీటి ఉపయోగంకోసం ఏర్పాటు చేసిన స్థలంలో స్నానం, ఇతర చర్యలకు పాల్పడితే రూ.500
- మంచినీటి ఉపయోగం కోసం ఏర్పాటు చేసిన చోట్ల హానికరమైన వస్తువులను ఉంచితే రూ.500
- తాగునీరు, స్నానం చేయడానికి లేదా బట్టలు ఉతకడానికి ఏర్పాటు చేసిన స్థలంలో మురుగునీటిని, మురుగు కాల్వలు, మొదలైన వాటిని అనుమతిస్తే రూ.500 జరిమానా విధించనున్నారు.

ఛత్తీస్‌లో ఎన్‌కౌంటర్

▶ మొదటి పేజీ తరువాయి

ఈ కాల్పుల్లో పదిమంది మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి లోడ్ చేసిన 11 గన్లు, 315 రివాల్వర్లు, భారీగా మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను గుర్తించాల్సి ఉందని, పూర్తి వివరాలను తర్వాత వెల్లడిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోనూ, ఈ ఏడాదిలోనూ ఇది తొలి ఎన్‌కౌంటర్ కావడం గమనార్హం.

త్వరలో హైసెక్యూరిటీ పాస్‌పోర్ట్‌లు

▶ మొదటి పేజీ తరువాయి

చిరునామా వంటి వ్యక్తిగత వివరాలకు అత్యంత భద్రత కల్పించేందుకే ఈ హైసెక్యూరిటీ పాస్‌పోర్ట్‌లు జారీ చేయాలని విదేశాంగ శాఖ సంకల్పించింది. ప్రస్తుతం జారీ చేస్తున్న 36 పేజీలు లేదా 60 పేజీల బుక్‌లెట్‌లా ఉండే హైసెక్యూరిటీ పాస్‌పోర్ట్‌లో అత్యంత నాణ్యత ఉండే కాగితాన్ని వినియోగించడంతోపాటు పేజీల్లో అంతర్లీనంగా ఈ–చిప్‌లను పొందుపరచనున్నారు. ఒకవేళ ఇతరుల ఫొటో పెట్టి ట్యాంపరింగ్ చేసేందుకు ప్రయత్నిస్తే ఈ–చిప్‌ల ద్వారా పాస్‌పోర్ట్ కార్యాలయానికి సందేశం అందుతుందని పాస్‌పోర్ట్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. భద్రత పరంగా ఇవి అత్యంత సురక్షితమని తెలిపారు. ఇక ఈ–చిప్ ఉన్న పాస్‌పోర్ట్‌ల జారీకి ప్రస్తుతం ఉన్న చార్జీలే వర్తిస్తాయని చెప్పారు.

షోరూముల్లో బయోమెట్రిక్

- మార్చి 1 నాటికి మిషన్లు ఏర్పాటు చేసుకోవాలని వాహన డీలర్లకు ఆదేశాలు
- తాత్కాలిక రిజిస్ట్రేషన్లలో పారదర్శకత పెంచేందుకే
- వాహన సాంకేతిక వివరాలు, ఆధార్ డేటాబేస్‌తో లింకు
- 'షోరూమ్‌లోనే రిజిస్ట్రేషన్' ప్రతిపాదనకు ముందడుగు

సాక్షి, హైదరాబాద్: ఇకపై వాహన తాత్కాలిక రిజిస్ట్రేషన్ల కోసం ఆధార్ అనుసంధానం మరింత పకడ్బందీ కానుంది. వాస్తవానికి వాహనాల రిజిస్ట్రేషన్లకు ఆధార్ అనుసంధానం గతంలోనూ ఉన్నదే. అయితే కొందరు డీలర్లు, ఏజెంట్లు వాహనాల రిజిస్ట్రేషన్ల విషయంలో పలు అవకతవకలకు పాల్పడుతున్నారు. వీటిని నిరోధించేందుకు రవాణాశాఖ కొత్త నిబంధన తీసుకువచ్చింది. దీని ప్రకారం వాహనాల రిజిస్ట్రేషన్లలో ఆధార్‌తో అనుసంధానంకోసం బయోమెట్రిక్ యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని డీలర్లకు ఆదేశాలు జారీ చేసింది. తాజాగా ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో పలువురు ఆటోమొబైల్ డీలర్లతో జేటీసీ రమేశ్ సమావేశమయ్యారు. మార్చి 1 నాటికి అంతా బయోమెట్రికల్ యంత్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనాల రిజిస్ట్రేషన్లలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఈ విధానం దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

నేపథ్యమేంటి?

2008 నుంచి ఆటోమొబైల్ డీలర్లు చేసే టెంపరరీ రిజిస్ట్రేషన్‌ను రవాణాశాఖ ఆన్‌లైన్ చేసింది. దీనిప్రకారం పన్నులు, ఇతర ఫీజులకు సంబంధించి అన్ని చెల్లింపులు ఆన్‌లైన్‌లోనే జరపాలి. అప్పుడే డీలర్ టెంపరరీ రిజిస్ట్రేషన్ చేసేందుకు అర్హుడవుతాడు. పర్మినెంట్ రిజిస్ట్రేషన్‌కు కావాల్సిన అన్ని పత్రాలను ఆన్‌లైన్‌లోనే డీలర్లకు రవాణాశాఖ అందుబాటులో ఉంచింది. వీటిని ప్రింట్ తీసి వాహన యజమానికి ఇవ్వాలి. యజమానులు అడ్రస్ ప్రూఫ్, పాన్‌కార్డు తదితర ధ్రువీకరణ పత్రాలతో పర్మినెంట్



రిజిస్ట్రేషన్ కోసం ఆర్టీఏ ఆఫీసుకు వెళ్లేవారు. వాహన యజమాని వివరాలు పొందుపరిచే క్రమంలో ఆధార్ నెంబరును కూడా చేర్చాల్సి ఉంది. కానీ, ఈ వ్యవహారంలో కొన్నిసార్లు అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు రవాణాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

ప్రస్తుతం స్థానిక రవాణా శాఖ కార్యాలయాలు వాహనాల సాంకేతిక వివరాలు (చాసిస్ నెంబరు, ఇంజిన్, యాక్సిల్ సామర్థ్యం, తదితరాలు) పొందుపరుస్తున్నారు. కానీ, రవాణాశాఖ ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం ప్రకారం, కేంద్ర రోడ్డు రవాణా– రహదారుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న వాహన్‌పోర్టల్‌లో ఇకపై ఉత్పత్తిదారులే వాహనాల సాంకేతిక వివరాలు పొందుపరుస్తారు. టెంపరరీ రిజిస్ట్రేషన్ సమయంలో ఇవే వివరాలను ఆటోమొబైల్ డీలర్లు కూడా పొందుపరచాల్సి ఉంటుంది. ఇక ఆధార్ అనుసంధానానికి సంబంధించి రవాణాశాఖ మరో కీలక నిర్ణయం కూడా తీసుకుంది. టెంపరరీ రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ డేటా బేస్‌తో లింక్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం డీలర్లంతా బయోమెట్రిక్ యంత్రాలను సమకూర్చుకోవాలని ఆదేశించింది. ఆధార్ అనుసంధానం సమయంలో ఓటీపీ లేదా బయోమెట్రిక్ పద్ధతుల ద్వారా ఆధార్ వివరాలను ధ్రువీకరించుకునే వీలు కల్పించింది. ఇకపై తప్పుడు ఆధార్ వివరాలు సమర్పించే కేటుగాళ్లకు కళ్లెం పడనుంది.

షోరూముల్లో రిజిస్ట్రేషన్!

ఏప్రిల్ 1 నుంచి నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాల రిజిస్ట్రేషన్ షోరూముల్లోనే చేయాలని గతేడాది ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. మార్చి 1 నుంచి బయోమెట్రిక్ యంత్రాలు సమకూర్చుకోవాలని తాజాగా రవాణాశాఖ ఆదేశాలు జారీచేయడంతో ఈ విధానంలో ముందడుగు పడినట్లేనని భావించవచ్చని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇదేగనక వాస్తవ రూపం దాలిస్తే.. ఇకపై వాహనాల రిజిస్ట్రేషన్లలో అవకతవకలకు ముకుతాడు పడినట్లే.

స్వదేశానికి 30 మంది విద్యార్థులు!

- అమెరికాలో అక్రమ నివాస వివాదం నేపథ్యంలో..
- తెలుగు సంఘాల సహకారంతో క్షేమంగా భారత్‌కు

హైదరాబాద్: అమెరికాలో వీసా ముగిసినా అక్రమంగా నివాసం ఉంటూ దొరికిపోయిన తెలుగు విద్యార్థుల్లో 30 మంది భారత్‌కు చేరుకున్నారు. అమెరికా అధికారుల 'పే టు స్టే' కుంభకోణంలో దొరికిపోయినప్పటికీ.. అరెస్టు కాని, నోటీసులు అందుకోని విద్యార్థులను ముందుగా భారత్ పంపించేందుకు అక్కడి తెలుగు సంఘాలు చొరవ తీసుకుంటున్నాయి. బాధిత విద్యార్థు లకు దౌత్యపరమైన సాయం అందిం చడంతోపాటు వారిని స్వదేశానికి పంపించడంలో క్రియాశీలకంగా వ్యవ హరిస్తున్నాయి. ఇందులో భాగంగానే 30 మంది తెలుగు విద్యార్థులు స్వదేశానికి తిరుగు పయనమయ్యారు. వీసా గడువు ముగిసినప్పటికీ.. నిబంధనలకు విరుద్ధంగా అక్కడ ఉంటూనే మళ్లీ విద్యార్థి వీసా పొందాలనుకునే ప్రయత్నంలో అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అధికారులు 'యూనివర్సిటీ ఆఫ్ ఫార్మింగ్టన్' పేరుతో పన్నిన ఉచ్చులో తెలుగువారితోపాటు 600 మంది భారతీయ విద్యార్థులు చిక్కుకున్న సంగతి తెలిసిందే. ఇందులో 80% మంది తెలుగువారే. ఈ మొత్తం ప్రక్రియలో రిక్రూటర్స్‌గా పనిచేసిన ఎనిమిది మంది విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయం వెలుగులోకి వచ్చినప్పటినుంచి అమెరికాలోని తెలుగు సంఘాలు.. ఈ విద్యార్థులను క్షేమంగా భారత్ పంపించేందుకు భారత దౌత్య అధికారుల సాయంతో తీవ్రంగా కృషిచేస్తున్నాయి.

12న న్యాయవాదుల దేశవ్యాప్త నిరసన

సాక్షి, హైదరాబాద్: డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 12న న్యాయవాదులు దేశవ్యాప్తంగా నిరసనకు దిగనున్నారు. ఆయా రాష్ట్ర రాజధానుల్లో హైకోర్టు నుంచి గవర్నర్ నివాసం వరకు ప్రదర్శనలు నిర్వహించి, డిమాండ్లపై గవర్నర్లకు వినతిపత్రాలు సమర్పించనున్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసినట్లు తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిమాండ్ల విషయంలో ఈ నెల 11న అన్ని న్యాయవాద సంఘాలు కూడా సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేసి, అందులో తీర్మానాలు చేసి, వాటిని కలెక్టర్లు, ఎంపీల ద్వారా ప్రధాన మంత్రికి చేరేలా చూడాలని కోరారు.

‘ట్రావెన్‌కోర్’ వైఖరి అభ్యంతరకరం

టెంపుల్స్ ప్రొటెక్షన్ మూవ్‌మెంట్ కన్వీనర్ సౌందరరాజన్



సాక్షి, హైదరాబాద్: అయ్యప్ప ఆలయంలోకి మహిళలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ట్రావెన్‌కోర్ దేవస్థానం సమర్థించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు టెంపుల్స్ ప్రొటెక్షన్ మూవ్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ ఎం.వి.సౌందరరాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా, అయ్యప్ప భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని వెల్లడించారు. దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు జోక్యం అప్రస్తుతం, అసమంజసమని అభిప్రాయపడ్డారు. అయ్యప్ప నైతిక బ్రహ్మచర్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పందలం కుటుంబానికి ఆరాధ్య దైవమైన అయ్యప్ప ఆలయాన్ని పరిరక్షించుకొనేందుకు పందలం వంశం వారు సుప్రీంకోర్టులో తమ వాదన వినిపించేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

నుమాయిష్ మూసివేతకు ఆదేశాలివ్వండి

హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం

సాక్షి, హైదరాబాద్: తగిన అనుమతులు తీసుకోకుండా నిర్వహిస్తున్న నుమాయిష్ ఎగ్జిబిషన్‌ను మూసివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. అలాగే అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి తీసుకోకుండానే ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్న నిర్వాహకులను ప్రాసిక్యూట్ చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ న్యాయవాది ఖాజా ఐజాజుద్దీన్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఎగ్జిబిషన్ నిర్వహణకు అగ్నిమాపక శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకోవడం తప్పనిసరని, అయితే నిర్వాహకులు మాత్రం ఎన్‌వోసీ తీసుకోలేదని పిటిషనర్ వివరించారు. ఇటీవల ఎగ్జిబిషన్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుని భారీ ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అయినా తిరిగి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారని, ఆ తర్వాత కూడా ఎన్‌వోసీ తీసుకోలేదని వివరించారు. ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా మంత్రి ఈటల రాజేందర్ ఉన్నారని, అందువల్ల అధికారులు చర్యలకు వెనకాడుతున్నారని తెలిపారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, ఎన్‌వోసీ లేకుండా నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌ను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే అగ్ని ప్రమాదానికి సంబంధించిన కేసు దర్యాప్తు బాధ్యతలను సీఐడీ లేదా సిట్‌కు బదలాయించేలా ఆదేశాలివ్వాలని కోరారు.

కిసాన్ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్‌గా శ్రీకాంత్

సాక్షి, హైదరాబాద్: కిసాన్ కాంగ్రెస్ జాయింట్ కో–ఆర్డినేటర్‌గా దూలిపూడి శ్రీకాంత్‌ను నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

దుష్ప్రచారం చేసే వారిపై చర్యలు..

పీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద డిమాండ్



సాక్షి, హైదరాబాద్: సోషల్ మీడియా వేదికగా మహిళలపై దుష్ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీజీపీ మహేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజు రోజుకు మహిళలపై దాడులు పెరుగుతున్నాయని చెప్పారు. సోషల్ మీడియా వేదికగా మహిళల పట్ల అవమానకరంగా పోస్టులు చేసేవారిని అదుపు చేయాలని డీజీపీని కోరినట్లు తెలిపారు.

గాంధీలో పెరిగిన స్వైన్‌ఫ్లూ కేసులు

హైదరాబాద్: మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో స్వైన్‌ఫ్లూ విజృంభిస్తోంది. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో స్వైన్‌ఫ్లూ బాధితుల సంఖ్య తొమ్మిదికి చేరింది. వీరితోపాటు మరో ఐదుగురు స్వైన్‌ఫ్లూ అనుమానితులకు గాంధీ డిజాస్టర్‌వార్డులో వైద్యసేవలు అందిస్తున్నారు. ఆస్పత్రి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..గురువారం అందిన నివేదికలో మరో నలుగురికి స్వైన్‌ఫ్లూ పాజిటివ్ వచ్చింది. జయశంకర్ జిల్లా కాతారం చిందినపల్లికి చెందిన మహిళ (45), ఆదిలాబాద్ సాయినగర్‌కు చెందిన మహిళ (47), కాచిగూడ తజ్జిల్‌అడ్డాకు చెందిన వృద్ధుడు (79), హైదరాబాద్ ఎర్రగడ్డకు చెందిన వ్యక్తి (42)లకు స్వైన్‌ఫ్లూ నిర్ధారణ అయింది. వీరితో ఆస్పత్రిలో స్వైన్‌ఫ్లూ బాధితుల సంఖ్య తొమ్మిదికి పెరిగింది. బాధితులంతా ఇతర ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులనుంచి రిఫరల్‌పై వచ్చినవారేనని ఆస్పత్రి వర్గాలు స్పష్టం చేశాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు గాంధీ ఆస్పత్రిలో 25 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదు కాగా, ఇద్దరు మృతి చెందారని, 14మంది సురక్షితంగా డిశ్చార్జి అయ్యారని వివరించారు.

పలు రైళ్ల పాక్షిక రద్దు

సాక్షి, హైదరాబాద్: ట్రాక్‌ల మరమత్తులు, అభివృద్ధి పనుల కారణంగా పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సి.హెచ్ రాకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. నం.57474 బోధన్–మహబూబ్‌నగర్ ప్యాసింజర్, 57456–మహబూబ్‌నగర్–కాచిగూడ ప్యాసింజర్లను షాద్‌నగర్–మహబూబ్‌నగర్ మధ్య 9, 10 తేదీల్లో పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే నం. 67245 విజయవాడ–భద్రాచలం రోడ్ ప్యాసింజర్, 67246–భద్రాచలం రోడ్–విజయవాడ ప్యాసింజర్లను డోర్నకల్–భద్రాచలం మధ్యలో 9వ తేదీన పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి రెండో దఫా జేఈఈ మెయిన్ దరఖాస్తులు

మార్చి 7 వరకు దరఖాస్తుల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీ, ఇతర కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో కొనసాగే విద్యా సంస్థల్లో (జీఎఫ్‌టీఐ) ప్రవేశాలకు రెండో దఫా జేఈఈ మెయిన్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే జనవరిలో మొదటి జేఈఈ మెయిన్ నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆ ఫలితాలను ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండో దఫా జేఈఈ మెయిన్‌ను ఏప్రిల్ 6 నుంచి 20 మధ్యలో నిర్వహిస్తామని ఇప్పటికే ఎన్‌టీఏ ప్రకటించింది. దీనిలో భాగంగా ఈ నెల 8 నుంచి మార్చి 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు చర్యలు చేపట్టింది. విద్యార్థులు మార్చి 8 వరకు పరీక్ష ఫీజును చెల్లించేందుకు అవకాశం కల్పించింది. జనవరిలో జరిగిన జేఈఈ మెయిన్‌కు 9,29,198 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 8,74,469 మంది పరీక్షకు హాజరయ్యారు. ఈసారి 10 లక్షల మంది వరకు రెండో దఫా జేఈఈ మెయిన్‌కు హాజరయ్యే అవకాశం ఉంది. స్కోర్ పెంచుకునే అవకాశం ఉన్నందున మొదటి దఫా జేఈఈ మెయిన్ రాసిన విద్యార్థులంతా రెండో దఫా జేఈఈ మెయిన్‌కు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ రెండు జేఈఈ మెయిన్ ఫలితాల ఆధారంగా ఎన్‌టీఏ ర్యాంకులను ప్రకటించనుంది. వాటి ఆధారంగానే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అభ్యర్థులను ఎంపిక చేయడంతోపాటు ఎన్ఐటీ, ట్రిపుల్ఐటీల్లో ప్రవేశాలను చేపట్టనుంది.

గులాబీ పార్టీకి కొత్తరూపు

జిల్లా సమన్వయకర్తల వ్యవస్థ...

- త్వరలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ
- రికార్డుస్థాయి సభ్యత్వ నమోదే లక్ష్యం
- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్ణయం
- లోక్‌సభ ఎన్నికల తర్వాత సంస్థాగత ప్రక్రియ!



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సమితి కొత్తరూపును సంతరించుకోనుంది. ఆ పార్టీని తిరుగులేని రాజకీయశక్తిగా మార్చేందుకు కసరత్తు సాగుతోంది. టీఆర్ఎస్‌కు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కొత్తరూపు తెచ్చేలా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అధికారంలో ఉన్న పార్టీగా టీఆర్ఎస్ ఇప్పుడున్న దాని కంటే కీలకంగా పనిచేసేలా మార్పులు చేయాలని భావిస్తున్నారు. 2017 సంస్థాగత ఎన్నికల ప్రక్రియ సందర్భంగా రద్దయిన టీఆర్ఎస్ జిల్లా కమిటీల వ్యవస్థను మరో రూపంలో తిరిగి ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ప్రతిజిల్లాకు ఒక సమన్వయకర్తను నియమించాలని భావిస్తున్నారు. ప్రభుత్వం, పార్టీ తరపున అన్ని విషయాలను ప్రజలకు చేరవేసేలా జిల్లా సమన్వయకర్తలకు బాధ్యతలు అప్పగించనున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి జిల్లాల్లోనూ టీఆర్ఎస్ కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించి ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఈ కార్యాలయాలే వేదికగా టీఆర్ఎస్ జిల్లా సమన్వయకర్తలు పనిచేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, టీఆర్ఎస్ విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసే కేంద్రాలుగా వాటిని తీర్చిదిద్దనున్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలోనూ పార్టీ వ్యవస్థ బలంగా ఉండేలా మార్పులు చేస్తున్నారు. టీఆర్ఎస్ నియమావళి ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి సంస్థాగత ఎన్నికల ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. 2017లో చివరిసారి టీఆర్ఎస్ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ జరిగింది. మళ్లీ ప్రస్తుత ఏడాదిలో జరగనుంది. సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా సభ్యత్వ నమోదు, గ్రామ, మండల, రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరుగుతాయి. ఈ ప్రక్రియలోనే జిల్లా సమన్వయకర్తల నియామకం జరగనుంది. చివరగా టీఆర్ఎస్ వ్యవస్థాపక దినం(ఏప్రిల్ 27) రోజున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియను మొదలుపెట్టాలని మొదట అనుకున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల తర్వాతే వీటిని చేపట్టాలని భావిస్తున్నారు.

రాష్ట్రంలో వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ సంస్థాగతంగా బలోపేతం కావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ వ్యవహారాల్లో అవసరమైన మేరకు పార్టీ సలహాలు ఉండేలా మార్పులు చేయనుంది. మొదటగా రికార్డుస్థాయి సభ్యత్వాలను నమోదు చేయాలని భావిస్తోంది. సభ్యత్వ నమోదు ప్రక్రియలో గతంలో జరిగిన పొరపాట్లకు ఈసారి అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించింది. 2017లో నిర్వహించిన

పొరపాట్లు లేకుండా...

సభ్యత్వ నమోదు ప్రక్రియ ఒకింత గందరగోళంగా మారింది. అప్పుడు టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం నుంచి 75 లక్షల సభ్యత్వాల మేరకు పుస్తకాలను ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్యనేతలు తీసుకెళ్లారు. 70 లక్షల సభ్యుల పేర్లను నమోదు చేసినట్లు కేంద్ర కార్యాలయానికి సమాచారం పంపారు. అయితే, 43 లక్షల సభ్యత్వాలకు సంబంధించిన పుస్తకాలే టీఆర్ఎస్ కేంద్ర కార్యాలయానికి చేరాయి. నియోజకవర్గాలకు తీసుకెళ్లిన సభ్యత్వ పుస్తకాలు తిరిగి రాకపోవడంతో ముందుగా అనుకున్న సభ్యత్వనమోదు లక్ష్యం నెరవేరలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నిర్వహించే సభ్యత్వ నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కేటీఆర్ భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉంది.

కేంద్రంపై టీఆర్ఎస్ కుట్ర..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపణలు

సాక్షి, హైదరాబాద్: టీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై కుట్రలు పన్నుతూ రాష్ట్ర రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి’ పథకం అర్హులైన రైతులకు కూడా వర్తించదని టీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తుందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమాలను రాష్ట్రంలో పక్కదారి పట్టిస్తోన్న ప్రయత్నాలను రాష్ట్ర బీజేపీశాఖ ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తోందన్నారు. అన్ని రాష్ట్రాల అధ్యక్షులతో ఎన్నికల సన్నద్ధతపై పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం లక్ష్మణ్ ఇక్కడి మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్ పార్టీ తమ ప్రచార ప్రసార సాధనాల ద్వారా ఈపథకాన్ని ఉద్దేశపూర్వకంగానే తక్కువ చేసి చూపించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఇప్పటివరకూ ఈ పథకంపై విధివిధానాలను కేంద్రం రూపొందించనేలేదని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన రైతులందరికీ ఆర్థిక సాయం అందించేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారులు వివిధ రాష్ట్రాల్లో పర్యటించి రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ కార్యదర్శుల అభిప్రాయాలు తీసుకుంటున్నారని ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వ అధికారులు రాష్ట్రానికి వచ్చి ఇక్కడి అధికారులతో చర్చించారని తెలిపారు. అయితే ఈ పథకాన్ని తక్కువ చేసేలా కేంద్రం నిబంధనలను రూపొందిస్తుందన్నట్టు మీడియాలో కథనాలు రావడం ఆక్షేపణీయమన్నారు.

9న అసెంబ్లీ ఇన్‌చార్జులతో..

ఈ నెల 9న అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు, కన్వీనర్లతో (దాదాపు వెయ్యి మందితో) రాష్ట్ర స్థాయి కార్యశాల నిర్వహిస్తున్నట్టు లక్ష్మణ్ వెల్లడించారు. జాతీయ పార్టీ ఇచ్చిన ఐదు కార్యక్రమాలు చేపట్టడానికి ప్రత్యేక కమిటీ వేయమని అమిత్‌షా చెప్పారన్నారు. లోక్ సభ ఎన్నికల ప్రణాళికల్లో భాగంగా అమిత్ షా మార్గదర్శనంలో అన్ని పార్టీల కన్నా ముందే సిద్ధమవుతున్నట్టు చెప్పారు. తెలంగాణలో పెద్ద సంఖ్యలో పార్లమెంట్ స్థానాలు గెలిచేందుకు కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. నిజామాబాద్ క్లస్టర్ మీటింగ్ కి అమిత్ షా పాల్గొంటారని, ఈ సమావేశం తేదీ ఇంకా ఖరారు కాలేదని తెలిపారు. పెట్టుబడి వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని చిన్న, సన్నకారు రైతుకు హామీ లేకుండా ఇచ్చే వ్యవసాయ రుణాల పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.1.60లక్షకు పెంచుతున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించడం పట్ల బీజేపీ తెలంగాణశాఖ హర్షం వ్యక్తం చేసింది.



గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కె.లక్ష్మణ్, పార్టీ నేతలు

పార్టీ చేపట్టే వివిధ కార్యక్రమాలు

- 10న కేంద్రమంత్రి రవిశంకర్‌ప్రసాద్ నేతృత్వంలో ఐటీ అధిపతులు, నిపుణులతో హోటల్ ట్రైడెంట్‌లో సమావేశం..
- 13న మహబూబ్‌నగర్‌లో జరిగే మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, చేవెళ్ల పార్లమెంట్ క్లస్టర్ సమావేశానికి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ హాజరవుతారు
- 14న కరీంనగర్ లో జరిగే భారత్ కీ మాన్ కీ బాత్ మోదీకీ సాత్ కార్యక్రమంలో రాంమాధవ్ పాల్గొంటారు
- మేరా పరివార్ భాజపా పరివార్ పేరుతో ఈనెల 12 నుంచి మార్చి 2వరకు బూత్ స్థాయిలో 25 పార్టీ కార్యకర్తల ఇళ్లపై భాజపా జెండా ఎగురవేత
- కమలజ్యోతి కార్యక్రమంలో భాగంగా మోదీ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన 1, 66వేల మంది ఇళ్లలో జ్యోతి ప్రజ్వలన
- మార్చి 2న మోదీ సంక్షేమ పథకాలను వివరిస్తూ బీజేపీ విజయ్ సంకల్ప పేరుతో అసెంబ్లీ నియోజకవర్గాల్లో బైకు ర్యాలీలు

హక్కులు తేలని భూమి

- రాష్ట్రంలో యాజమాన్య హక్కులు తేలని 92 లక్షల ఎకరాల భూమి
- 16 నెలలుగా భూరికార్డులు వడపోస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- మొత్తం 2.38 కోట్ల ఎకరాలకు గాను 1.46 లక్షల ఎకరాల రికార్డుల ప్రక్షాళన
- వివాదాల్లో 12 లక్షల ఎకరాలు.. డిజిటల్ సిగ్నేచర్లు కానివి 15 లక్షల వరకు
- లక్షల మంది రైతులు పాసుబుక్‌లు లేక రుణాలు పొందలేకపోతున్న వైనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మొత్తం 92 లక్షల ఎకరాల భూములకు యాజమాన్య హక్కులు తేలాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమంలో ఇప్పటివరకు మొత్తం 2,38,56,322. 25 ఎకరాల భూరికార్డులను పరిశీలించగా, 1.46 లక్షల ఎకరాలకు యాజమాన్య హక్కులు కల్పించినట్టు రెవెన్యూ వర్గాలు ధ్రువీకరిస్తున్నాయి. మిగిలిన 92 లక్షల ఎకరాల భూములకు గాను 4.3 లక్షలకు పైగా ఖాతాల్లోని 12 లక్షల ఎకరాల వివాదాస్పద భూములను పార్ట్–బీలో చేర్చారు. ఇందులో వివాదాలు, కోర్టు కేసులు, సర్వే చేయాల్సిన భూములున్నాయి. మరో 8.4 లక్షల ఖాతాలకు సంబంధించిన దాదాపు 24 లక్షల ఎకరాల భూముల రికార్డులను క్లియర్ చేసినా వాటిని పాసుపుస్తకాల కోసం ఇంకా సిఫారసు చేయలేదు. ఖాతాలతో పాటు పాసుపుస్తకాల క్లియరెన్స్ వచ్చినప్పటికీ డిజిటల్ సంతకాలు కాని భూములు 5.3 లక్షల ఖాతాల్లో 15 లక్షలకు పైగా ఉంటాయని రెవెన్యూ గణాంకాలు చెబుతున్నాయి. ఇక, అసలు తొలిసారే డిజిటల్ సంతకం కాని ఖాతాలు 18 లక్షలకు పైగా ఉండగా, అందులో 50 లక్షలకు పైగా ఎకరాల భూములుండటం గమనార్హం. 2017, సెప్టెంబర్‌లో భూరికార్డుల ప్రక్షాళన ప్రారంభమయిన తర్వాత 16 నెలలుగా రెవెన్యూ యంత్రాంగం భూరికార్డులను వడపోస్తున్నప్పటికీ ఇంకా ప్రక్షాళన పూర్తిస్థాయిలో కాకపోవడంతో దాదాపు 25 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే ఖరీఫ్‌లో సాయాన్ని నష్టపోగా, మరింత సమయం తీసుకుంటే రబీలోనూ, కేంద్రం ప్రకటించిన సాయాన్ని అందుకోవడంలోనూ ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, రెవెన్యూ వర్గాలు మాత్రం తాము భూరికార్డుల ప్రక్షాళనను వీలున్నంత వేగంగా చేస్తున్నామని, రెవెన్యూయేతర పనుల భారం ఉన్నప్పటికీ ఎప్పుడు సమయం చిక్కినా ఈ పనిలోనే తమ సిబ్బంది నిమగ్నమవుతున్నారని అంటున్నాయి.

సిద్ధమవుతున్న గ్రామాల వారీ రికార్డులు

భూరికార్డుల ప్రక్షాళనలో లెక్క తేలిన భూముల వివరాలను సమగ్రంగా రూపొందించాలని, గ్రామాల వారీ రికార్డులను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఈనెల 4 న భూపరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారీ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు పంపారు. ఈ సర్క్యులర్ ప్రకారం గ్రామాల వారీగా కొత్త పహాణీలు తయారు చేయాల్సి ఉంది. ఈ పహాణీలోని ప్రతి సర్వే నంబర్ మీద డిజిటల్ సంతకం కనిపించేలా రూపొందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో పాటు తాజా 1బీ ఫారాలు, పహాణీ ఫార్మాట్‌లో సర్వే నంబర్ల వారీగా ప్రభుత్వ భూముల వివరాలను పేర్కొనాలని, ప్రభుత్వ ఆస్తుల పట్టిక కూడా తయారు చేయాలని సూచించారు. పార్ట్–బీలో చేర్చిన వివాదాస్పద భూములను కూడా సర్వే నంబర్ల వారీగా ప్రత్యేకంగా రూపొందించాలని తెలిపారు. ఈ రికార్డులన్నింటినీ పరిశీలన కోసం గ్రామ, తహశీల్, డివిజన్, కలెక్టరేట్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దీంతో స్థానిక రెవెన్యూ యంత్రాంగం ఇప్పుడు రికార్డుల తయారీ పనిలో పడింది.



గణాంకాలు...

మొత్తం భూములు:	2.38కోట్లు
క్లియర్ అయినవి:	1.46 కోట్లు
క్లియర్ కావాల్సినవి: 92 లక్షలు (ఎకరాల్లో)	
మొత్తం ఖాతాలు:	71,89,829
క్లియర్ అయినవి:	53,35,789
క్లియర్ కావాల్సినవి:	18,54,040
ప్రభుత్వ భూములు, ఆస్తులున్న ఖాతాలు:	35, 235
డిజిటల్ సిగ్నేచర్లు కాని పాసుపుస్తకాల ఖాతాలు:	5,33,001
పాసుపుస్తకాలకు కూడా క్లియర్ కాని ఖాతాలు:	8,49,629
పార్ట్–బీ ఖాతాలు:	4,36,175

మార్క్‌ఫెడ్ ద్వారా పౌల్ట్రీలకు మొక్కజొన్న

హైదరాబాద్: తెలంగాణ మార్క్‌ఫెడ్ ద్వారా 4 లక్షల టన్నుల మొక్కజొన్నను కిలో రూ.18 చొప్పున పౌల్ట్రీ రైతులకు సరఫరా చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. సీఎం నిర్ణయం పట్ల తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.రంజిత్ రెడ్డి, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ ఈ.ప్రదీప్ కుమార్‌లు ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఒడిదుడుకుల్లో ఉన్న పౌల్ట్రీ రంగానికి కేసీఆర్ నిర్ణయం పెద్ద ఉపశమనమని పేర్కొన్నారు.

‘పీఎం కిసాన్’ పకడ్బందీగా అమలు చేయండి..

రాష్ట్రాలకు కేంద్రం సూచన

సాక్షి, హైదరాబాద్: చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనం కోసం కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని రాష్ట్రాలు పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర కేబినెట్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ సిన్హా ఆదేశించారు. ఈ మేరకు గురువారం వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏ జంతువు వేటకు బలి కావొద్దు..

‘కవ్వాల్’ పరిధిలో అక్రమ విద్యుత్ సరఫరా నిలిపేయాలన్న హైకోర్టు

- పరిశీలన నివేదికలివ్వాలని పలు శాఖల అధికారులకు ఆదేశం..
- ‘సిబ్బంది’ ఆయుధాలు ఉపయోగించే అంశాన్ని పరిశీలించాలని స్పష్టం
- విద్యుత్ లైన్లకు ఇన్సులేషన్ చేస్తే ఫలితముంటుందన్న అటవీ అధికారులు
- డ్రోన్ల వాడకం మేలన్న పిటిషనర్ న్యాయవాది.. 28కి విచారణ వాయిదా

సాక్షి, హైదరాబాద్: అటవీ ప్రాంతాల్లో విద్యుత్ తీగలను అమర్చి జంతువులను వేటాడటం ఎక్కువవుతున్న నేపథ్యంలో దీనికి చెక్ పెట్టే దిశగా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలో అక్రమ విద్యుత్ సరఫరాను వెంటనే నిలిపేయాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించింది. అలాగే కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పోలీసు, అటవీ, ఎక్సైజ్, విద్యుత్ శాఖాధికారులు ఉమ్మడి పరిశీలన చేసి, అక్కడి పరిస్థితులపై వేర్వేరు నివేదికలు సమర్పించాలని ఆదేశించింది. అలాగే కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో అటవీ, జంతు సంరక్షణ, పోలీసు, ఎక్సైజ్, నార్కోటిక్ డ్రగ్స్ తదితర చట్టాలు కఠినంగా అమలవుతున్నాయా.. లేదా... అన్న విషయాన్ని పర్యవేక్షించే నిమిత్తం ఓ బృందాన్ని ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలంది. ఈ ప్రాంతంలో ఏ జంతువు కూడా అక్ర మ వేటకు బలి కాకుండా చూడాలని తేల్చి చెప్పింది.

ఆ దిశగా ఆలోచించండి..

కవ్వాల్, ఆమ్రాబాద్ పులుల సంరక్షణ కేంద్రాల్లో స్పెషల్ టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు, వీరు ఆయుధాలు ఉపయోగించే విషయంలో కేంద్రం తగిన సహకారాన్ని అందించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా శిక్షణ పొందిన ఫారెస్ట్ గార్డులు, ఇతర అటవీ సిబ్బంది ఆయుధాలను ఉపయోగించేందుకు అనుమతినిచ్చే విషయాన్ని హైకోర్టు పరిశీలించాలంది. ఈ వ్యాజ్యంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్



జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎక్సైజ్ కమిషనర్, టీఎస్ఎన్‌పీడీసీఎల్ చైర్మన్, ఎండీలను ప్రతివాదులుగా చేర్చింది. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర అటవీ శాఖ, జాతీయ పులుల సంరక్షణ సంస్థ అభిప్రాయాలను కూడా రెండు వారాల్లో తమ ముందుంచాలని అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)ను ఆదేశించింది. పిటిషనర్ కూడా ఈ మొత్తం వ్యవహారంలో ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వొచ్చునని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిల ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పులుల సంరక్షణ పథకాన్ని అమలు చేసేలా రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైదరాబాద్‌కు చెందిన జాగిర్ దియా సుర్ పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు గురువారం మరోసారి విచారణ జరిపింది.

విద్యుత్‌లైన్లకు ఇన్సులేషన్ మేలు..

ధర్మాసనం గత ఆదేశాల మేరకు.. ఈ కేసులో సహకరించేందుకు అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ప్రశాంత్‌కుమార్ ఝా, కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం ఫీల్డ్ డైరెక్టర్ సి.శరవణన్ తదితరులు కోర్టు ముందు హాజరయ్యారు. జంతువుల అక్రమ వేటకు విద్యుత్ తీగలను ఉపయోగిస్తున్న నేపథ్యంలో దీనికి చెక్ పెట్టే విషయంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. విద్యుత్ సరఫరా లైన్లకు ఇన్సులేషన్ చేయడం వల్ల తగిన ఫలితం ఉంటుందని అటవీ శాఖాధికారులు సూచించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. ఈ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించింది. కవ్వాల్ పులుల సంరక్షణ విషయంలో జాతీయ పులుల సంరక్షణ సంస్థ ఇప్పటికే తగిన సహాయ, సహకారాలు అందిస్తోందని ఏఎస్‌జీ కె.లక్ష్మణ్ చెప్పారు. సాంకేతిక, ఆర్థిక సాయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరితే అందుకు సహకరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. డ్రోన్ల సాయంతో జంతువులు, ముఖ్యంగా పులుల వేటను అడ్డుకోవచ్చునని పిటిషనర్ తరపు న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి కోర్టుకు చెప్పారు. ఈ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఈ మొత్తం వ్యవహారంతో ముడిపడి ఉన్న పలు శాఖలకు పరిశీలన నివేదికలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం కార్యకలాపాలను, ఇతర వ్యవహారాలను ఫీల్డ్ డైరెక్టర్ పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేస్తూ కోర్టు విచారణ వాయిదా వేసింది.



జయరామ్ హత్య కేసు

మొదట్నుంచి మళ్లీ!

కేసు ఆద్యంతం దర్యాప్తు చేయాలని భావిస్తున్న నగర పోలీసులు

గురువారం కమిషనరేట్‌కు చేరుకున్న ఫైల్.. దర్యాప్తుపై సమీక్ష జరిపిన కొత్వాల్

సాక్షి, హైదరాబాద్: ఎక్స్‌ప్రెస్ టీవీ చైర్మన్, కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ చిగురుపాటి జయరామ్ హత్య కేసు ఆంధ్ర ప్రదేశ్‌లోని నందిగామ పోలీసుల నుంచి తెలంగాణలోని హైదరాబాద్ పోలీసులకు బదిలీ అయింది. ఈ ఫైల్ నగర పోలీసు కమిషనర్ కార్యాలయానికి చేరుకోవడంతో గురువారం కొత్వాల్ అంజనీకుమార్ వెస్ట్‌జోన్ పోలీసులతో సమీక్షించారు. నేరస్థలం జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లోని రాకేష్‌రెడ్డి నివాసంలో కావడంతో కేసును ప్రాథమికంగా అక్కడి పోలీసులకే అప్పగించనున్నారు. ఈ కేసులో ఉన్న అనేక అనుమానాల నివృత్తికోసం ఆది నుంచీ దర్యాప్తు చేయాలని సిటీ పోలీసులు నిర్ణయించారు.

కృష్ణాజిల్లా నందిగామలో ఈ నెల 1న జయరామ్ మృతదేహం లభించిన నాటి నుంచి ఏపీ పోలీసుల దర్యాప్తులో అనేక నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. జయరామ్ మేనకోడలు శిఖా చౌదరి ప్రధాన అనుమానితు

నాటకీయ పరిణామాలపై దృష్టి..

రాలు అనే వార్తలు తొలుత వెలువడ్డాయి. అయితే మంగళవారం రాకేష్‌రెడ్డి, వాచ్‌మన్ శ్రీనివాస్‌రెడ్డిల్ని మాత్రమే నిందితులుగా ప్రకటిస్తూ అరెస్టు చేశారు. శిఖాను గుట్టుచప్పుడు కాకుండా ఏపీ నుంచి హైదరాబాద్‌కు పంపించేశారు. వీటిపై దృష్టి పెట్టనున్న సిటీ పోలీసులు శిఖా చౌదరినీ విచారించాలని భావిస్తున్నారు. గత నెల 31న శిఖా జయరామ్ ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించి బీరువాలో నుంచి విలువైన పత్రాలు, భూమి పత్రాలు తీసుకువెళ్లినట్లు హతుడి భార్య పద్మశ్రీ ఆరోపించారు. దీనిపై ఆమె జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శిఖాను ప్రశ్నించే సమయంలో వీటి గుట్టు విప్పాలని నగర పోలీసులు నిర్ణయించారు.

కాపాడటానికే ఆ కారణాలా?

జయరామ్ హత్య కేసుకు చెందిన వివరాలు వెల్లడించిన కృష్ణాజిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి.. జయరామ్ రాకేష్‌రెడ్డి నుంచి తీసుకున్న రూ.4.17 కోట్ల కోసమే ఈ హత్య జరిగినట్లు తెలిపారు. దీని పైనా సిటీ పోలీసులు సందేహాలు వ్యక్తపరుస్తున్నారు. రాకేష్‌కు 'చినబాబు'తో సహా తెలుగుదేశం పార్టీలోని అనేక మందితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే వార్తలు వెలువడ్డాయి. దీంతో రాకేష్‌ను పరోక్షంగా, ఇతరులను ప్రత్యక్షంగా కాపాడటానికే ఈ కారణాలు చెప్పారా? అని పోలీసులు అనుమానిస్తున్నారు. వీటి నివృత్తికి నిందితుల్ని కస్టడీలోకి తీసుకోనున్నారు. దీనికోసం జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైన తర్వాత నాంపల్లి కోర్టు నుంచి పీటీ వారెంట్ తీసుకోనున్నారు. ఆపై నిందితుల్ని ఏపీ జైలు నుంచి తీసుకువచ్చి ఇక్కడి ప్రక్రియలు పూర్తిచేసుకొని వారిద్దరినీ విచారించాలని నిర్ణయించారు.

కీలకంగా మారనున్న 'రీ-కన్‌స్ట్రక్షన్'...

జయరామ్ హత్య కేసులో జూబ్లీహిల్స్ పోలీసులు చేపట్టనున్న క్రైమ్ సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ ప్రక్రియ కీలకం కానుంది. రాకేష్ ఇంట్లో అనేక అంశాలు పరిశీలించనున్నారు. ఆపై గొడవ జరిగిన తీరు, మృతదేహాన్ని కారులోకి వాచ్‌మన్ సాయంతో తరలించిన తీరు సహా నందిగామ వరకు వెళ్లిన పరిణామాలను సరిచూస్తారు. ఈలోపే పలు ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డయిన ఫీడ్ సేకరించడానికి పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు.

దసపల్లా గుట్టు విప్పాలని నిర్ణయం..

ఈ హత్యకు మూలాలు దసపల్లా హోటల్‌లోనూ ఉన్నాయి. గత నెల 29, 30, 31 తేదీల్లో ఆ హోటల్లో జయరామ్‌కు చెందిన కీలక పరిణామాలు జరిగాయి. ఆ రోజు అక్కడ సమావేశమైన వారిలో హతుడు, నిందితుడితోపాటు మరికొందరు ఉన్నారని తెలుస్తోంది. తెల్లచొక్కా ధరించిన ఓ వ్యక్తి సీసీ ఫుటేజీలోనూ కనిపించాడు. ఏపీ పోలీసుల దర్యాప్తులో ఈ వివరాలు బయటకు రాలేదు. 31న జయరామ్‌కు ఓ వ్యక్తి రూ.6 లక్షలు అక్కడకు తెచ్చి ఇచ్చాడు. అతనెవరు.. దాన్ని తీసుకున్న ఆ యువతి ఎవరు? అనేదీ తేలాల్సి ఉంది. దసపల్లా హోటల్‌లో గది ఎవరి పేరిట బుక్ అయి ఉంది? అనే వివరాలు తెలుసుకుంటున్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.44 నుంచి రోడ్ నం.36, రోడ్ నం.10 మీదుగా నిందితుడు రాకేష్‌రెడ్డి ఇంటి వరకు అనేక సీసీ ఫుటేజీలు ఉన్నాయి. వీటినీ పోలీసులు పరిశీలించి ఆ రోజు జయరామ్ ఎన్ని గంటలకు వెళ్లారు, మృతదేహాన్ని కారులో ఏ సమయంలో తీసుకొచ్చారు? అనే అంశాలు తెలుసుకోనున్నారు.

శిఖా చౌదరికి ఆ హత్యతో సంబంధం ఉంది: పద్మశ్రీ

ఆంధ్రాపోలీసుల విచారణ సరిగ్గాలేదనే తన భర్త చిగురుపాటి జయరామ్ హత్యకేసును తెలంగాణ పోలీసులకు అప్పగించాలని ఫిర్యాదు చేసానని పద్మశ్రీ వెల్లడించారు. గురువారం ఆమె జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 44లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఈరోజు తమ పెళ్లిరోజని, గతంలో తన భర్తతో ఉన్న అనుబంధం తలచుకొని కుమిలి పోయానని వెల్లడించారు. ఆయన లేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని. ఇంకా తన పిల్లలు తేరుకోలేదన్నారు. జయరామ్ మరణిస్తే ఘటనా స్థలానికి వెళ్లకుండా శిఖా చౌదరి తమ ఇంటికి ఎందుకు వచ్చిందని, తమతో ఎలాంటి సంబంధం లేనివాళ్లతో ఎందుకు వెళ్లిందని ప్రశ్నించారు. ఈ విషయాన్ని తెలంగాణ పోలీసులు, ప్రభుత్వం విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాలన్నారు. శిఖా చౌదరికి ఈ కేసుతో సంబంధం లేదని చెప్పడం అన్యాయమన్నారు. 2014లో శిఖా తమ కుటుంబంలోకి వచ్చిందన్నారు. ఆమె కుటుంబం మొత్తానికి జయరామ్ హత్యలో భాగముందన్నారు. కొన్ని ఒత్తిడులకు లొంగి రాకేష్‌రెడ్డిపై కేసును రుద్దారన్నారు. రాకేష్ ఎవరో తనకు తెలియదనీ, ఆయనకు ఇవ్వాల్సిన డబ్బుల గూర్చీ తెలీదన్నారు. శిఖాకు ఎవరు సహకరిస్తున్నారో తేల్చాలని కోరారు. ఎక్స్‌ప్రెస్ టీవీలో శిఖాకు అంతపెద్ద హోదా ఇవ్వడం సరికాదని తానే తొలగించానన్నారు.



దర్యాప్తు అధికారిగా బంజారాహిల్స్ ఏసీపీ

జయరామ్ హత్య కేసు దర్యాప్తు అధికారిగా బంజారాహిల్స్ ఏసీపీ కె.శ్రీనివాసరావును నియమించాం. గురువారం కృష్ణా జిల్లా ఎస్పీ నుంచి వచ్చిన ఓ ప్రత్యేక మెసెంజర్ కేసు ఫైల్ తీసుకువచ్చి అప్పగించాడు. జూబ్లీహిల్స్ ఠాణాలో రీ-రిజిస్టర్ చేసి దర్యాప్తు ప్రారంభిస్తాం. ఇటీవల జూబ్లీహిల్స్ పోలీసులకు ఓ ఫిర్యాదు ఇచ్చిన జయరామ్ భార్య పద్మశ్రీ తెలంగాణ, హైదరాబాద్ పోలీసులపై తనకు అపారమైన నమ్మకం ఉందని అన్నారు. దీన్ని నిలబెట్టుకోవాలనే కృతనిశ్చయంతో ఉన్నాం. కేసును అన్ని కోణాల్లోనూ లోతుగా దర్యాప్తు చేసి వీలైనంత త్వరలో పూర్తి చేస్తాం.

– అంజనీకుమార్, హైదరాబాద్ కొత్వాల్

ఖాకీల పాత్రపైనా సమగ్రంగా...

జయరామ్ హత్య ఎపిసోడ్‌లో హైదరాబాద్‌లో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, రాచకొండకు చెందిన ఏసీపీ మల్లారెడ్డిల పాత్ర తీవ్ర సంచలనం సృష్టించింది. జయరామ్ మృతదేహం తరలింపునకు గాను తాను వారిద్దరికీ ఫోన్లు చేశానని, వారిచ్చిన సలహాల మేరకే వ్యవహరించానని రాకేష్‌రెడ్డి ఏపీ పోలీసుల విచారణలో వెల్లడించాడు. అంతే కాకుండా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు నల్లకుంట స్టేషనులో ఉన్నప్పుడే మృతదేహం తరలిస్తున్న కారును రాకేష్ అక్కడకు తీసుకువెళ్లాడని, బయటే ఉండి ఆయనకు ఫోన్ చేశాడని తెలుస్తోంది. అయితే వీటిని ఇద్దరు అధికారులు ఖండిస్తున్నారు. ఈ వివరాల ఆరా కోసం అవసరమైతే వారిద్దరికీ కూడా నోటీసులు జారీ చేసి విచారించనున్నారు.

14న అష్టబంధన మహాకుంభాభిషేకం

- ఈ నెల 10 నుంచి విశాఖ శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాలు
- తెలంగాణ, యూపీ సీఎంలు కేసీఆర్, యోగి రాక
- శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ వెల్లడి



వార్షికోత్సవ వివరాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీస్వరూపానందేంద్ర స్వామీజీ తదితరులు

పెందుర్తి: తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ క్షేమం కోరుతూ విశాఖ శ్రీశారదాపీఠంలో ఈ నెల 14న అష్టబంధన మహాకుంభాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని శారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ వెల్లడించారు. ఈ నెల 10 నుంచి 5 రోజుల పాటు పీఠం వార్షికోత్సవ వేడుకలు జరుగుతాయని చెప్పారు. విశాఖ జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడలోని శారదాపీఠంలో గురువారం స్వామీజీ మాట్లాడుతూ... శారదాపీఠంలో సుధా దేవాలయం(రాజశ్యామల అమ్మవారి దేవాలయం) పునఃప్రతిష్ఠలో భాగంగా శిలా దేవాలయాన్ని నిర్మించామని, ఈ నెల 10న దేశం నలుమూలల నుంచి వచ్చే పండితుల చేతుల మీదుగా ఆలయ ప్రతిష్ఠాపనతో పాటు యజ్ఞయాగాది క్రతువులు జరుగుతాయని వెల్లడించారు. తొలిరోజు గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ, రాజశ్యామల యాగం, వనదుర్గ యాగం ప్రారంభం, వాల్మీకి రామాయణం, దేవీ భాగవత పారాయణాలు, మేధా దక్షిణామూర్తికి పంచామృతాభిషేకాలు, రుగ్వేద పారాయణం, నిత్య పీఠ పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు, రెండో రోజు దాసాంజనేయ స్వామికి పంచామృతాభిషేకాలు, రాజశ్యామల యాగం, వనదుర్గ యాగం, నీరాజన మంత్రపుష్పం, కృష్ణ యజుర్వేద పారాయణం, నిత్య పీఠ పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. మూడోరోజు వల్లీదేవసేన సమేత షణ్ముక సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేకాలు, రాజశ్యామల యాగం, వనదుర్గ యాగం, నీరాజన మంత్ర పుష్పం, సామవేద పారాయణం, నిత్య పీఠపూజ, రథోత్సవం, వల్లీ కల్యాణ మహోత్సవం, నాలుగోరోజు కాలభైరవ స్వామి, పీఠ పరివార దేవతలకు పంచామృతాభిషేకం, రాజశ్యామల యాగం, వనదుర్గ యాగం, నీరాజన మంత్ర పుష్పం, అథర్వణవేద పారాయణం, నిత్య పీఠ పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆఖరిరోజు ఈ నెల 14న ఉదయం 8.31 గంటలకు అష్టబంధన మహాకుంభాభిషేకం, 10.30 గంటలకు రాజశ్యామల యాగం, వనదుర్గ యాగం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే రోజు 12 గంటలకు మహాప్రసాద వితరణ ఉంటుందన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ విశిష్ట అతిథులుగా పాల్గొంటారని స్వామీజీ చెప్పారు. 10న లక్ష్మీగణపతి హోమం, మేధాదక్షిణామూర్తి హోమం, 11న మన్యసుక్త మారుతీ హోమం, 12న షణ్ముక సుబ్రహ్మణ్య హోమం, 13న రుద్రహోమం జరుగుతాయని వివరించారు. ఆలయ పునఃప్రతిష్ఠ సందర్భంగా అభిషేకాల కోసం గంగా, యయున, సరస్వతి, గోదావరి జలాలతో పాటు కార్గిల్, లడఖ్ ప్రాంతాల నుంచి సింధు, జంస్కర్ నదుల జలాల్ని సేకరించామన్నారు. సమావేశంలో ఉత్తర పీఠాధిపతి బాలస్వామి, ధర్మాధికారి కామేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

విషమంగానే మధులిక ఆరోగ్యం

24 గంటలు గడిస్తేనే చెప్పగలం: వైద్యులు

హైదరాబాద్: ప్రేమోన్మాది చేతిలో కత్తిపోట్లకుగురై మలక్‌పేట్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మధులిక (17) పరిస్థితి ఇంకా విషమంగానే వుంది. మరో 24 గంటలు గడిస్తే కానీ ఆమె ఆరోగ్యపరిస్థితిపై అంచనాకురాలేమని ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ అధికారి విజయ్‌కుమార్ గురువారం స్పష్టం చేశారు. బాలిక ఆరోగ్య స్థితిపై ప్రత్యేక బులెటిన్ విడుదల చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం మధులిక బీపీ, పల్స్‌రేట్‌లో కొద్దిగా మెరుగుదల కనిపించిందని, అయినా ఆమె ఆరోగ్యంపై అవగాహన రావడానికి ఒకరోజు సమయం పట్టవచ్చని చెప్పారు. ఏ మాత్రం శ్వాస తీసుకునే పరిస్థితి లేదన్నారు. దీంతో ఆమెను వెంటిలేటర్స్‌పై వుంచి చికిత్స అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తల, చేతులు, మెడ భాగాల్లో బాగా లోతైన గాయాలయ్యాయి. అలాగే తల వెనుక భాగంలో ఎముక విరిగి లోపలికి వెళ్లడంతో తీవ్ర రక్తస్రావమైంది. మధులిక సాధారణ స్థితికి వచ్చిన వెంటనే ఆపరేషన్ మొదలు పెడుతామని, వైద్యుల బృందం ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ వైద్య సేవలు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఆర్‌ఎంఒ కిషన్ రావు, శ్రీనివాస్, చంద్రమౌళి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ లాక్ ఓపెన్ అయితేనే గుట్టు వీడేది!



బుల్లితెర నటి ఝాన్సీ ఆత్మహత్య కేసు విచారణ వేగవంతం

హైదరాబాద్: బుల్లితెర నటి నాగ ఝాన్సీ ఆత్మహత్య కేసులో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసులో కీలక ఆధారాలుగా భావిస్తున్న ఝాన్సీ రెండు మొబైల్ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఒక ఫోన్ లాక్ ఓపెన్ కాగా అందులో ఉన్న మెసేజ్‌ల్లో కొన్ని ఆమె ప్రియుడు సూర్య తేజకు పంపి తిరిగి డిలీట్ చేసినట్లు గుర్తించారు. డిలీట్ చేసిన మెసేజ్‌లను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తిరిగి అందుబాటులోకి తెచ్చేందుకు పంజగుట్ట పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మరో ఐ ఫోన్ లాక్ ఎంత ప్రయత్నించినా తెరచుకోవడంలేదని తెలిపారు. లాక్ ఓపెన్ అయిన ఫోన్‌లో పెద్దగా సమాచారం లేదు. ఝాన్సీ అన్న దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదులో సూర్య వేధింపుల వల్లే ఝాన్సీ ఆత్మహత్య చేసుకుందని ఉండగా పోలీసులకు సరైన ఆధారాలు లభించలేదు. దీంతో ఇప్పటివరకు సూర్యపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఐఫోన్ లాక్ తెరిస్తే ఎన్నో కీలక విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. గత నెలలో కూడా ఝాన్సీ ఓసారి ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించినట్లు తెలిసింది.

బాబు కుయుక్తులకు మోసపోవద్దు

కడపలో సమర శంఖారావం సభలో ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

కడప నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఓటమి భయంతో సీఎం చంద్రబాబు ప్రజలకు అనేక తాయిలాలు ప్రకటిస్తున్నారని, ఆయన కుయుక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పుడు చంద్రబాబు ప్రకటిస్తున్నవన్నీ ఇదివరకే తాను ప్రకటించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎన్నికల సమర శంఖారావం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన కడప నగరంలోని మున్సిపల్ స్టేడియంలో పార్టీ బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్ల సభలో పాల్గొన్నారు. చంద్రబాబు అన్యాయమైన రణనీతిని, దుర్నీతిని ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ ఒక్కొక్క స్కీమ్‌ను ప్రకటిస్తున్నారని అన్నారు. చంద్రబాబు మోసపూరిత విధానాలపై ప్రజలను చైతన్య వంతులను చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

మీరంతా అప్రమత్తంగా ఉండాలి

''మనమంతా చంద్రబాబు అన్యాయమైన రణనీతిని చూశాం. చంద్రబాబు ఎన్నికలు దగ్గర పడే కొద్దీ ఏమేం చేస్తున్నారో.. ఏమేం చేయబోతున్నారో మనందరికీ తెలుస్తోంది. గ్రామాల్లో ఓటరు లిస్టులలో పేర్లను తొలగిస్తున్నారు. దొంగ సర్వేలు చేస్తున్నారు. దొంగ సర్వేలతో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసే వారిని వెతుకుతున్నారు. వెతికి తొలగించాలని ఆరాట పడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మీరందరూ అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లో ఓటరు లిస్టుల్లో పేర్లు చూడండి. తొలగించిన పేర్లు వెంటనే నమోదయ్యేలా ఫారం-6ని పూర్తి చేసి అందించండి. మీరందరూ ఆ పనిపై ప్రత్యేక దృష్టి పెట్టండి. ఎన్నికలు వచ్చేసరికి ఇదే పెద్ద మనిషి చంద్రబాబు డబ్బులు పంపకం చేస్తారు. మూటలు, మూటలు డబ్బులు పంపిస్తారు. ఓటరు లిస్టులో మన పేరు, మన వాళ్లందరి పేర్లు ఉండేలా చూసుకోవాలి. రెండో వైపు చంద్రబాబు 2 ఓట్లు చొప్పున ఎక్కిస్తున్నారు. మనం ఈసీకి ఫిర్యాదుచేశాం. అక్షరాల 59,18,000 దొంగ ఓట్లు ఉన్నాయని చెప్పాం. అందులో 20 లక్షల ఓట్లు తెలంగాణలో, మరో 39 లక్షల ఓట్లు ఏపీలో దొంగ ఓట్లుగా ఉన్నాయి.

ఎన్నికల వేళ రోజుకో స్కీమ్

ఎన్నికలు దగ్గర్లో ఉన్నాయి కాబట్టి చంద్రబాబు రోజుకొక స్కీమ్ ప్రకటిస్తారు. బాబు నాటకాల గురించి మీకు తెలుసు. అబద్ధాలు చెప్పడంలో ఆయన్ను మించిన వారులేరు. రోజుకొక సినిమా చూపించేస్తాడు. బాబు చెప్పే అబద్ధాలు, మోసాలన్నింటికీ ఆయన ఎల్లో మీడియా అండగా ఉంటుంది. ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలు, ఈటీవీ, ఏబీఎన్, టీవీ-5 చానళ్లు ఉన్నాయి. ఇవే కాదు ఇంకా ఏమేం ఉన్నాయో నాకంటే మీకే బాగా తెలుసు. ఇవాళ మనం యుద్ధం చేసేది ఒక్క చంద్రబాబుతోనే కాదు... ఎల్లో మీడియాతో కూడా యుద్ధం చేయబోతున్నాం. అందరికీ ఒకటే చెప్పండి. చంద్రబాబు మాటలను నమ్మవద్దని చెప్పండి. ఐదేళ్ల క్రితం చంద్రబాబుకు ఓటేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. 2014లో మోసం చేసిన ఆయన మళ్లీ ఎన్నికలు వస్తున్న తరుణంలో మరో ఘరానా మోసం చేయడానికి సిద్ధమవుతున్నాడు'' అని జగన్ అన్నారు.



గురువారం కడప మున్సిపల్ స్టేడియంలో సమర శంఖారావం సభకు భారీ ఎత్తున హాజరైన పార్టీ శ్రేణుల్లో ఓ భాగం. ప్రసంగిస్తున్న వైఎస్ జగన్

సీమ్యాట్‌లో ఒకే ఒక్కడు

- జీప్యాట్‌లోనూ అంతే
- రెండింటిలో 100 పర్సంటైల్ సాధించిన విద్యార్థులు ఇద్దరే
- సీమ్యాట్, జీప్యాట్ ఫలితాలు ప్రకటించిన ఎన్‌టీఏ

సాక్షి, హైదరాబాద్: అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఆమోదం పొందిన మేనేజ్‌మెంట్ కాలేజీల్లో ప్రవేశాలకు నిర్వహించిన కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్టు (సీమ్యాట్), జాతీయ స్థాయి ఫార్మసీ, ఎంఫార్మసీ కాలేజీల్లో ప్రవేశాలకు నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్టు (జీప్యాట్) ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. దేశవ్యాప్తంగా గత నెల 28, 29 తేదీల్లో ఈ పరీక్షలను నిర్వహించింది. సీమ్యాట్‌లో శర్మ నవాంశ్ సురేంద్ర అనే విద్యార్థి ఒక్కరే 100 పర్సంటైల్ సాధించి మొదటి ర్యాంకర్‌గా నిలిచినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. జీప్యాట్‌లోనూ 302 మార్కులతో యావల్కర్ అంకిత నితిన్ ఒక్కరే 100 పర్సంటైల్ సాధించి మొదటి ర్యాంకర్‌గా నిలిచినట్లు వివరించింది. జీప్యాట్ స్కోర్‌కు మూడేళ్ల వ్యాలిడిటీ ఉంటుందని వెల్లడించింది. దేశవ్యాప్తంగా సీమ్యాట్‌కు హాజరయ్యేందుకు 64,582 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 54,516 మంది హాజరైనట్లు వెల్లడించింది. అందులో బాలికలు 29,166 మంది బాలురు, 25,350 మంది బాలికలు హాజరైనట్లు వెల్లడించింది. జీప్యాట్ రాసేందుకు 42,827 మంది దరఖాస్తు చేసుకోగా, 40,649 మంది పరీక్షకు హాజరైనట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. అందులో 18,044 మంది బాలురు, 22,604 మంది బాలికలు ఉన్నట్లు వివరించింది. అందులో పీహెచ్‌డీలో ప్రవేశానికి, స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు 4,119 మంది అర్హత సాధించినట్లు తెలిపింది. అందులో 1,909 మంది బాలురు, 2,210 మంది బాలికలు ఉన్నట్లు వివరించింది. ఇందుకు అన్‌రిజర్వ్‌డ్‌లో 141 మార్కులు కటాఫ్ అని, దాంతో 1,952 మంది ఎంపిక అయ్యారని పేర్కొంది. ఓబీసీ నాన్ క్రీమీలేయర్‌లో కటాఫ్ 117 మార్కులుగా 1,103 ఎంపిక అయ్యారని తెలిపింది. ఎస్సీలలో 95 మార్కుల కటాఫ్‌తో 626 మంది, ఎస్టీలలో 74 కటాఫ్‌తో 313 మంది ఎంపికైనట్లు వివరించింది.

మార్చి 13 నుంచి పీజీఈసెట్ దరఖాస్తులు

- ఏప్రిల్ 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తుల ఫీజు రూ.1,000.. మార్చి 6న నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ఎంఈ/ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న పీజీఈసెట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను మార్చి 13 నుంచి స్వీకరించాలని టెస్టు కమిటీ నిర్ణయించింది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మే 28 నుంచి 31 వరకు ప్రతి రోజూ రెండు దఫాలుగా ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఉదయం 10 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు హైదరాబాద్, వరంగల్ ప్రాంతీయ కేంద్రాల పరిధిలో పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని 129 ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎంఈ/ఎంటెక్ కోర్సుల్లో, 96 కాలేజీల్లో ఎంఫార్మసీ కోర్సులో, 14 కాలేజీల్లో ఫార్మ్-బీ (పీబీ) కోర్సులో, 3 కాలేజీల్లో మాస్టర్ ఆర్కిటెక్చర్ కోర్సులో ప్రవేశాలకు ఈ పరీక్షను నిర్వహించనున్నారు. దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ఫీజును రూ. 1000గా (ఎస్సీ, ఎస్టీలకు రూ. 500) నిర్ణయించారు. 120 ప్రశ్నలతో 2 గంటల పాటు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను మార్చి 6న జారీ చేయనున్నారు. పూర్తి వివరాలను http://pgecet.tsche.ac.in, http://www.tsche.ac.in వెబ్‌సైట్లలో పొందవచ్చు. ఈ సమావేశంలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, టెస్టు కమిటీ చైర్మన్ ఎస్.రామచంద్రం, మండలి కార్యదర్శి శ్రీనివాసరావు, సెట్ కన్వీనర్ కుమార్ పాల్గొన్నారు.

షెడ్యూలు వివరాలు..

13-3-2019 నుంచి దరఖాస్తుల స్వీకరణ
30-4-2019 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ
25-5-2019 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరి తేదీ
22-5-2019 నుంచి 27-5-2019 వరకు హాల్ టికెట్ల డౌన్‌లోడ్

ఒకటి రెండ్రోజుల్లో అప్‌గ్రేడేషన్ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: పండిట్లు, పీఈటీల అప్‌గ్రెడేషన్ ఫైలు గురువారం ప్రభుత్వానికి చేరిందని ఎమ్మెల్సీ పూల రవీందర్ తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం లేదా శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుందని ఆయన వెల్లడించారు. ఎంత మంది పండిట్లు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదనలు, దీనివల్ల ప్రభుత్వంపై పడే ఆర్థికం భారానికి సంబంధించిన ఫైలు ఆర్థిక శాఖ ఆమోదంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆమోదానికి వెళ్లిందని వివరించారు. ఒకటి రెండ్రోజుల్లో ఉత్తర్వులు జారీ అవుతాయని పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరోత్తంరెడ్డి, కమలాకర్‌రావు వెల్లడించారు.

అన్ని కేడర్లలో పదోన్నతులు కల్పించాలి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్, పదోన్నతుల విషయంలో ప్రభుత్వం వెంటనే ఓ విధానాన్ని ప్రకటించాలని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భుజంగరావు, సదానంద్‌గౌడ్ పేర్కొన్నారు. అన్ని కేడర్లలో పదోన్నతులకు చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, ఎల్‌ఎఫ్‌ఎల్‌లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. పండిట్, పీఈటీల అప్‌గ్రెడేషన్ పరిష్కారం ఎమ్మెల్సీ ఎన్నికల లబ్ధిగా ఉండొద్దని, విస్తృత ప్రయోజనాలు కల్పించేలా ఉండాలన్నారు.

వెబ్‌సైట్‌లో జేఎల్, డీఎల్ హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: గురుకుల జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్ల పోస్టుల భర్తీకి నిర్వహించనున్న పరీక్షల హాల్‌టికెట్లను శుక్రవారం నుంచి బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు చైర్మన్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి 20 వరకు పరీక్షలు నిర్వహిస్తామని, హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ విషయంలో సాంకేతిక సమస్యలు ఎదురైతే 040-23317140 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సాక్షి
శుక్రవారం, ఫిబ్రవరి, 8

పాకిస్తానీ ‘సుప్రీం’ సంచలనం

రాజకీయాలలో తలదూర్చరాదంటూ పాకిస్తాన్ సైన్యాన్నీ, వేగుల విభాగాన్నీ, గూఢచర్యశాఖనూ ఆ దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. విద్వేషం, తీవ్రవాదం, ఉగ్రవాదం వ్యాప్తికి దోహదం చేస్తున్న వ్యక్తులపైనా, సంస్థలపైన కఠిన చర్యలు తీసుకోవాలని పాకిస్తాన్ ప్రభుత్వాన్నీ, ఆ దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలనూ సుప్రీంకోర్టు కోరింది. 2017లో ఫైజాబాద్‌లో తెహ్రీక్ పాకిస్తాన్ (టీఎల్‌పీ), మరి కొన్ని సంస్థలు కలిసి మూడువారాలపాటు జరిపిన బైఠాయింపు ఆందోళనకు సంబంధించిన కేసులో బుధవారంనాడు జస్టిస్ ఖాజీ ఫాయిజ్ ఇసా, జస్టిస్ ముషీర్ ఆలంతో కూడిన బెంచ్ ఈ చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ), మిలిటరీ ఇంటెలిజెన్స్ (ఎంఐ), ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) వంటి సంస్థలు తమ హద్దులకు లోబడి వ్యవహరించాలని కూడా కోర్టు స్పష్టం చేసింది. ఈ సంస్థల పరిమితులనూ, విధులనూ స్పష్టంగా నిర్వచిస్తూ చట్టాలు చేయాలని పార్లమెంటుకు న్యాయస్థానం సూచించింది. ఇది అసాధారణమైన తీర్పు. పాకిస్తాన్‌లో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పరోక్షంగానూ, ప్రత్యక్షంగానూ శాసించేది సైన్యమే. దాన్నే ‘ద ఎస్టాబ్లిష్‌మెంట్’ అంటారు. ఇది బహిరంగ రహస్యం. అధికారంలో బేనజీర్ భుట్టో ఉన్నా, నవాజ్ షరీఫ్ ఉన్నా, ఇమ్రాన్ ఖాన్ ఉన్నా సైన్యం మాట చెల్లుబాటు కావలసిందే. లేకపోతే ప్రధానులు గల్లంతు అవుతారు. సైన్యం అధికారం హస్తగతం చేసుకుంటుంది. ఆయూబ్‌ఖాన్, యాహ్యాఖాన్, జియా–ఉల్–హక్, ముషారఫ్ వంటి జనరల్స్ ప్రధానులను తోసిరాజని అధికారం చేజిక్కించుకున్నవారే. జుల్ఫికర్ అలీ భుట్టో, ఆయన కుమార్తె బేనజీర్ భుట్టోలను హత్య చేయించిందీ సైనిక పాలకులే. నవాజ్ షరీఫ్‌కీ, బేనజీర్‌కీ విదేశాలలో తలదాచుకోవలసిన పరిస్థితులు కల్పించిందీ అధికారదాహం అపరిమితంగా కలిగిన సైన్యాధిపతులే. పాకిస్తాన్ పౌరహక్కుల దివంగత నేత ఆస్మా జహంగీర్ మాటలలో చెప్పాలంటే, ‘మా సైన్యానికి అరకొర అధికారం అక్కరలేదు. సంపూర్ణాధికారం కావాలి.’

అటువంటి దేశంలో సుప్రీంకోర్టు ఆదేశం అమలు జరుగుతుందా? నిజంగానే ప్రజలు ఎన్నుకున్న ప్రధానులు పదవులలో సురక్షితంగా కొనసాగుతారా? సైన్యాధిపతులు బారకాసులకే పరిమితం అవుతారా? పాకిస్తాన్‌లో న్యాయస్థానాలు సాహసోపేతమైన తీర్పులు ఇచ్చిన సందర్భాలు గతంలోనూ లేకపోలేదు. 2011 ఏప్రిల్‌లో నాటి ప్రధాన న్యాయమూర్తి ఇఫ్తికార్ మహమ్మద్ ఇటువంటి ఆదేశాలే జారీ చేశారు. పాకిస్తాన్ సైనికులు తాము చేసిన ప్రమాణానికి కట్టుబడి రాజకీయాలకు దూరంగా ఉండాలనీ, రాజ్యాంగాన్ని గౌరవించాలనీ ఒక కేసులో తీర్పు చెప్పారు. అప్పుడు దేశాధ్యక్షుడుగా బేనజీర్ భర్త ఆసిఫ్ అలీ జర్దారీ ఉండేవారు. అప్పటి నుంచీ సైన్యాధ్యక్షులు ప్రధానుల జోలికి వెళ్ళలేదు కానీ పరోక్షంగా అధికారం చెలాయిస్తూ వచ్చారు. విదేశీ వ్యవహారాలూ, ఆర్థిక వ్యవహారాలూ, ఆంతరంగిక భద్రతకు సంబంధించి తుది నిర్ణయం సైన్యాధిపతిదే. సైన్యంతో తలబడి తలబొప్పికట్టిన నేత నవాజ్ షరీఫ్. 2014 డిసెంబర్‌లో పాకిస్తానీ తాలిబాన్ పెషావర్‌లో ఒక పాఠశాలపైన దాడి చేసి ముక్కుపచ్చలారని 132 మంది విద్యార్థులను పొట్టన పెట్టుకున్నారు. దేశప్రజలు దిగ్భ్రాంతికి గురైనారు. తాలిబాన్ కార్యకలాపాలపైన ఉక్కుపాదం మోపడానికీ, వారి మతోన్మాదాన్ని అరికట్టడానికీ, ఆర్థికవనరులను దెబ్బతీయడానికీ నవాజ్‌షరీఫ్ ప్రభుత్వం 20 అంశాల జాతీయ క్రియాశీల ప్రణాళిక (నేషనల్ యాక్షన్ ప్లాన్)ను పకడ్బందీగా సిద్ధం చేశారు. ‘మంచి’ తాలిబాన్ (పాకిస్తాన్ విరోధులపై దాడులు చేసే ఉగ్రవాదులు), ‘చెడు’ తాలిబాన్ (పాకిస్తాన్‌లోనే మానవబాంబులను ప్రయోగించి హత్యాకాండకు తెగబడేవారు) అంటూ తేడా చూపనవసరం లేదని కూడా షరీఫ్ చెప్పారు. తాలిబాన్‌ను విచారించేందుకు మిలిటరీ కోర్టులను నెలకొల్పాలంటూ పాకిస్తాన్ పార్లమెంటు రాజ్యాంగ సవరణ చేయడంతో సైన్యం ప్రమేయం పెరిగింది. సుమారు 50 వేల మంది తాలిబ్‌లను అరెస్టు చేశారు. లష్కర్–ఇ–జంఘ్వీ నాయకుడు మాలిక్ ఇషాక్‌ను ఎన్‌కౌంటర్ చేశారు. దీనికి ప్రతిగా పంజాబ్ గవర్నర్ షుజా ఖాన్జాదాను లష్కర్–ఇ–జంఘ్వీ హతమార్చింది. కానీ దేశం మొత్తంమీద ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. అప్పటి సైన్యాధిపతి జనరల్ రహీల్ షరీఫ్ ప్రతిష్ఠ పెరిగింది. క్రమంగా తాలిబాన్‌పైన ఒత్తిడి తగ్గించారు. అంతకంటే ముందు జనరల్ ముషారఫ్ ప్రభుత్వం 2007లో వేలాది మంది జిహాదీలను జైలులో పెట్టింది. కొన్ని మాసాల తర్వాత విడుదల చేసింది. జిహాదీలకూ, రాజకీయ నాయకులకూ, సైన్యాధికారులకూ రహస్య సంబంధాలు ఉంటాయి. పాకిస్తాన్ తాలిబాన్‌నీ, ఇతర జిహాదీ ముఠాలనీ సైన్యం ఒకే గాటన కట్టదు. కశ్మీర్‌పైన దాడులు సాగించే లష్కర్–ఇ–తొయ్యిబా (ఉరఫ్ జమాత్–ఉద్–దవా)నూ, అఫ్ఘానిస్తాన్‌తో పోరాడుతున్న తాలిబాన్‌నూ, హకానీ దళాలనూ పాకిస్తాన్ పౌరప్రభుత్వాలూ, న్యాయస్థానాలూ, సైన్యం ఉపేక్షిస్తాయి. పాకిస్తాన్‌లో హింసకు పాల్పడుతున్న ఉగ్రవాదులను ఏరివేయాలన్న విఫల ప్రయత్నం చేస్తాయి. కొందరు ఉగ్రవాదులకు సైన్యం ఆశీస్సులు ఉంటాయి. 2002లో ‘వాల్‌స్ట్రీట్ జర్నల్’ విలేఖరి డేనియల్ పెర్ల్‌ను చంపిన లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ పట్టభద్రుడు ఒమర్‌షేక్ కేసు న్యాయస్థానాలలో ఇప్పటికీ అపరిష్కృతంగానే నత్తనడక నడుస్తూ ఉంది. 2008లో ముంబయ్‌పైన దాడి చేసిన ముష్కరులూ, వారి నాయకుడు హఫీజ్ సయీద్ పాకిస్తాన్ సమాజంలో హీరోలుగా చెలామణి అవుతున్నారు. 2011లో పంజాబ్ (పాకిస్తాన్) గవర్నర్ సల్మాన్ తసీర్‌ను చంపివేసిన ముంతాజ్ ఖాద్రీ క్షేమంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు అమలు జరుగుతాయని విశ్వసించడం కష్టమే. సైన్యం సహకారంతో అధికారంలోకి వచ్చారనే వదంతులకు ఆస్కారం ఇచ్చిన ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు కానీ పౌరసంస్థలకు కానీ సైన్యంపైన ఆంక్షలు విధించేందుకు అవసరమైన గుండెబలం ఉన్నదా అన్నది సందేహాస్పదమే.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి శు.తదియ ఉ.7.38 వరకు, తదుపరి చవితి నక్షత్రం పూర్వాభాద్ర ప.12.43 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర వర్జ్యం రా.11.04 నుంచి 12.48 వరకు, దుర్ముహూర్తం ఉ.8.49 నుంచి 9.34 వరకు, తదుపరి ప.12.36 నుంచి 1.21 వరకు అమృతఘడియలు.. ఉ.9.29 నుంచి 11.12 వరకు.

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం: 5.55
రాహుకాలం : ఉ. 10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

గ్రామీణ వికాసానికి గాలి వీస్తోంది


దిలీప్ రెడ్డి

రైతు కేంద్రంగా పాలకుల విధానాలు మారుతున్నాయి. తెలంగాణలో కేసీఆర్ మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి వంటి పథకాలతో ప్రజానుకూల ప్రభుత్వ విధానాలు, నేరుగా ప్రజలకు ఫలాలు అందించడం అనే పద్ధతికే ప్రాధాన్యత ఇచ్చారు. ఏపీలో అన్ని వ్యవహారాలు పార్టీ కార్యకర్తల కనుసన్నల్లో సాగించే పంథాను బాబు ఎంచుకున్నారు. పార్టీ శ్రేణుల్ని పాలనలో దొడ్డిదారి భాగస్వాముల్ని చేయడం ద్వారా, స్థానిక పంచాయతీ పాలనా వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ఈ చీకటిని తొలగించే కొత్త వెలుగు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజలు నిరీక్షిస్తున్నారు. మార్పు కోసం ఏపీలోని 12,918 గ్రామ పంచాయతీలు ఎదురుచూస్తున్నాయి.

సమకాలీనం

పల్లెకు మంచి రోజులొస్తున్నాయి. సానుకూల వాతావరణం పెరుగుతోంది. ఇక ‘కనిపించని కుట్రల’ను ఛేదించే చొరవ గ్రామస్తులే తీసుకోవాలి. పల్లె కన్నీరు తుడవాలి. సుదీర్ఘకాలం వ్యవసాయం కుదేలవటం వల్ల గ్రామ స్వరూపం మారింది. చేతి వృత్తులు భంగపడి గ్రామం బోసిపోయింది. ఉద్యోగ–ఉపాధి అవకాశాలు సన్నగిల్లి పట్టణాలు, నగరాలకు వలసలు పెరిగాయి. పాలకుల నిర్లక్ష్యమూ తోడై చాన్నాళ్లుగా పల్లె కళ తప్పింది. నిన్నా, ఇవాళ్టి వరకు ఏ ఊరు చూసినా జీవం కోల్పోయిన అచేతన కొట్టొచ్చినట్టు కనిపించేది. పరిస్థితులు మెలమెల్లగా మారుతున్నాయి. పట్టణ, నగర జీవుల్లోనూ పుట్టినూరుపై మమకారం పెరుగుతోంది. చుట్టపు చూపుగానైనా సాగే సొంతూరు పర్యటనలు పెరుగుతున్నాయి. పల్లెతో బంధాన్ని పెనవేస్తున్నారు. పెరిగిన శాస్త్రసాంకేతిక పుణ్యమా అని గ్రామాల్లోనే ఏదైనా సమకూర్చుకునే వెసలుబాటొచ్చింది. నగర జీవనంపై మొహం మొత్తిన సంపన్నులూ, విడిదిలానైనా బాగుంటుందని ఊరితో బంధం పునరుద్ధరిస్తున్నారు. పాలకుల విధానాల్లో, రాజకీయ దృక్కోణంలోనూ గ్రామీణ భారతానికి ప్రాధాన్యత పెరుగుతోంది. నాయకుల ఓట్ల గురి కావచ్చు, సంక్షోభం నుంచి రైతును గట్టెక్కించే సర్కార్ల చేయూత కావచ్చు, మారిన పరిస్థితుల్లో గ్రామాలకు నేరుగా నిధులు రావడం కావచ్చు.. కారణం ఏమైతేనేం పల్లెకు ప్రాధాన్యత లభిస్తోంది. కేంద్రం ప్రకటించిన పలు అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాల్లోనూ గ్రామం కేంద్రబిందువుగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనూ పరిస్థితులు ఆశావహంగా కనిపిస్తున్నాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలై తాజా సర్కారు ఏర్పడ్డ క్రమంలోనే పంచాయతీ ఎన్నికలూ ముగిసి గ్రామాలకు కొత్త పాలకులొచ్చారు. పంచాయతీరాజ్ కొత్త చట్టం విస్తృతాధికారాలు కల్పించడంతో పాటు స్థానిక పాలకుల బాధ్యతల్నీ పెంచింది. ఏపీ రాష్ట్రం ఇపుడు శాసనసభ ఎన్నికల ముంగిట్లో నిలిచింది. గ్రామీణ పాలనా విధానం సమూల మార్పు సంకేతాలు వెలువడుతున్నాయి. కొత్త వెలుగుకోసం జనం నిరీక్షిస్తున్నారు. పల్లెల పునరుద్ధరణకు తెలుగునాట ఇది మంచి తరుణం.

విభజనతో రెండు నమూనాలు

విభజన తర్వాత ఏర్పడ్డ తెలంగాణ, ఏపీల్లో రెండు వేర్వేరు గ్రామీణ పాలనా నమూనాలు ఆవిష్కృతమయ్యాయి. తెలంగాణలో ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ఒక నమూనా అమలు చేస్తే, ఏపీలో సీఎం చంద్రబాబునాయుడు మరో నమూనాతో వెళ్లారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారుల ఎంపిక నుంచి అన్ని వ్యవహారాలు పార్టీ కార్యకర్తల కనుసన్నల్లో సాగించే పంథాను బాబు ఎంచుకున్నారు. పార్టీ శ్రేణుల్ని పాలనలో దొడ్డిదారి భాగస్వాముల్ని చేశారు. స్థానిక పంచాయతీ పాలనా వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ఈ దేశంలో బహుళ ప్రచారంలో ఉన్న కమ్యూనిస్టు పాలకుల ‘పశ్చిమ బెంగాల్’ నమూనానే ఆయన నమ్ముకున్నారు. తద్వారా సుదీర్ఘకాలం అప్రతిహతంగా రాజ్యం చేయాలనుకున్నారు. పార్టీ శ్రేణులతో జన్మభూమి కమిటీల ఏర్పాటు చేసి పాలన సాగిస్తున్నారు. కానీ, అదొక విఫల నమూనాగా ధ్రువపడిన విషయాన్ని ఆయన పరిగణనలోకి తీసుకోలేదు. తృణమూల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జీ కూడా బెంగాల్‌లో అదే నమూనాతో ‘పార్టీ శ్రేణుల’ కేంద్రకంగా సాగిస్తున్న పాలన క్రమంగా బెడిసికొడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ అవే సంకేతాలు, అవినీతి ప్రజల కళ్లకు కట్టినట్టు కనిపించడం ఈ నమూనాలో బహిరంగ రహస్యం! దీనిపై పూర్తి అవగాహన ఉన్న కేసీఆర్ భిన్నమైన పంథాలో పాలనసాగించారు. ప్రజానుకూల ప్రభుత్వ విధానాలు, అధికార యంత్రాంగంపై సరైన అజమాయిషీ, నేరుగా ప్రజలకు ఫలాలు అందించడం.. అనే పద్ధతికే ఆయన ప్రాధాన్యత ఇచ్చారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు, రైతుబీమా, కళ్యాణ లక్ష్మి.. ఇవన్నీ ఇటువంటివే! పార్టీ శ్రేణుల్ని పాలనలోకి జొరనివ్వలేదు. అందుకే, తమ వ్యక్తిగత అవసరాలు తీర్చలేదని స్థానిక నాయకత్వంపైన, ప్రజాప్రతినిధులపైన ప్రజల్లో బలమైన అసంతృప్తి ఉన్నా, వ్యతిరేకత వెల్లువెత్తినా... ఇటీవలి ఎన్నికల్లో కేసీఆర్ అన్నీ తానై ప్రచారం చేసి ప్రజాభిప్రాయాన్ని తనకు అనుకూలంగా మలిచారు. ఘన విజయం సాధించారు. ఇటీవలి కాలంలో పాలకపక్ష శ్రేణులు ప్రజాభిప్రాయాన్ని సర్కారుకు అనుకూలంగా మలచలేకపోతున్నాయనే ఒక అధ్యయన నివేదిక కేసీఆర్‌ను బాగా ప్రభావితం చేసినట్టుంది. అందుకే ఆయన తొలి నుంచి జాగ్రత్త పడ్డారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పుష్కరకాలం పైగా ఉద్యమించిన పార్టీ అయినా, అధికారంలోకి వచ్చాక పార్టీ శ్రేణుల విచ్చలవిడితనాన్ని ఆయన ప్రోత్సహించలేదు. అట్టడుగుస్థాయిలో జనాభిప్రాయాన్ని పాలకపక్ష శ్రేణులు ఓటుగా మలిచే ప్రభావం క్రమంగా సన్నగిల్లుతోందని ‘అభివృద్ధి సమాజాల అధ్యయన కేంద్రం’(సీఎస్‌డీఎస్) పరిశీలనలో వెల్లడైంది.

పార్టీలకతీతంగా గ్రామాలు ఎదగాలి

తెలంగాణలో కొత్త పంచాయతీ చట్టం అమల్లోకి వచ్చింది. వారం కిందటి నుంచి కొత్త సర్పంచులు, పాలకమండళ్ల పాలన మొదలయింది. పార్టీలతో నిమిత్తం లేకుండా జరిగిన ఈ ఎన్నికల్లో యువతరం ఉత్సాహం పతాకస్థాయికి చేరింది. పెద్ద సంఖ్యలో యువత సర్పంచులుగా, వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. ప్రధాన పార్టీలు కూడా పెద్దగా పట్టింపులకు వెళ్లలేదు. ఒక పార్టీకే చెందిన ఇద్దరు, ముగ్గురు కూడా పోటీ చేశారు. పదేళ్లపాటు రిజర్వేషన్లు మారవనేది ప్రభావం చూపింది. బాగా పనిచేస్తే మరో దఫా ఎన్నికవొచ్చన్న భరోసా కలిగింది. ఈ సారి పట్టణాలు, నగరాల్లోని వ్యాపార–వాణిజ్య వేత్తలు, సంపన్నులు, మేధావులు తమ సొంతూళ్ల పంచాయతీ ఎన్నికల పట్ల ఆసక్తి చూపారు. అక్కడక్కడ తమ వారనుకునే అభ్యర్థులకు మద్దతో, సహాయ సహకారాలో అందించారు. పలుచోట్ల పట్టుబట్టి గెలిపించుకున్నారు. ఇదొక ప్రగతి సంకేతం! గ్రామ పంచాయతీలను పరిపుష్టం చేయడంలో, నిధుల్ని సక్రమంగా వినియోగించి గ్రామాభివృద్ధి సాధించడంలోనూ ఈ సహకారం కొనసాగాలి. పల్లె పట్టణం పెనవేయాలి. త్వరలో పంచాయతీ ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వనున్న శిక్షకులను చైతన్యపరుస్తూ మాట్లాడిన ముఖ్యమంత్రి కేసీయార్ ప్రభుత్వ సంకల్పాన్ని విస్పష్టంగా చెప్పారు. గ్రామాభివృద్ధికి గ్రామస్తులే బాధ్యత వహించాలన్నారు. పాలకమండళ్ల నిబద్ధతతో, లక్ష్యసాధనపై గురి–జవాబుదారితనంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. 15వ ఆర్థిక సంఘం, కేంద్ర–రాష్ట్ర పథకాలు, ఎమ్మెల్యే–ఎమ్మెల్సీ–ఎంపీల అభివృద్ధి నిధులు.. ఇలా వివిధ పద్ధతుల్లో గ్రామాలకు రాబోయే అయిదేళ్లలో నలభై వేల కోట్ల రూపాయలు రానున్నాయని చెప్పారు. తెలంగాణలో 12,751 గ్రామ పంచాయతీలున్నాయి. ఇదొక సువర్ణావకాశం. కొత్త చట్టం ఎన్నో అవకాశాల్ని కల్పిస్తోంది. ప్రతి రెండు నెలలకోసారి జరిగే గ్రామ సభలో గ్రామస్థులు విధిగా పాల్గొని, అభివృద్ధి–సంక్షేమాన్ని గరిష్ఠంగా సాధించుకోవాలి. అధికారాలే కాకుండా వైఫల్యాలకు ప్రజాప్రతినిధుల్ని బాధ్యుల్ని చేసే, అవసరమైతే సర్పంచ్‌ను కలెక్టర్ సస్పెండ్ చేసే నిబంధనలు కూడా చట్టంలో ఉన్నాయి. అలా అని, పాలకపక్షం తన రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకునే సాధనంగా, దీన్ని సర్పంచుల ‘తలపై నిరంతరం వేలాడే కత్తి’ చేయకుండా ప్రజలే ప్రతిఘటించాలి. అవినీతిని అడ్డగించి, మంచిని సాధించుకునేలా నిఘావేయాలి.

రాజ్యాంగేతర శక్తులకు చరమగీతం

విభజన తర్వాత అవశేష ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అవకాశాలు క్రమంగా సన్నగిల్లాయి. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో ఏ రాజ్యాంగబద్ధత లేని జన్మభూమి కమిటీలకు ప్రాధాన్యతనివ్వటంతో అవినీతి రాజ్యమేలుతోంది. ఈ చీకటిని తొలగించే కొత్త వెలుగు కోసం ఏపీ ప్రజలు నిరీక్షిస్తున్నారు. చట్టబద్ధమైన గ్రామసచివాలయాన్ని కేంద్రబిందువుగా చేసి, గ్రామీణ వికాసానికి బాటలు పరుస్తామని విపక్ష నేత, వైఎస్సార్సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి చెబుతున్న మాటలు ఇక్కడి ప్రజల్లో కొత్త ఆశలు రేపుతున్నాయి. దానికి కారణం, గ్రామీణ పాలనా వ్యవస్థను ఏపీలో బాబు ప్రభుత్వం బలహీనపరచడమే! ప్రజలతో ఎన్నికైన సర్పంచులు, పాలక మండళ్లను నిర్వీర్యం చేసి, పార్టీ కార్యకర్తలు కీలకంగా ఉండే జన్మభూమి కమిటీలకు పెత్తనం అప్పగించింది. రేషన్‌కార్డులు, ఇళ్లు, పెన్షన్లు... ఇలా ఏ ప్రయోజన లబ్దిదారుల ఎంపికలోనైనా వారిదే కీలక భూమిక! కేంద్ర ప్రభుత్వ నిధుల్ని కూడా రాష్ట్ర కేంద్రీకృత పథకాలకు దారి మళ్లించడం ఇక్కడ రివాజయింది. 14వ ఆర్థిక సంఘం ఇచ్చిన నిదులకు కూడా దిక్కులేని పరిస్థితి! రెండు వేల జనాభా ఉన్న గ్రామాలకు కూడా ఏటా 9 లక్షల రూపాయలకు తగ్గని నిధులు వస్తున్నా, అవి నేరుగా గ్రామాభివృద్ధికి దక్కడం లేదు. చంద్రన్న బాట, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్.. ఇలా ఏవేవో పథకాల్లోకి మళ్లించి వ్యయం చేస్తున్నారు. స్థానికంగా పన్నులు విధించడం ద్వారా ఏటా లభించే దాదాపు 500 కోట్ల రూపాయల్నీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కేంద్రీకృత కార్యక్రమాల్లో వ్యయం చేస్తున్నారు. గ్రామాల స్థానిక పరిస్థితిని బట్టి, అక్కడి అవసరాలు తీర్చుకునే వెసులుబాటు కూడా వారికి లేకుండా చేస్తున్నారు. త్వరలోనే రాష్ట్ర శాసన సభకు ఎన్నికలు జరుగనున్న వేళ, ఈ దుస్థితిని తప్పించే అవకాశం కోసం ఏపీలోని 12,918 గ్రామ పంచాయతీలు నిరీక్షిస్తున్నాయి.

ఇదే మంచి తరుణం

గ్రామీణ వికాసానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నట్టు ఇటీవలి బడ్జెట్ స్పష్టం చేసింది. రైతుకు పెట్టుబడి, అసంఘటిత కార్మికులకు పెన్షన్, వైద్య పథకం విస్తరణ, గ్రామీణ రోడ్లు 3 రెట్లు పెంచడం, ‘గ్రామ్ జ్యోతి’ ప్రాధాన్యత, లక్ష గ్రామాల డిజిటలైజేషన్, ఉపాధిహామీకి నిధుల పెంపు... వంటివన్నీ గ్రామీణ వికాసానికి సానుకూల చర్యలే! కేంద్ర రాష్ట్రాలు కలిసి గ్రామాలను ఆర్థిక, ఉత్పత్తి కేంద్రాలుగా చేయాలి. గ్రామీణ గ్రోత్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. వ్యవసాయ మార్కెట్ సదుపాయాలు పెంచాలి. స్థానికంగా ఉద్యోగ–ఉపాధి అవకాశాల్ని మరింత మెరుగుపరచాలి. ఇదొక మంచి తరుణం. గ్రామీణ ప్రజానీకం, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండి ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి, సానుకూలంగా మలచుకోవాలి. ప్రగతి పల్లవించాలి, మళ్లీ పల్లెలు వికసించాలి. గడపగడపన ఆనందం వెల్లివిరియాలి. పూజ్య బాపూజీ కలలుకన్న ‘గ్రామస్వరాజ్యం’ విరాజిల్లాలి.

ఈ–మెయిల్ : dileepreddy@sakshi.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కార్యకర్తలు



“రాజకీయాల్లోకి ఇందిరా గాంధీ మనవరాలు ప్రియాంక గాంధీ రంగ ప్రవేశం చేసిందని సంబరాలు చేసుకుంటూ, అఖిలేష్, మాయావతి ఓటు బ్యాంకుకు గండికొడుతుందని భావిస్తున్నవారంతా ఒకసారి ఉత్తరప్రదేశ్ లో పర్యటించాలి. అంకిత భావం కలిగిన కార్యకర్తల వలనే ఎన్నికల్లో విజయం సాధ్యమవుతుందని అందరికీ అర్థమవుతుంది. ఎన్నికల్లో పార్టీల కోసం పోరాడేది కార్యకర్తలు మాత్రమే, స్టార్స్ కాదు”

– ప్రశాంత్ కుమార్, జర్నలిస్టు

గుట్టు



“అధికార పార్టీకి అనుకూలంగా పని చేస్తూ రూ.35 వేల నుంచి రూ.1.5 లక్షల వరకూ పొందుతున్న జర్నలిస్టులు, సామాజిక మాధ్యమాల్లో పని చేసేవారి పేర్లు త్వరలో బయటపడనున్నాయా? వీరిలో కొందరు ఎదురుతిరిగి అందరి పేర్లూ బయటపెట్టేస్తామని బెదిరిస్తున్నట్టు సమాచారం చక్కర్లు కొడుతోంది”

– రోహిణీ సింగ్, జర్నలిస్ట్

పాఠం



“శబరిమల ఆలయ బోర్డు నుంచి ముస్లింలలో ఉన్న సంప్రదాయవాదులు గుణపాఠం నేర్చుకుంటే బాగుంటుంది. మహిళలను అనుమతించడానికి అంగీకరించడం ద్వారా ఆలయం వారు పెద్ద ముందడుగు వేశారు. ముస్లిం మతాధికారులు సరైన నిర్ణయం దిశగా ఒక్క అడుగైనా వేస్తారని ఆశించవచ్చా?”

– జావేద్ అక్తర్, రచయిత

లైంగిక నేరం



“మహిళలకు కన్యత్వ పరీక్షలు నిర్వహిస్తున్న వారిని లైంగిక నేరం కింద అరెస్ట్ చేయాలి. ఈ అంశానికి ప్రచారం కల్పిస్తున్న నా సీనియర్ సహచరులు, ఇతర కార్యకర్తలను చూసి నేను గర్వపడుతున్నా. ఇది కేవలం మహిళలకు సంబంధించిన విషయం మాత్రమే కాదు, మొత్తం సమాజానికి చెందిన అంశం”

– ఆదిత్యా థాకరే, శివసేన నాయకుడు

వాటా



“మన జనాభాలో ముస్లింల శాతం 14.2. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో గ్రూప్ ఏ అధికారుల్లో వారి వాటా ఇలా ఉంది. సివిల్ సర్వీసెస్‌లో 4.8శాతం, రైల్వే, టెలిగ్రాఫ్‌లో 2.5శాతం, పోస్టల్ సర్వీసెస్‌లో 3.8శాతం, భద్రతా సంస్థల్లో 3.1శాతం, బ్యాంకుల్లో 1.7శాతం, విశ్వవిద్యాలయాల్లో 3.7శాతం, పబ్లిక్ రంగ సంస్థల్లో 2.3శాతం ఉన్నట్టు సచార్ నివేదిక ఈ లెక్కలు తేల్చింది”

– అశోక్ స్వైన్, యునెస్కో సభ్యుడు

అర్బన్ నక్సల్స్ అసలు లక్ష్యం!

కొంత కాలం క్రితం బెంగళూరు నగరంలో జరిగిన నిరసన ప్రదర్శనలో బహిరంగంగా సినీ నటుడు రచయిత కవి గిరీష్ కర్నాడ్, స్వామి అగ్నివేశ్ మరికొందరు మేమూ అర్బన్ నక్సల్స్ అంటూ మెడలో ప్లే కార్డులు ధరించారు. ‘అర్బన్ నక్సల్స్’, ‘హాఫ్ మావోయిస్ట్స్’ అనే పదాలు నేడు దేశమంతటా ప్రతిధ్వనిస్తున్నాయి. నగర ప్రాంతాలలో స్థావరాల గురించి ఒకటిన్నర దశాబ్దం క్రితం మావోయిస్టులు కన్న కల ఇప్పుడు ఫలిస్తున్నది. ఉగ్రవాద ధోరణులకు జనామోదం సమకూర్చడమే అర్బన్ నక్సల్స్ ప్రథమ కర్తవ్యం. వీరి అర్బన్ పర్స్పెక్టివ్ పత్రం ప్రకారం పట్టణాలలో, నగరాలలో అసంఘటిత రంగ కార్మికులను సంఘటితం చేయాలి. కార్యకర్తలను సేకరించడంతో పాటు, నాయకత్వాన్ని అభివృద్ధి చేసే పని జరగాలి. సెక్యులర్ శక్తులను, పీడనకు గురి అవుతున్న అల్పసంఖ్యాక వర్గాలను హిందూ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ఏకం చేయాలి.

2004లో నాటి ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరిపినప్పటి నుంచి నగరాలు, పట్టణాలపై దృష్టి కేంద్రీకరించడం కోసం నక్సల్స్ అధినాయకత్వం శ్రమిస్తూనే ఉంది. పథకం ప్రకారం ఎంపిక చేసిన తమ నాయకులను కొందరిని జనజీవన స్రవంతిలో కలిపి దేశవ్యాప్తంగా తమ పోరాట పంథాను మార్చి భావప్రకటన స్వేచ్ఛ ముసుగులో వివిధ ప్రజా ఉద్యమాలకు నేతృత్వం వహిస్తూ భారత ప్రభుత్వంపై తమ యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. సంఘ పరివార సంస్థలపై అక్కసును వెళ్లగక్కడం అర్బన్ నక్సల్స్ వ్యూహం. రచయితలను, మేధావులను విద్యార్థులను ‘బ్రెయిన్ వాష్’ చేసి అడవులకు పంపే ప్రయత్నంలో అర్బన్ నక్సల్స్ సఫలీకృతం అవుతున్నారా అనిపిస్తోంది. విశ్వవిద్యాలయాల్లో ఒకప్పటి రాడికల్ విద్యార్థి సంఘం పాత్రను అధ్యాపకులు, మేధావుల రూపంలో కొందరు అర్బన్ నక్సల్స్ పోషిస్తున్నారు.

నక్సలైట్ల ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రారంభమైన మొదటి రోజుల నుంచే ఇప్పటి అర్బన్ నక్సల్స్ కీలకపాత్ర పోషిస్తూ వచ్చారు. వీరు గతంలో హక్కుల ఉద్యమకారులుగా చెలామణీ అయ్యారు. సకల వ్యవహారాలను చట్టాలకతీతంగా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ముసుగులో కోర్టుల బయట రాజకీయ రచ్చ ద్వారా తేల్చుకుంటామని భావిస్తున్నారు. మరోవైపున చట్టం తన పని తాను చేసుకుంటూ వెళ్ళే మార్గంలో అర్బన్ నక్సల్స్ సమస్యకు సరైన పరిష్కారాలు లభిస్తాయని ఆశిద్దాం.

కొట్టె మురళీకృష్ణ, కరీంనగర్
మొబైల్ : 94417 26741

శారదా మోసంలో ఎవరి వాటా ఎంత?

విశ్లేషణ


మాడభూషి శ్రీధర్

అవినీతికి వ్యతిరేకమని చెప్పుకునే అధికార పార్టీ బీజేపీ శారదా మోసాల్లో తన పాత్రకు జవాబు చెప్పుకోవలసిన స్థితి ఏర్పడింది. శారదా గ్రూప్ పేరుతో 200 ప్రయివేటు కంపెనీలు నడిపిన పొంజీ స్కీం దివాళా తీయడంతో కోటి 70 లక్షల మంది డిపాజిటర్ల బతుకులు రోడ్లమీద పడ్డాయి. రెండు, మూడు వేల కోట్లకు పైగా పెట్టుబడులు సేకరించి ఈ గ్రూప్ జనాన్ని ముంచింది. 1920 కాలంలో చార్లెస్ పొంజీ అనే అతి తెలివైన మోసగాడు పెట్టుబడులు ఆకర్షించడానికి పెద్ద వడ్డీ ఆశ చూపడం, వచ్చిన డబ్బుతో పాత డిపాజిటర్లకు లాభాలు చూపి, కొత్త డిపాజిటర్లలో ఆశలు రేపడం, లాభాలు వస్తాయని నమ్మించడం, ఇంకా డిపాజిట్లు వసూలుచేసి చేతులు ఎత్తేసే మోసాలకు పాల్పడటంతో వీటిని పొంజీ స్కీం అని పిలుస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఈ మోసం బయటపడగానే తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ కమిషన్ వేసింది. ఇదొక భీకర ఆర్థిక లావాదేవీల గందరగోళం. ఇందులో దర్యాప్తు చేయవలసింది కేవలం పోలీసు మాత్రమే కాదు, ఈడీ, ఆదాయపు పన్ను శాఖ, సెబీ, ఆర్‌బీఐ వంటి కేంద్ర సంస్థలు కూడా.

ఆర్థిక సేవలను, మౌలిక వనరుల యాజమాన్యం, ఆటోమొబైల్ రంగం, ఉత్పత్తి రంగాలలో సేవలందిస్తామని చెప్పుకుంటూ శారదా గ్రూప్ డిపాజిట్ల వసూలు కార్యక్రమం మొదలుపెట్టింది. సుదీప్తోసేన్ ఈ సంస్థకు మేనేజింగ్ డైరెక్టరూ చైర్మన్ కూడా. సేన్‌తోపాటు మరో నిందితుడు దేబ్జానీ ముఖర్జీ పారిపోయారు. రాజీవ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటయిన ప్రత్యేక పరిశోధక బృందం వీరిద్దరినీ పట్టివేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కునాల్ ఘోష్‌ను కూడా సిట్ అరెస్టు చేసింది. 2014లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు, మమతా బెనర్జీ సన్నిహితులైన మదన్ మిత్రా, రజత్ మజుందార్‌లను సిట్ అరెస్టు చేసింది. అధికార పార్టీఎమ్మెల్యేను అరెస్టు చేసి సిట్ నిష్పాక్షికతను చాటింది.

ఈ మోసం అస్సాం, త్రిపుర ఒడిశా రాష్ట్రాల ప్రజలను కూడా ముంచేసిన విషయం 2014లో సుప్రీంకోర్టు పరిశీలించి శారదా ఆర్థిక కుంభకోణాన్ని సీబీఐ దర్యాప్తు చేయాలని ఆదేశించింది. రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు సాగిస్తున్న సిట్‌ను మొత్తం పత్రాలు సీబీఐకి అప్పగించాలని ఆదేశించారు. వారు అప్పగించారు కూడా.

ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేదని, ఆరోపిస్తూ శారదా గ్రూప్ సొంతదారులు టీ ఎంసీ ఎంపీ కునాల్ ఘోష్ తమను మోసం చేశారని ఫిర్యాదు చేస్తే 2013లో ఆయన్ను అరెస్టు చేశారు. కొన్ని గంటల్లోనే కునాల్ ఘోష్ ఈ కుంభకోణంలో ముకుల్ రాయ్‌తోసహా 12మంది ఉన్నారంటూ తీవ్ర ప్రత్యారోపణలు చేశారు. ముకుల్ రాయ్ ఇంటిపైన, ఆయన భార్య నడిపే న్యూస్ చానెల్‌పైన అప్పుడు సీబీఐ దాడులు జరిపింది. నవంబర్ 26, 2014న ఆయన్ను ప్రశ్నించింది. అరెస్టు కూడా చేసింది. అస్సాంలో తన వ్యాపారం సాగడానికి నెలకు 20 లక్షల రూపాయలను శారదా చైర్మన్ సుదీప్తోసేన్‌కు ఇచ్చినట్టు ముకుల్‌సేన్ మీద ఉన్న ఆరోపణ. అస్సాంలో రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్లు, మీడియా బారన్లు తమ నుంచి డబ్బు వసూళ్లు చేసే వారని ముకుల్ రాయ్ ప్రత్యారోపణ చేశారు. వసూళ్లు చేసిన వారి పేర్లు కూడా ఆయన ఉత్తరంలో సీబీఐకి వెల్లడించారు. ముకుల్ రాయ్ తృణమూల్ వదిలి తమ పార్టీలో చేరాలని 2015 నుంచి బీజేపీ ముకుల్‌రాయ్‌తో సంప్రదింపులు మొదలు పెట్టింది. మమతా బెనర్జీకి ఆయన చాలా సన్నిహితుడు. ఆమె తరువాత స్థాయి నాయకుడని పేరు. నవంబర్ 3, 2017న చివరకు ఆయన బీజేపీలో చేరవలసి వచ్చిందో చేర్పించుకున్నారో మనం ఊహించవచ్చు. సుదీప్తో సేన్ డ్రైవర్ సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో ముకుల్ రాయ్ చేసిన మహత్కార్యాలు ఎన్నో వెల్లడయ్యాయి. సుదీప్తోసేన్ కోల్‌కతా నుంచి పారిపోవడానికి ముకుల్ ఎంతో సాయం చేశారట.


అస్సాం కాంగ్రెస్‌కు చెందిన మరో నాయకుడు హిమంత బిస్వాశర్మ కూడా ఫిరాయించి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిద్దరు బీజేపీలో చేరిన తరువాత కేంద్ర ప్రభుత్వానికి ఈ కేసును విచారించడంలో అంత ఆసక్తి ఉన్నట్టు కనిపించలేదు. కేసు మూలన పడింది.

హిమంత బిస్వాశర్మ బీజేపీలో చేరి శుద్ధి పొందినందునే చార్జిషీటులో నిందితుడు కాలేదని విమర్శిస్తే తప్పా? ప్రధాన నిందితుడైన సుదీప్తో సేన్ పారిపోవడానికి సహకరించిన ముకుల్ రాయ్‌ను సీబీఐ దర్యాప్తు జరుపుతున్న దశలో ఎందుకు చేర్చుకున్నట్టు? శారదా కుంభకోణానికి సహకరించినట్టు ఆరోపితులైన వారు బీజేపీలోచేరిన తరువాత సీబీఐ దర్యాప్తు ఎందుకు ఆలస్యమయింది? శారదా దర్యాప్తును ఆటంకపరిచింది తృణమూల్ ప్రభువులా, బీజేపీ చక్రవర్తులా?

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

మరణంలేని మందహాసం

మనిషిని బంధించగలరు కానీ, మెదడును కాదు. ఆలోచనలు కొత్త ఆవిష్కరణలకు ఊపిరులూదుతూనే ఉంటాయి. కళ్ల ముందు చీకటిని గుమ్మరించగలరేకానీ, కలలను చిదిమేయలేరు. మనో ప్రపంచంలో రెక్క విప్పుకునే స్వేచ్ఛా విహంగాలు కొత్త ముచ్చట్లు చేరవేస్తూనే ఉంటాయి. అండా సెల్ అంటే కొత్త మోడల్ సెల్‌ఫోన్ అనుకునే ఈతరపు యువతలో కొందరికి జి.ఎన్.సాయిబాబా ప్రస్తుత స్థితి అర్థం కాకపోవచ్చు. వీల్ చైర్ లేకుండా కదలలేని మనిషినీ, సాయం లేకుండా సొంత పనులు చేసుకోలేని వ్యక్తినీ చూసి భయపడినవారు ఆయనను పగటికీ, రాత్రికీ తేడా తెలియని అండా సెల్‌లో బంధించి తమ అమానవీయతతో ఎందరినో భయకంపితులను చేయాలని ప్రయత్నిస్తున్నారు. కానీ, ఆ అండా సెల్ జైలు గది ఆయనలోని కొత్త కోణాన్ని మేల్కొలిపింది. తన ఆవేదనకు, ఆలోచనలకు, కలలకు ఆయన ఇచ్చిన అక్షరరూపమే ‘నేను చావును నిరాకరిస్తున్నాను’ కవితా సంపుటి. ఆంగ్లంలో సాయిబాబా రాసిన కవితలను పలువురు తెలుగులోకి అనువదించారు.



ప్రవక్త, జీసస్, బుద్ధుడు, మహావీరుడు.. ఎవరూ ఇక రారనీ, మన కోసం మిగిలింది భయానక భవిష్యత్ మాత్రమే సాయిబాబా ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేస్తారు. దేశాలు మృత్యుకాంక్ష అలుముకున్న బందిఖానాలు అంటూ ప్రస్తుత ప్రపంచ పరిస్థితిని ఆవిష్కరిస్తారు. మన దేశానికి ప్రత్యేక పరిస్థితులున్నమాట నిజమే. కానీ, వాటిని ఆచారాలు, కట్టుబాట్లు పేరిట భావాజాలాన్ని నియంత్రిస్తూ ఎంతో కొంత ముందుకు వెళ్తున్న సమాజాన్ని మళ్లీ రాతియుగం నాటికి లాక్కువెళ్లే యత్నం చేస్తున్నాయి పాలకవర్గాలు. వెలుతురు సైతం రావడానికి వెనుకాడే తన ఒంటరి అండా సెల్ గదిలోకి ఒక పిచ్చుక వచ్చినట్టు అనిపిస్తే.. ప్రతి రాత్రీ వచ్చిపోవూ, ఒంటరితనం భయంకరంగా ఉందని కోరడం హృదయాన్ని కదిలించివేస్తుంది. బాధిస్తున్న ఒంటరితనంలో కూడా ఆయనలోని మానవత మాసిపోలేదు. తనకు కాపలా కాసే గార్డు అతడికి పంట కాలువలా కనిపిస్తాడు. తాను కాదు, అతడే అక్కడ అసలు ఖైదీ అని ఆవేదన చెందుతాడు. పీడిత ప్రజల అసలు చరిత్రను పునర్నిర్మించేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన సాయిబాబా కవిత్వం మరణాన్ని చూసి చేసే మందహాసం.

– దేశరాజు

(9,10 తేదీల్లో నల్గొండలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాలులో జరగనున్న విరసం సాహిత్య పాఠశాలలో జి.ఎన్.సాయబాబా అండాసెల్ కవిత్వం ‘నేను చావును నిరాకరిస్తున్నాను’ ఆవిష్కరణ సందర్భంగా)



ఆనంది భారతదేశపు
తొలి వైద్యురాలు.
ఆవిడ తెలివైందని..
ఆలోచన గలదనీ..
కష్టాన్ని జయించగలదనీ..
పందొమ్మిదో శతాబ్దంలోనే
అమెరికా వెళ్లి
డాక్టర్ చదువు చదివేంత
ధైర్యం గలదనీ..
ఇన్ని.. ఉన్నా..
ఆవిడ విజయం..
భర్త రాసిన ప్రిస్క్రిప్షన్‌గానే
ఉండిపోయింది!
ఆ ప్రిస్క్రిప్షన్‌ని కొద్దిగా మారుస్తూ..
ఆనందీ గొప్పతనాన్ని,
వారిద్దరి అన్యోన్య దాంపత్యాన్నీ
చూపించబోతోంది..
కొత్త మరాఠీ సినిమా..
'ఆనందీ గోపాల్'.

'ఆనందీ గోపాల్' చిత్రంలో ఆనందీబాయిగా భాగ్యశ్రీ మిలింద్, గోపాల్రావ్‌గా లలిత్ ప్రభాకర్

కాండక్ట్

ఎయిర్ బస్

'వణక్కమ్ (నమస్కారం) మనకు ప్రభుత్వం మంచి బస్సు ఇచ్చింది. దీనిని పరిశుభ్రంగా ఉంచడానికి సహకరించండి. చెత్త పారేయవద్దు. నా దగ్గర చింతపండు క్యాండీ ఉంది, మీకు వికారంగా ఉంటే అడగండి, ఇస్తాను, మీకు వాంతి అయ్యేలా ఉంటే చెప్పండి, బ్యాగు ఇస్తాను. ఎవ్వరూ మొహమాటపడక్కర్లేదు' అంటూ ప్రయాణికులను మృదువుగా ఆహ్వానిస్తారు శివషణ్ముగమ్. కోయంబత్తూరు సింగనల్లూరు బస్‌స్టాండ్ బస్ హార్న్ శబ్దాలతో, టైర్ల బర్‌బర్ ధ్వనులతో, దుర్వాసనతో, బాగా రద్దీగా, గందరగోళంగా ఉన్న సమయంలో శివషణ్ముగమ్ పిలుపు అమృతంలా చెవిని తాకుతుంది. ఈయన మాట్లాడిన మాటల వీడియో కిందటి వారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆయనకు తక్షణమే ప్రజలలో మంచి గుర్తింపు కూడా వచ్చింది. చాలా న్యూస్ చానెల్స్ ఆయనను పలకరించాయి. ఒక చిన్న స్వాగతవచనం ఎంతో కండక్టరుగా పనిచేస్తున్నారు శివషణ్ముగమ్.

ఆ బస్టాండ్‌లో 'మదురై బై పాస్... మదురై బై పాస్'... అంటూ బస్ ఫుట్‌బోర్డు మీద నిలబడి, ప్రయాణికులను ఆప్యాయంగా పిలుస్తుంటారు శివషణ్ముగమ్. ఆయనకు ఈ రూట్‌లో ఇటీవలే కొత్త బస్సును కేటాయించారు. నీలి రంగు యూనిఫారమ్‌లో, చేతిలో సంచితో బస్ డోర్ దగ్గర నిలబడి, 52 సంవత్సరాల శివషణ్ముగమ్ ''మీరంతా ఈ బస్సులో ప్రయాణించడానికి ఏదో ఒక కారణం ఉంది. మీ అందరికీ శుభం జరగాలి. మీ యాత్ర దిగ్విజయంగా జరగాలని మా డ్రైవర్ సదాశివం, నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. మీకు సహాయపడడానికి నేను ఇక్కడ ఉన్నాను' అని చెబుతారు. విమానంలోకి ఎక్కగానే ఎయిర్ హోస్టెస్ మాట్లాడే స్వాగత వచనాలను పోలి ఉంటాయి శివషణ్ముగమ్ మాటలు. కాని ఇంతవరకు ఒక్కసారి కూడా ఆయన విమానం ఎక్కలేదు. ఇది తనకు తానుగా అల



కండక్టర్ శివషణ్ముగమ్

మందిని ఎందుకు ఆకర్షించింది? సాధారణంగా మన బస్ కండక్టర్లు, పని ఒత్తిడి కారణంగా కాని, ఇతర కారణాల వల్ల కాని చాలా చిరాకుగా, నిర్లక్ష్యంగా గాని ప్రవర్తిస్తుంటారు. స్నేహపూర్వకంగా పలకరించరు. కాని శివషణ్ముగమ్ మాత్రం ప్రశాంతమైన, స్వచ్ఛమైన వాయువు పీల్చుకునేలా ప్రయాణికులకు తోడ్పడతారు.

తమిళనాడు స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌కి చెందిన కోయంబత్తూరు – మదురై బస్సులో వాటు చేసుకున్న సంప్రదాయం.

23 సంవత్సరాలుగా టీఎన్‌ఆర్‌టీసీలో పని చేస్తున్న శివషణ్ముగమ్ ఇటువంటి పలకరింపును ఇటీవలే ప్రారంభించారు. ప్రయాణికులంతా ఈ బస్సును పరిశుభ్రంగా ఉంచుతారని ఆశిస్తున్నాను' అంటూ అందరినీ ఉత్తేజపరుస్తూ, ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ప్రశాంత చిత్తంతో ప్రారంభించేలా చేస్తున్నారు శివషణ్ముగమ్.

– జయంతి

బ్యూటిప్స్

కొండంత అందం



● గోళ్లకు ముందు వేసుకున్న నెయిల్‌పాలిష్‌ను రిమూవర్‌లో ముంచిన దూదితో తుడిచేయాలి. ● వెడల్పాటి పాత్రలో గోరువెచ్చటి నీటిని పోసి రెండు చుక్కల మైల్డ్‌షాంపూ కాని లిక్విడ్‌సోప్ కాని వేసి కలిపి అందులో రెండు చేతులను ముంచి పది నిమిషాల సేపు ఉంచాలి. ● నెయిల్ కటర్‌తో గోళ్లను అందంగా షేప్ వచ్చేటట్లు కత్తిరించాలి. ● బ్రష్‌తో చేతిని, వేళ్లకు, గోళ్లకు మర్దన చేసినట్లు రుద్ది కడగాలి. మసాజ్ క్రీమ్ లేదా ఆయిల్ అప్లయ్ చేసి మర్దన చేయాలి. ● వేళ్లకు, ప్రతి కణుపు మీద వలయాకారంగా క్లాక్‌వైజ్ గానూ వెంటనే యాంటి క్లాక్ వైజ్ గానూ మసాజ్ చేయాలి. అలాగే ప్రతి గోరుకూ చేయాలి. అన్నింటికీ ఒకే నంబర్ మెయింటెయిన్ చేయడం ముఖ్యం. అంటే మొదటి వేలికి ఒక కణుపుకు క్లాక్‌వైజ్‌గా ఐదుసార్లు చేస్తే యాంటిక్లాక్‌వైజ్‌గా కూడా ఐదుసార్లు మాత్రమే చేయాలి. ఇదే కౌంట్‌ను అన్ని వేళ్లకు, గోళ్లకు పాటించాలి. ● టిష్యూ పేపర్‌తో వేళ్లకున్న ఆయిల్ తుడిచి నెయిల్ పాలిష్ వేయాలి.

భర్త రాసిన ప్రిస్క్రిప్షన్



యు.ఎస్. కాన్వొకేషన్‌లో ఆనందీబాయి (1886 మార్చి 11)

భరించువాడు భర్త! మంచి మాటే. పెళ్లయితే భర్తయినట్లేనా?! కలిసుండాలి లైఫ్ లాంగ్. కనీసం కష్టంలో. ట్యాప్‌లో నీళ్లు రాకపోతే, 'కాశీకి పోతాను రామా హరి..'అని రాగి చెంబు అందుకుని, వారణాసి ఎక్స్‌ప్రెస్ ఎక్కుతానంటే కుదరదు. ఫోన్ చెయ్యాలి. వాటర్ ట్యాంక్ తెప్పించాలి. అంత లేకపోతే, బిందెల్ని సైకిల్‌కి కట్టుకుని, పోయిరావలె చెరువుకు. జ్వరం వచ్చిందా తనకి. 'డోలో సిక్స్‌ఫిఫ్టీ వేసుకో' అని చెప్పి ఆఫీస్‌కి వెళ్లిపోవడం కరెక్టే. ఒకరోజుకి కరెక్ట్, రెండు రోజులకు కరెక్ట్. మూడో రోజుకీ తగ్గకుంటే నీ మానాన నువ్వు ఆఫీస్‌కి వెళ్లిపోవడం కరెక్ట్ కాదు. డాక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకో. బండి మీద ఎక్కించుకో. అంతలేకపోతే భుజాన వేసుకుపో. భార్య ఆమె నీకు.

నీళ్లు రాకపోవడం, జ్వరం తగ్గకపోవడం జీవితంలో పెద్ద కష్టాలు కాదు. ఇంకా పెద్దవి ఉంటాయి. ఏం ఉంటాయో చెప్పలేం. చెప్పకుండా వచ్చేస్తాయి. అకస్మాత్తు అవసరాలు, అకస్మాత్తు ట్రాన్స్‌ఫర్‌లు. అకస్మాత్తుగా.. ఇంకేమైనా. అప్పుడు గట్టిగా నిలబడాలి. గట్టిగా నిలబడలేకపోతే పిల్లాడికి అమ్మ కొంగు ఉంటుంది. కుర్రాడికి నాన్న చెయ్యి ఉంటుంది. డిగ్రీ అయి వీధిలోకి వచ్చినవాడికి 'రాజధాని నగరంలో వీధి వీధి నీదీ నాదే బ్రదరూ' అని గాత్ర సహకారం అందించే సాటి పట్టభద్రులు ఉంటారు. భర్తకు వీళ్లెవరూ ఉండరు. అతడే పడాలి. పడలేకపోతే, కనీసం బయటైనా పడకుండానైనా ఉండాలి. నువ్వు బయట పడితే.. ఆమె బయటపడి పోతుంది. పడకూడదు. భార్య ఆమె నీకు.

భర్తకు అన్నిటికన్న పెద్ద కష్టం.. భార్య మనసులోని కష్టం తెలుసుకోవడం! ఆమె చెప్పదు. నువ్వు బిజీగా ఉంటావు. ప్రపంచంతో పోరాడి ఇంటికి వస్తావు. అప్పుడు చెప్పదు. ఉదయాన్నే మళ్లీ కత్తీ డాలు తీసుకుని, కవచం తొడుక్కుని, హెల్మెట్ పెట్టుకుని బయల్దేరతావు. అప్పుడూ చెప్పదు. ఇంకెప్పుడు చెప్పడం? ఎప్పుడూ చెప్పదు. నువ్వే తెలుసుకోవాలి. ఆమె చెప్పకుండా ఆమె చెప్పాలనుకుంటున్నదేమిటో తెలుసుకోవాలి. ఆమె నుదురు తాకకుండా నూటా మూడు డిగ్రీలలో సైతం ఆమె తన చిరు



'ఆనందీ గోపాల్' చిత్రంలో ఒక సన్నివేశం

నవ్వును చెరగనివ్వడం లేదని తెలుసుకోవాలి. భార్య ఆమె నీకు.

చెప్పి నీ మనసు పాడు చేయకూడదని భార్యగా ఆమె అనుకుంటున్నప్పుడు, చెప్పకుండా తెలుసుకుని ఆమె మనసును భర్తగా నువ్వు అర్థం చేసుకోవాలి.

భర్తంటే భరించేవాడేనా? 'భరింపబడే' అగత్యం లేకుండా లోకంతో తలపడడం ఎలాగో భార్యకు నేర్పించేవాడు కూడా. తల ఆన్చడానికి ఇవాళ నీ భుజం ఉంది. రేపు? నీకేదైనా అయితే? అప్పుడూ నువ్వే భరించాలి. అప్పుడూ భర్తవే కదా. ఇన్నాళ్లూ ఇద్దరూ కలిసి బతికిందంతా.. రేపు నువ్వు లేకున్నా కూడా ఆమె ఒకరే బతకడం ఎలాగో నేర్పించడానికే అవ్వాలి. భార్య తెలివిగలది కావచ్చు. మాటకారి కావచ్చు. ఏటీఎంకి వెళ్లి డబ్బులెలా తియ్యాలో ఆమెకు తెలిసుండొచ్చు. ఇంటిపనీ, ఆఫీస్ పని సింగిల్ హ్యాండెడ్‌గా చక్కబెడుతూ ఉండి ఉండొచ్చు. అయినా నేర్పించాలి. అయినవాళ్లలోనే ఎవరైనా చివుక్కుమనేలా ఒక మాట అంటే.. 'నా భర్తే ఉండి ఉంటేనా' అనే ఆలోచన రాకుండా, గట్టిగా నిలబడేలా భర్తే ఆమెకు మానసిక శక్తిని ఇచ్చిపోవాలి. అదే భర్త బాధ్యత. భర్త ధర్మం.

●●●

''పద'' అన్నాడు గోపాల్రావ్ జోషి, ఇంట్లో కొచ్చి. అతడు భర్త. మౌనంగా వెనకే బయల్దేరింది యమున. ఆమె భార్య.

తొమ్మిదేళ్ల వయసులో యమునకు ఇరవై తొమ్మిదేళ్ల గోపాల్రావ్‌తో పెళ్లయింది. పెళ్లవగానే యమున 'ఆనంది' అయింది. భార్యకు భర్త ఇష్టంగా పెట్టుకున్న పేరు ఆనంది. ఆమెకేం ఇష్టాల్లేవు. భర్తపై ఇష్టం, భర్తంటే అయిష్టం కలిగే వయసు కూడా కాదు. పెళ్లైతే అవడానికి అయింది కానీ, ఆమె ఇంకా భార్య కాలేదు. పదేళ్లొచ్చినా, పన్నెండేళ్లొచ్చినా, పదమూడేళ్లొచ్చినా కాలేదు. పద్నాలుగో యేట మాత్రం తల్లి అయింది. తల్లయినా, భార్య కాలేదు!

గోపాల్రావ్ వచ్చి భార్యతో 'పద'అన్నది.. ఆమెకు తొమ్మిదీ–పదమూడేళ్ల మధ్య వయసులో. కనీసం ఐదుసార్లు 'పద' అని ఉంటాడు. భర్త పద అనగానే ఇద్దరివీ బట్టలు సర్దేది. గోపాల్రావ్ పోస్టల్ క్లర్క్. పుణెకు కొద్ది దూరంలో కల్యాణ్‌లో హెడ్డాఫీస్. పుణె, కల్యాణ్, కొల్హాపూర్, అలీభాగ్, కచ్, సెరంపూర్.. ఎక్కడికి ట్రాన్స్‌ఫర్ అయితే అక్కడికి భర్త 'పద' అనేవాడు. ఆనంది చెప్పులైనా చప్పుడు కాకుండా ఫాలో అయ్యేది.

ఆనంది పుట్టింది పుణెలో. పెరిగింది, పెళ్లి జరిగిందీ కల్యాణ్‌లో. భూస్వామి కుటుంబం. కుటుంబంలోని పూర్వపు పెద్దల తెలివితక్కువతనంతో భూములు పోయి, ఫ్యామిలీ అప్పుల పాలైంది. 'పిల్లకు పెళ్లి చేసేయండి' అన్నారు బంధువులు. 'ఇంకా తొమ్మిదేళ్లే కదా'అంటే, 'మీకింకా తెలివి రాలేదా?' అన్నారు. వాళ్లే గోపాల్రావ్‌ని వెదికి తెచ్చారు. గోపాల్రావ్ ప్రొగ్రెసివ్.

''బదిలీ అయిన ప్రతిచోటికీ పిల్లను తీసుకెళతావెందుకు?'' అని ఆ ఇంట్లోవాళ్లు, ఈ ఇంట్లో వాళ్లు అన్నప్పుడు.. గోపాల్రావ్ అన్నమాట ఆనందికి బాగా గుర్తుండిపోయింది.

''నా భార్య చదువుకుంది. చదువుకున్న పిల్లకు ఇల్లే ప్రపంచం కాకూడదు. ప్రపంచం నడవడానికి తనూ ఒక కారణం అవాలి. ఒకవేళ ఆనందికి చదువులేకపోయినా నేను ఇంట్లో ఉంచేవాడిని కాదు. చదివించుకునేవాడిని'' అన్నాడు. అంతా బుగ్గలు నొక్కుకున్నారు.

1880ల చివరి కాలమది. అప్పటికి ఆనందికి పద్దెనిమిదేళ్లు. ఈసారి బదిలీ అయింది పెద్ద ఊరికి. కలకత్తా. ''కలకత్తాలో పిల్ల ఒక్కతే ఎలా ఉంటుంది!'' అన్నారు. ''కలకత్తాలోనూ మనుషులే ఉంటారు'' అన్నాడు గోపాల్రావ్. గుడిపాటి వెంకటాచలం కన్నా యాభై ఏళ్ల ముందే.. 'స్త్రీకి మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. స్త్రీకి హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి. స్త్రీకి శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి' అని వాదించిన మొండివాడు గోపాల్రావ్.

పద్నాలుగో ఏట పుట్టిన బిడ్డ పది రోజులకే చనిపోయి ఆనంది ఎడతెరిపి లేకుండా ఏడుస్తున్నప్పుడూ అతడు ఓదార్చిన విధానం మొండిగానే ఉంది.

''ఏడ్వకు. ఏడిస్తే పోయిన బిడ్డ వస్తాడా. నీ బిడ్డ ఒక్కడే కాదు. పుణె చుట్టుపక్కల చాలామంది బిడ్డలు చనిపోతున్నారు. బతికించే వైద్యం లేదు. ఉండి ఉంటే నీ బిడ్డ బతక్కపోయేవాడా'' అన్నాడు.

'నీ బిడ్డ' అనడం ఆనందిని నొప్పించింది. బిడ్డ చనిపోతే తల్లికేనా బాధ! తండ్రికి ఏమీ ఉండదా? 'నీ బిడ్డ' అన్న మాటకు భార్య బాధపడిందని గోపాల్రావ్ గ్రహించాడు. తనూ కూర్చొని ఏడిస్తే ఏం భర్త?!

''ఆనందీ.. నువ్వు మెడిసిన్ చదవాలి'' అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది.

''అవును. మన బిడ్డలా సరైన వైద్యం లేక ఎవరూ చనిపోకూడదు. నువ్వు డాక్టర్‌వి కావాలి'' అన్నాడు.

ఆనంది ముఖం వెలిగిపోయింది. 'నువ్వు డాక్టర్‌వి కావాలి' అన్నందుకు కాదు. అతడు 'మన బిడ్డ' అన్నందుకు.

●●●

''పద'' అన్నాడు గోపాల్రావ్ వచ్చి.

ఈసారి యు.ఎస్‌కి! పెన్సిల్వేనియాలోని 'ఉమెన్స్ మెడికల్ కాలేజ్'లో భార్యకు సీటు సంపాదించుకొచ్చాడు అతడు! మళ్లీ అంతా 'హవ్వ' అని బుగ్గలు నొక్కుకున్నారు. కిరస్తానీలుండే దేశానికి పెళ్లాన్ని తీసుకెళ్తున్నాడా?! తీసుకెళ్తున్నాడా ఏంటీ.. తీసుకెళ్లాడు గోపాల్రావ్.

ఆనంది మెడిసిన్ పూర్తి చేసింది. అప్పటికి ఆమెకు ఇరవై ఏళ్లు. యు.ఎస్.లో వాతావరణం పడక దగ్గుతూ ఉండేది. మెడిసిన్ అయ్యాక ఆ దగ్గుతోనే ఇండియా వచ్చింది. కొల్హాపూర్ 'ఆల్బర్ట్ ఎడ్వర్డ్ హాస్పిటల్'లో డాక్టర్‌గా ఉద్యోగం. దేశంలోనే మొదటి మహిళా డాక్టర్!! క్రమంగా దగ్గుకు ఆమె దగ్గరైంది. డాక్టర్ అయిన ఏడాదికే క్షయ వ్యాధితో 21 ఏళ్ల వయసులో చనిపోయింది.

●●●

పెళ్లయినా భార్య కాలేకపోయింది ఆనంది. ఓ పిల్లను పెంచినట్లే మురిపెంగా ఆమెను పెంచుకున్నాడు గోపాల్రావ్. బిడ్డ పుట్టినా తల్లి కాలేకపోయింది ఆనంది. పదిరోజులు మురిపించి కన్నుమూశాడు ఆ బిడ్డ. డాక్టర్ చదివినా వైద్యం చేయలేకపోయింది ఆనంది. 'డాక్టరమ్మ' వచ్చిందనే మురిపెం కూడా దేశానికి తీరకముందే మృత్యువు ఆమెను తీసుకుపోయింది. ఆనంది చనిపోయిన ఫిబ్రవరి 26 కి పదిరోజుల ముందు 15 వ తేదీన.. వచ్చే శుక్రవారం. సినిమా విడుదల అవుతోంది. సమీర్ విద్వాంస్ దర్శకుడు. ఆనందికి భర్తలో ఒక తండ్రిని, ఒక ప్రేమికుడిని, ఒక స్నేహితుడినీ చూపించాడు విద్వాంస్. అన్నిటినీ మించి.. ఒక మంచి భర్తను! 'వాటా వాటా వాటా గో' అనే ఒక శ్రావ్యమైన పాటతో విడుదలైన తాజా వీడియోలో మీకు ఆ భర్త కనిపిస్తాడు. పల్లెకు పోదాం.. పారును చూదాం.. చలో చలో.. అని పాటలోని ప్లెజెంట్ నెస్ అందులో ఉంది.

● మాధవ్ శింగరాజు

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శుక్రవారం
8-2-2019

వెడ్డింగ్ సీజన్

కాలర్ క్వీన్స్

ఫ్యాషన్

పెళ్శిళ్లకు కోట్లు, జాకెట్లు వేసుకొని వస్తారు మగాళ్లు. ఈ పెళ్శిళ్ల సీజన్‌లో అమ్మాయిలు కూడా కాలర్ కోటు వేసుకొని హుందాగా వెళితే.. వేడుకలో రాణుల్లా మెరిసిపోతారు. మహారాణుల్లా వెలిగిపోతారు. కాలర్ క్వీన్స్ అని కితాబులు అందుకుంటారు.



రెట్రో స్టైల్ అలంకరణ: ఈ కోటు స్టైల్ కాలర్ నెక్ పొడవు హారం వేసుకోవచ్చు. లేదా మెడను పట్టి ఉంచే చోకర్‌ని జత చేసుకోవచ్చు. ఈ స్టైల్ బ్లౌజ్‌కి కొప్పు కేశాలంకరణ బాగా నప్పుతుంది. 70ల కాలం నాటి రెట్రో స్టైల్‌ని ఇండో వెస్ట్రన్ లుక్‌తో ఇప్పుడు మళ్లీ కొత్తగా మెరిపించవచ్చు.





హ్యాండ్ లూమ్స్‌కి నప్పే నెక్: రాబోయేది వేసవి కూడా కాబట్టి చేనేత కాటన్స్‌కి మంచి డిమాండ్ ఉంటుంది. హ్యాండ్లూమ్ శారీలో రాణిలా వెలిగిపోవాలంటే కోటు స్టైల్ నెక్ బ్లౌజ్ వేసుకుంటే చాలు. మీ లుక్‌కి గ్రాండ్ మార్కులు ఖాయం.



పాశ్చాత్య దుస్తులలో భాగమైన ఓవర్ కోటును గమనిస్తే ఈ నెక్ స్టైల్ వెంటనే కళ్లకు కడుతుంది. మెడకు హారంగా ఉండే పట్టీ మీద ఎంబ్రాయిడరీ చేయచ్చు. లేదంటే అంచులతో నెక్ పార్ట్‌ని మార్చచ్చు. బెనారస్ ఫ్యాబ్రిక్‌తోనూ లుక్ గ్రాండ్‌గా మార్చచ్చు.



వేడుకకు చీరల రెపరెపల తర్వాతి ప్లేస్ లాంగ్ కుర్తాది. కుర్తాకి శాలువా స్టైల్ కాలర్‌ని డిజైన్ చేయించుకుంటే మరింత అందంగా కనిపిస్తారు.





పట్టు, ఫ్యాన్సీ శారీస్‌కు డిజైనర్ బ్లౌజ్ తప్పనిసరే. అయితే, ఆ బ్లౌజ్‌కి ఎలాంటి హంగులు అమర్చాలో కూడా సరిగ్గా తెలిస్తే... వేదిక, వేడుక ఏదైనా గ్రాండ్‌గా మెరిసిపోవచ్చు. నెటెడ్, రాసిల్క్, వెల్వెట్, బెనారస్ ఫ్యాబ్రిక్ బ్లౌజ్‌లకు కోటు స్టైల్ నెక్ బాగా నప్పుతుంది.

లెహంగా చోలీ స్టైల్ లుక్ మరింత ఆకట్టుకోవాలంటే బ్లౌజ్‌కి కోటు స్టైల్ కాలర్ నెక్‌తో డిజైన్ చేయాలి. ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ సబ్యసాచి ముఖర్జి డిజైన్స్‌లో ఈ స్టైల్ ఇప్పుడు కొత్తగా మెరుస్తోంది. ఆ హంగును ఈ మాఘమాసపు వేడుకకు మీరూ తేవచ్చు.

నిర్వహణ: ఎన్.ఆర్

సినిమా



● కైకాల సత్యనారాయణ

12న కైకాల సినీ షష్టిపూర్తి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం–భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'వంశీ ఇంటర్నేషనల్' సంస్థ ఈ నెల 12న నవరస నటనా సార్వభౌమ కైకాల సత్యనారాయణ సినీ షష్టిపూర్తి (1959–2019), కనకాభిషేక మహోత్సవం నిర్వహించనుంది. ''కైకాల సినీ షష్టిపూర్తి (1959–2019), కనకాభిషేక మహోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నాం. ఈ కార్యక్రమంలో తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య, దర్శకులు ఎ.కోదండరామిరెడ్డి, కోడి రామకృష్ణ, బి.గోపాల్, రేలంగి నరసింహారావు తదితర ప్రముఖులు పాల్గొంటారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 12 సాయంత్రం 5గంటలకు జరిగే ఈ వేడుకలో శివశంకరి గీతాంజలి సమర్పణలో సినీసంగీత విభావరి ఉంటుంది'' అన్నారు 'వంశీ' వ్యవస్థాపకులు శిరోమణి డా. వంశీ రామరాజు.



● సందీప్ కిషన్

తెనాలి రామకృష్ణ షురూ

'సీమశాస్త్రి, సీమ టపాకాయ్, దేనికైనా రెడీ, ఈడోరకం ఆడోరకం, ఆచారి అమెరికా యాత్ర' వంటి సినిమాలతో నవ్వులు పంచిన దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డి మరోసారి 'తెనాలి రామకృష్ణ బిఏబిఎల్' సినిమాతో తనదైన శైలిలో వినోదం పంచనున్నారు. సందీప్ కిషన్, హన్సిక హీరో హీరోయిన్లు. శ్రీ నీలకంఠేశ్వర స్వామి క్రియేషన్స్‌పై అగ్రహారం నాగిరెడ్డి, సంజీవ్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ గురువారం కర్నూలులో ప్రారంభమైంది. సందీప్ కిషన్, హన్సిక తొలిసారి జంటగా నటిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రానికి సమర్పణ: ఇందుమూరి శ్రీనివాసులు, సహ నిర్మాతలు: రూప జగదీష్, వి. మహేశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీతారామరాజు మల్లెల, సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: సాయి శ్రీరామ్.

'పద్మశ్రీ' నాది కాదు.. వారందరిదీ!

– 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి



● సిరివెన్నెల, పద్మ, విశ్వనాథ్

''చెంబోలు సీతారామ శాస్త్రిని 'సిరివెన్నెల' చిత్రంతో సిరివెన్నెల సీతా రామశాస్త్రిని చేసి, సినీ రంగంలో జన్మనిచ్చి ప్రోత్సహించిన దర్శకులు కె. విశ్వనాథ్‌గారిని ఎప్పటికీ మర్చిపోలేను. నా ఈ అభ్యున్నతికి కారణం నాకు జన్మనిచ్చిన తల్లితండ్రులు, సినీ జన్మనిచ్చిన విశ్వనాథ్‌గారు, పెంచి పోషించిన సినిమా తల్లి, ఇన్నేళ్లు నా వెన్నంటి ఉండి కలసి ప్రయాణించిన నిర్మాతలు, దర్శకులు, సంగీత దర్శకులు, గాయకులు, నా కుటుంబ సభ్యులు. అందుకే తెలుగులో సినీ గేయకవితా రచన విభాగానికి తొలిసారి వచ్చిన ఈ 'పద్మశ్రీ' అవార్డు నాది కాదు.. వారందరిదీ! అందుకే, ఇది నాకు అభినందన కాదు ఆశీర్వాద సభగా భావిస్తున్నా'' అని సినీ గీత రచయిత 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి అన్నారు. భారత ప్రభుత్వం సిరివెన్నెలకు 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించిన సందర్భంగా కళాత్మక చిత్రాల దర్శకుడు కె. విశ్వనాథ్ స్వగృహంలో 'చిరువెన్నెలలో సిరిమల్లెలు' పేరిట ఆత్మీయ అభినందన సభ జరిగింది. సీతారామశాస్త్రి దంపతులను, ఆయన మాతృమూర్తిని విశ్వనాథ్ కుటుంబం సాదరంగా సత్కరించింది. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ– ''పద్మశ్రీ' పురస్కారం రావడం ఆలస్యమైందా, ముందుగా వచ్చిందా లాంటి మాటలను అటుంచితే రావాల్సిన వ్యక్తికి రావడం ఆనందంగా ఉంది. స్వయంకృషి, సాధనతో ఈ స్థాయికి ఎదిగిన సీతారామశాస్త్రి తన మొదటి చిత్రం 'సిరివెన్నెల' రోజులలానే ఇప్పటికీ నిగర్వంగా ఉండటం విశేషం. సాహితీ మానస పుత్రుడైన శాస్త్రి మరిన్ని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదిస్తున్నా'' అన్నారు. విశ్వనాథ్, సీతారామ శాస్త్రి కలయికలోని వివిధ చిత్రాల్లోని పాటలను గాయనీ గాయకులు ఉష, శశికళ, హరిణి, సాయిచరణ్ గానం చేశారు. వేణుగాన విద్వాంసుడు నాగరాజు, నటి, నాట్యకళాకారిణి ఆశ్రిత వేముగంటి, 'సప్తపది' ఫేమ్ సబిత కొన్ని పాటలకు తమ కళా ప్రదర్శనతో మరింత రక్తి కట్టించారు. సంగీత దర్శకుడు మణిశర్మ, నటుడు గుండు సుదర్శన్ పాల్గొన్నారు. దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి, దశరథ్, వీఎన్ ఆదిత్య, ఇంద్రగంటి, కాశీ విశ్వనాథ్, బీవీఎస్ రవి, రచయితలు జనార్దన మహర్షి, రామజోగయ్య శాస్త్రి, బుర్రా సాయిమాధవ్, అబ్బూరి రవి, నిర్మాతలు రాజ్ కందుకూరి, ఏడిద శ్రీరామ్, నటుడు జిత్‌మోహన్ మిత్రా, 'మా' శర్మ, యాంకర్ ఝాన్సీ తదితరులు 'సిరివెన్నెల'తో తమ అనుభవాలను పంచుకున్నారు.

ద్వేషం స్థానంలో ప్రేమ నిండాలి



● రేయాన్, రాధిక

''ఇలాంటి ప్రపంచంలో జీవిస్తున్నాం మనం (ఆగ్రహావేదన). అవును.. మా నాన్నగారు సూపర్ బ్లెస్డ్. అద్భుతమైన భార్య దొరికారు. నలుగురు సంతానం ఉన్నారు. ఒక మనవడు ఉన్నాడు. ఆయన్ను ఎంతగానో ప్రేమించే కుటుంబం ఉంది. మాది మిక్స్‌డ్ ఫ్యామిలీ. మమ్మల్ని ట్రోల్ (విమర్శించే) చేసే వారి మనసుల్లోని ద్వేషం స్థానంలో ప్రేమ నిండుకోవాలని కోరుకుంటున్నాను'' అన్నారు రేయాన్. ఈ పేరు ఎక్కడా విన్నట్లు లేదే అనుకుంటున్నారా? నటిరాధిక మొదటి కుమార్తె రేయాన్. కాగా, శరత్‌కుమార్, రాధికలు 18 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. వీరికి ఓ కుమారుడు కూడా ఉన్నారు. ఇటీవల శరత్ కుమార్, రాధికల పెళ్లిరోజు సందర్భంగా రేయాన్ తన కొడుకుతో శరత్–రాధికలు ఉన్న ఫోటోను 'లవ్‌బర్డ్స్. హ్యాపీ యానివర్సరీ' అనే ట్యాగ్‌తో సోషల్ మీడియాలో షేర్ చేశారు. రేయాన్ చేసిన ఈ పోస్ట్‌ను కొందరు నెటిజన్లు ''శరత్‌కుమార్ ఈజ్ బ్లెస్డ్. రెండో భార్య రాధిక మొదటి కుమార్తె (రేయాన్) కొడుకుతో శరత్ కుమార్'' అని హేళన చేసే విధంగా పేర్కొన్నారు. ఈ కామెంట్‌కే రేయాన్ పైవిధంగా స్పందించారు. రేయాన్ చేసిన పోస్ట్‌ను రాధిక ట్యాగ్ చేసి...''రేయాన్.. మన బాధ ఎవరికీ తెలీదు. కానీ మన మధ్య ఉన్న ప్రేమ, అనుబంధాలను చూడటానికి అర్హత లేని గుడ్డివారు ట్రోల్ చేస్తున్నారు. వారిని అలాగే వదిలేయ్. అలాగే వేదనతో బతకనివ్వు. మనం మనలాగే హ్యాపీగా ఉందాం'' అని అన్నారు రాధిక.


రియల్ ఐరన్‌మేన్



● బ్రహ్మానందం, అల్లు అర్జున్

ఎన్నో హాస్యభరితమైన పాత్రలతో ప్రేక్షకులకు కితకితలు పెట్టారు నటులు బ్రహ్మానందం. ఇటీవల అనారోగ్యం కారణంగా ఆయనకు ముంబైలో శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. పూర్తి ఆరోగ్యంతో బ్రహ్మానందం హైదరాబాద్ చేరుకున్నారు. ఆయన ఇంటికి వెళ్లి నటుడు అల్లు అర్జున్ పరామర్శించారు. ''బ్రహ్మానందం గారు రియల్ ఐరన్‌మేన్. మ్యాన్ విత్ స్ట్రాంగ్ హార్ట్. ఫన్నీ అండ్ ఫియర్‌లెస్. కిల్ బిల్ పాండే (అల్లు అర్జున్ హీరోగా నటించిన 'రేసుగుర్రం' సినిమాలోని బ్రహ్మానందం పాత్ర పేరు)ను కలవడం చాలా సంతోషంగా ఉంది'' అంటూ బ్రహ్మానందంతో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేశారు అల్లు అర్జున్.

పైరేటెడ్ ప్రేమ



● నవీన్ చంద్ర, గాయత్రీ సురేష్

నవీన్‌చంద్ర హీరోగా, గాయత్రీ సురేష్, పూజా జవేరి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'హీరో హీరోయిన్'. 'ఎ పైరేటెడ్ లవ్‌స్టోరీ' అన్నది ఉపశీర్షిక. 'అడ్డా' సినిమా ఫేం జీయస్ కార్తీక్ దర్శకత్వం వహించారు. స్వాతి పిక్చర్స్ పతాకంపై భార్గవ్ మన్నె నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని గురువారం విడుదల చేశారు. జీయస్ కార్తీక్ మాట్లాడుతూ– ''ఇప్పటివరకు తెలుగు సినీ పరిశ్రమలో పలు విభిన్న నేపథ్యాల్లో ప్రేమకథలు వచ్చాయి. కానీ ఎవరూ టచ్ చేయని సినిమా పైరసీ నేపథ్యంలో మా చిత్రం ఉంటుంది. ఈ లవ్‌స్టోరీలో అన్ని ఎమోషన్స్ ఉంటాయి. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు తప్పకుండా నచ్చే చిత్రమిది'' అన్నారు. ''కార్తీక్ చెప్పిన కథ మాకు ఎంతో నచ్చింది. అందుకే ఎక్కడా రాజీపడకుండా రిచ్‌గా ఈ చిత్రాన్ని నిర్మించాం. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. అతి త్వరలోనే సినిమా విడుదల చేస్తాం'' అని తెలిపారు. అభిమన్యు సింగ్, కబీర్‌సింగ్, జయప్రకాష్ రెడ్డి, షేకింగ్ శేషు, రణధీర్, గౌతంరాజు, శివన్నారాయణ, బమ్‌చిక్ బబ్లూ, సారిక రామచంద్రరావు తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: వెంకట్ గంగాధరీ.

ఈరోజుల్లో సినిమా ఆడటమే కష్టం

– 'దిల్' రాజు



● 'దిల్' రాజు, వేణుగోపాల్, శ్రీహర్ష

''హుషారు' సినిమా ఫస్ట్ సాంగ్ రిలీజ్ రోజునే సినిమా బాగుందని, ఆడుతుందని చెప్పాను. నిజంగానే ప్రేక్షకులు ఆదరించారు. ఈరోజుల్లో సినిమా ఆడటమే కష్టం. అలాంటిది 50 రోజులు పూర్తి చేసుకోవడం అంటే సాధారణ విషయం కాదు. 'హుషారు' యూనిట్‌కు అభినందనలు'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. తేజస్ కంచర్ల, తేజ్ కూరపాటి, అభినవ్ మంచు, దినేష్ తేజ్, దక్షా నగార్కర్, ప్రియా వడ్లమాని, హేమా ఇంగ్లే ముఖ్య తారలుగా శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హుషారు'.

బెక్కెం వేణుగోపాల్, రియాజ్ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 14న విడుదలై 50 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిపిన 50 రోజుల వేడుకలో బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ– ''మా సినిమాను ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. ఇంత పెద్ద విజయం సాధిస్తుందని నేను ఊహించలేదు. 'హుషారు' సినిమా కోసం ఏడాదిన్నర కష్టపడ్డాం. కష్టానికి మంచి ఫలితం వస్తుందనడానికి మా సినిమానే ఓ ఉదాహరణ'' అన్నారు. ''ఈ సినిమాకు పనిచేసిన ప్రతిరోజూ నా లైఫ్‌లో ఓ తీపి గుర్తు. ప్రేక్షకులు సినిమాను మళ్లీ మళ్లీ చూసి ఇంత పెద్ద హిట్ ఇచ్చారు'' అని శ్రీహర్ష కొనుగంటి అన్నారు. తేజ్ కొర్రపాటి, దినేష్, తేజస్ కంచెర్ల, ప్రియా వడ్లమాని, దక్షా నగార్కర్ ఈ విజయం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

పరి పరిశోధన

ఆ ఒక్క కణాన్ని కొడితే...

వైద్యం ఎంత అభివృద్ధి చెందినప్పటికీ కేన్సర్ విషయానికొస్తే.. మధ్యయుగాల నాటి పద్ధతులతోనే చికిత్స జరుగుతోంది. శస్త్రచికిత్సతో కత్తిరించడం.. రేడియేషన్‌తో మాడ్చేయడం.. ఈ రెండింటికీ లొంగకపోతే.. కీమోథెరపీ రూపంలో విషం పెట్టేసి కేన్సర్ కణాలను నాశనం చేసేయడం. అంతేకాదు.. ఈ పద్ధతులన్నీ... శరీరంలోని కేన్సర్ కణాలను నాశనం చేయడంపైనే దృష్టి పెడతాయి గానీ, మూలకారణం ఏమిటన్నది పట్టించుకోవు. ఈ నేపథ్యంలో కేన్సర్ కణుతులు ఏర్పడేందుకు మూలకారణంగా భావిస్తున్న కొన్ని ప్రత్యేక కణాలను గుర్తించడంలో విజయం సాధించారు సాల్‌ఫోర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. కేన్సర్ కణుతులను పరిశీలించడం ద్వారా అన్ని కేన్సర్ కణాల్లో కనీసం 0.2 శాతం కణాలు ప్రత్యేక లక్షణాలు కలిగి ఉన్నాయని, విపరీతంగా విభజితమవడంతోపాటు చాలా ఎక్కువ మోతాదులో శక్తిని ఉత్పత్తి చేస్తున్నాయని వీరు గుర్తించారు. చావన్నది లేకుండా విభజితమయ్యే కణాలు వీటి నుంచి పుట్టుకొస్తున్నట్లు అంచనా. ఈ మూలకణాలను కేంద్రంగా చేసుకుని కొత్త చికిత్స పద్ధతిని రూపొందించేందుకు తాము ప్రయత్నాలు చేస్తున్నట్లు ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త మైకేల్ పి. లిసాంటీ అంటున్నారు. కణాల్లోని మైట్రోకాండ్రియాను లక్ష్యంగా చేసుకుంటే ఈ మూలకణాలను నియంత్రణలోకి తేవచ్చునని తాము గుర్తించామని, మార్కెట్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న రైబోసిసిలిబ్ అనే మందు ఈ పని చేస్తోందని అన్నారు. మరింత సమర్థంగా మూలకణాల పెరుగుదలను నియంత్రిస్తే మధుమేహం మాదిరిగానే కేన్సర్‌ను కూడా అదుపులో ఉంచడం వీలవుతుందని వివరించారు.

సులువుగా బరువు తగ్గాలంటే...


బరువు తగ్గడం గురించి తంటాలు పడని వ్యక్తులు చాలా తక్కువంటే అతిశయోక్తి కాదు. ఎంత తిన్నా ఒళ్లు పెరగనివారు కొందరైతే, కొద్దిగా తిన్నా తక్కున లావెక్కిపోయే వాళ్లు మరి కొందరు. ఈ నేపథ్యంలో సులువుగా బరువు తగ్గేందుకు ఉన్న మార్గాల గురించి బెకెట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఓ అధ్యయనం చేపట్టారు. దాని ప్రకారం... మనం రోజుకు ఎంత ఆహారం తీసుకుంటున్నామన్న విషయంపై చాలా జాగ్రత్తగా ఉండాలి, ఒకవేళ అవసరానికి మించి తిన్నా శరీరం దాన్ని గుర్తించే అవకాశం లేదు. అంటే.. కేలరీల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్న మాట. ఇక రెండో సూత్రం వ్యాయామం. బరువు తగ్గడానికి మాత్రమే కాకుండా, ఆ తరువాత కూడా నాజూకుగా ఉండేందుకు రోజూ వ్యాయామం చేయడం తప్పనిసరి. నిజానికి వ్యాయామం ఎక్కువగా చేసే సందర్భాల్లో ఆకలి లేకుండా పోవడాన్ని తాము గుర్తించామని ఈ పరిశోధనలో పాల్గొన్న శాస్త్రవేత్త ఒకరు తెలిపారు. అమెరికన్ టీవీ షో 'ద బిగ్గెస్ట్ లూజర్' లో పాల్గొని బరువు తగ్గిన వారిపై ఆరేళ్లపాటు తాము పరిశోధన చేశామని, వ్యాయామం ఎక్కువ చేసిన వారు తమ బరువును నియంత్రణలో ఉంచుకున్నట్లు తెలిసిందని వివరించారు. ఈ రెండు అంశాలకు జతగా ఆహారం విషయంలో కొంత పట్టువిడుపులు ప్రదర్శించడం కూడా బరువు తగ్గేందుకు కీలకం. పండగల సమయంలో ఎక్కువ ఆహారం తీసుకుంటారు కాబట్టి.. అందుకు అనుగుణంగా ముందు రోజున మితం పాటించడం, లేదంటే వ్యాయామం ఎక్కువ చేయడం మేలని కెవిన్ డెయిటన్ అనే శాస్త్రవేత్త తెలిపారు.

మూలకణాలతో ఇన్సులిన్ ఉత్పత్తి...



శరీరంలోని ఏ కణంగానైనా మారగల శక్తిసామర్థ్యాలు ఉన్న మూలకణాలతో ఇన్సులిన్ ఉత్పత్తి చేయించడంలో కాలిఫోర్నియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు విజయం సాధించారు. ఎలుకల్లో జరిగిన ప్రయోగాల్లో మూలకణాలను కాస్తా ఇన్సులిన్ ఉత్పత్తి చేసే బీటా కణాలుగా మార్చామని, ఈ పరిశోధన కారణంగా భవిష్యత్తులో మధుమేహానికి మరింత సమర్థమైన చికిత్స కల్పించడం వీలవుతుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త మాథియాస్ హెబ్రోక్ అంటున్నారు. ఈ కొత్త కణాలను మధుమేహ రోగుల శరీరంలోకి ప్రవేశపెట్టడం ద్వారా ఇన్సులిన్ ఉత్పత్తి సమస్యలను అధిగమించవచ్చునని అన్నారు. ప్రస్తుతం బీటా కణాలను అప్పుడప్పుడు ఎక్కించుకోవడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించేందుకు అవకాశమున్నప్పటికీ ఫలితాలూ అంతంత మాత్రమేనని.. ఈ నేపథ్యంలో తాము మూలకణాలపై పరిశోధనలు మొదలుపెట్టామని వివరించారు. కాలేయ మూలకణాలను వేరు చేయడం ద్వారా తాము పరిశోధనలు జరిపామని, అప్పుడు అవి బీటా కణాల మాదిరిగా ప్రవర్తించడం మొదలుపెట్టాయని, వీటిని ఎలుకల్లో ప్రవేశపెట్టినప్పుడు అవి ఇన్సులిన్ ఉత్పత్తి చేయడం మొదలుపెట్టాయని వివరించారు. అయితే ఎలుకలపై జరిగిన ఈ ప్రయోగాలు మానవులపై కూడా నిర్వహించి, ఇదే రకమైన ఫలితాలు సాధిస్తే మధుమేహ చికిత్సకు కొత్త మార్గం లభించినట్లేనని అన్నారు.


SHIVA MEKA
PRESENTS
70mm
ENTERTAINMENTS
నేడే విడుదల
యాత్ర
PRODUCED BY VIJAY CHILLA & SHASHI DEVIREDDY
WRITTEN & DIRECTED BY MAHI V RAGHAV
DOP SATHYAN SOORYAN MUSIC K EDITOR SREEKAR PRASAD LYRICS SIRIVENNELA SEETHARAMA SASTRY
PRODUCTION DESIGN RAMAKRISHNA - MONIKA SOUND DESIGN SYNC CINEMA
CHOREOGRAPHER BRINDA SOUND MIXING KANNAN GANPAT
#YatraTheMovie /70mmEntertainments /70mmEntertains
U

సాక్షి
ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ ॥ శుక్రవారం
8-2-2019

స్క్రీన్ టెస్ట్

ఐటెమ్ సాంగ్స్ స్పెషల్

1960-70లలో ఓ ఐటెమ్ సాంగ్ ఉంది అంటే ఆ పాటల కోసం స్పెషల్ ఆర్టిస్టులు ఉండేవారు. 90లలో సీన్ మారింది. స్పెషల్ ఆర్టిస్టులతో దాదాపు పని లేకుండా పోయింది. అందుకే అప్పట్లో జయమాలిని, జ్యోతిలక్ష్మి, అనురాధ, హలం, సిల్క్ స్మితల్లా ఇప్పుడు బోలెడంత మంది ఐటమ్ డ్యాన్సర్స్ లేరు. స్పెషల్ సాంగ్స్‌ను హీరోయిన్లు కూడా చేస్తున్నారు. సినిమా మార్కెటింగ్‌కు ఇదో కొత్తరూట్ అన్నమాట. ఏది ఏమైనా 'ఐటమ్ సాంగ్' అంటే కిక్కే వేరు. ఇలాంటి మస్త్ మసాలా పాటలకు కాలు కదిపిన తారల గురించి ఈ వారం క్విజ్. సరదాగా ఓ లుక్కేయండి.



1 'ఓ సుబ్బారావో ఓ అప్పారావో ఓ వెంకట్రావో ఎవరో ఎవరో ఎవరో ఎవరో వస్తారనుకుంటే నువ్వొచ్చావా...' అనే పాట యన్టీఆర్, శ్రీదేవి, జయచిత్ర నటించిన 'బొబ్బిలిపులి' చిత్రంలోనిది. ఆ పాట రచయిత ఎవరు?
ఎ) వేటూరి బి) దాసరి నారాయణరావు
సి) సిరివెన్నెల డి) కొసరాజు

2 'ఇప్పటికింకా నా వయను నిండా పదహారే, చీటికి మాటికి చెయ్యేస్తూ చుట్టూ కుర్రాళ్లే'... ఈ ఒకే ఒక్క పాటతో యూత్ మొత్తానికి దగ్గరైన నటి ఎవరు?
ఎ) గాబ్రియేలా బి) ముమైత్‌ఖాన్
సి) ఆండ్రియా డి) ముంతాజ్

3 1980-90ల దశకంలో ఐటమ్ సాంగ్‌లతో ఓ వెలుగు వెలిగారు ప్రముఖ డ్యాన్సర్ అనూరాధ. అమె దాదాపు ఎన్ని సినిమాల్లో నటించారో తెలుసా?
ఎ) 330 బి) 550 సి) 700 పైన
డి) 1000 చిత్రాలు పైనే

4 సూపర్‌హిట్ సాంగ్ 'లే లే లే లేలేలే నా రాజా..' ప్రేమనగర్' చిత్రం లోనిది. ఈ పాటను పాడిన సింగర్ పేరేంటి?
ఎ) పి. సుశీల బి) ఎస్. జానకి
సి) జిక్కీ డి) ఎల్.ఆర్. ఈశ్వరి

6 1974లో 'ఆడదాని అదృష్టం' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమయ్యారు జయమాలిని. ఆమెను తెలుగు చిత్రసీమకు పరిచయం చేసిన దర్శకుడెవరు?
ఎ) కె.వి. రెడ్డి బి) విఠలాచార్య
సి) వి. మధుసూదన్‌రావు
డి) పి.సి. రెడ్డి

7 'మసక మసక చీకటిలో మల్లెతోట వెనకాల' పాట చాలా ఫేమస్. ఆ పాట ఏ సినిమాలోనిదో తెలుసా?
ఎ) వయ్యారిభామలు వగలమారి భర్తలు
బి) స్త్రీజన్మ
సి) దేవుడు చేసిన మనుషులు
డి) విచిత్ర కుటుంబం







12 దర్శకుడు శేఖర్ కమ్ముల మంచి ఫ్యామిలీ ఎమోషన్స్‌తో సినిమాలు చేస్తారని పేరుంది. సందర్భానుసారంగా ఆయన కూడా ఓ సినిమాలో ఐటెమ్ సాంగ్‌ను చిత్రీకరించారు. ఆ సాంగ్‌లో నటించింది ప్రముఖ టీవి యాంకర్. ఎవరా యాంకర్? (క్లూ: ఆ పాట ఏంటంటే.. 'రాజ శేఖరా నీపై మోజు తీరలేదురా, రాజసాన ఏలరా రాజా రాజా...')
ఎ) శిల్పాచక్రవర్తి
బి) ఉదయభాను
సి) అనసూయ డి) సుమ

14 'డియో డియో డిసక డిసక...' అంటూ యూత్‌ను ఎట్రాక్ట్ చేసిన నటి పేరేంటి?
ఎ) సన్నీ లియోన్
బి) రాఖీ సావంత్
సి) సెలీనా జైట్లీ
డి) యానా గుప్తా

15 'బావలు సయ్యా మరదలు సయ్యా, రింబోల రింబోలా..' అంటూ కోట శ్రీనివాసరావు, బాబుమోహన్‌లను ఓ ఆట ఆడించిన నటి ఎవరో గుర్తుందా?
ఎ) డిస్కో శాంతి బి) 'సిల్క్' స్మిత
సి) విజయలలిత డి) కుయిలీ

13 'కొప్పున పూలెట్టుకొని బుగ్గన ఏలెట్టుకొని ఈదంట నేనెల్తుంటే, కెవ్వు కేక....' అనే పాటలో నటించిన బాలీవుడ్ హాట్ లేడీ ఎవరో కనుక్కోండి?
ఎ) ఆలియా భట్ బి) ఊర్మిళా మటోండ్కర్
సి) కత్రినాకైఫ్ డి) మలైకా అరోరా



5 'నేను పక్కా లోకల్ పక్కా లోకల్, నేను పక్కా లోకలో...' అంటూ చిందులేసిన ప్రముఖ హీరోయిన్ ఎవరు?
ఎ) కాజల్ అగర్వాల్
బి) అనుష్క సి) నయనతార
డి) లావణ్యా త్రిపాఠి

సమాధానాలు
1) బి 2) బి 3) సి 4) డి
5) ఎ 6) బి 7) సి 8) బి 9) డి
10) బి 11) డి 12) బి 13) డి
14) ఎ 15) బి 16) డి
17) ఎ 18) సి
19) సి 20) బి







19 'అటు అమలాపురం ఇటు పెద్దాపురం మధ్య గోదావరి...' అల్లు శిరీష్, రెజీనా జంటగా నటించిన 'కొత్తజంట' చిత్రంలోని పాట ఇది. ఈ పాటలో నటించిన హీరోయిన్ ఎవరు?
ఎ) కేథరిన్ బి) హన్సిక
సి) మధురిమ
డి) ఈషా రెబ్బా

20 'బళ్లారి బావ...' అంటూ ప్రముఖ బాలీవుడ్ హీరోయిన్ సమీరారెడ్డి హీరోలు వెంకటేశ్, రానాలతో కలిసి చిందేశారు. ఆ చిత్ర దర్శకుడెవరో తెలుసా?
ఎ) వంశీ పైడిపల్లి బి) క్రిష్
సి) సుకుమార్ డి) కృష్ణవంశీ



8 'అ అంటే అమలాపురం ఆ ఆంటే ఆహాపురం...' సూపర్ హిట్ సాంగ్‌లో నటించిన నటి పేరేంటి?
ఎ) నటాలియా కౌర్ బి) అభినయశ్రీ
సి) రచనా మౌర్య డి) స్కార్లెట్ విల్సన్

9 'నా ఇంటిపేరు సిల్క్ నా వంటి రంగు మిల్క్...' అంటూ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో చిందేసిన బ్యూటీ పేరేంటో?

(9)
ఎ) శ్రియ బి) రాశీఖన్నా
సి) సమంత డి) తమన్నా భాటియా

10 'మిర్చి మిర్చి మిర్చి మిర్చి మిర్చి లాంటి కుర్రోడే...' అనే పాటలో ప్రభాస్‌తో కాలు కదిపిన భామ ఎవరో?
ఎ) మధుశర్మ బి) హంసానందిని
సి) జబీన్ ఖాన్ డి) అల్ఫోన్సా

11 'జిల్ జిల్ జిల్ జిల్ జిగేలు రాణి...' అంటూ 'రంగస్థలం' చిత్రంలో హీరో రామ్‌చరణ్ స్టెప్పులేసిన భామ పేరేంటి?
ఎ) కియరా అద్వాని బి) శ్రుతీహాసన్
సి) అమీ జాక్సన్ డి) పూజా హెగ్డే

16 'చిలకలూరి చింతామణి నా పేరంటే తెలియనోళ్లు లేరే జానీ...బ్లాక్‌బస్టరు బ్లాక్‌బస్టరే 'అని అంజలి ఏ హీరోతో డ్యాన్స్ చేశారు?
ఎ) రామ్‌చరణ్ బి) మహేశ్‌బాబు
సి) యన్టీఆర్ డి) అల్లు అర్జున్

18 'పుట్టింటోళ్లు తరిమేశారు కట్టుకున్నోడు వదిలేశాడు...' అనే సాంగ్‌లో యన్టీఆర్‌తో కలిసి స్టెప్పులేసిన ప్రముఖ డ్యాన్సర్ ఎవరో కనుక్కోండి?
ఎ) హలం బి) అనురాధ
సి) జయమాలిని
డి) జ్యోతిలక్ష్మి

17 'వెల్‌కమ్ టూ సక్కు బాయ్... గరమ్ చాయ్ తాగే సెయ్.. మజాచెయ్...' అని చార్మీ ఏ హీరోతో స్టెప్పులేశారో గుర్తుందా?
ఎ) నాగార్జున బి) బాలకృష్ణ
సి) వెంకటేశ్
డి) రానా

నిర్వహణ:
శివ మల్లాల







మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం 10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్ 15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి 20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!



● మమ్ముట్టి

970 స్క్రీన్స్‌లో వెండితెర యాత్ర

మహానేత వైఎస్. రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'యాత్ర'. వైఎస్ పాత్రలో మలయాళ స్టార్ హీరో మమ్ముట్టి నటించారు. మహి వి. రాఘవ్ దర్శకత్వంలో శివ మేక సమర్పణలో విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈరోజు విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'యాత్ర' విశేషాలు.

● 'భలే మంచి రోజు, ఆనందో బ్రహ్మ' వంటి హిట్ చిత్రాల తర్వాత 70 ఎంఎం బ్యానర్‌లో 3వ చిత్రంగా రూపొందిన చిత్రం 'యాత్ర'. ''ఈ టైటిల్ ప్రకటించినప్పటి నుంచి వైఎస్‌గారి అభిమానుల్లోనే కాదు.. సాధారణ ప్రజల్లో కూడా ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. ఇందుకు కారణం.. ఓ మహానేత చరిత్ర తెరకెక్కించటం. వైఎస్‌గారిని ఎలా చూపించనున్నారు? సినిమా పాజిటివ్‌గా ఉంటుందా? లేక నెగటివ్‌గా ఉంటుందా? అనే సందేహాలు ఒక వైపు. అసలు 'యాత్ర' ఇప్పుడు తీయాల్సిన అవసరం ఏంటి? ఎన్నికల స్టంటా? వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిగారికి సపోర్ట్‌గా తీస్తున్నారా? వంటి ప్రశ్నలు మరోవైపు. వీటన్నింటికీ ఈ రోజు 'యాత్ర' సినిమా సమాధానం చెబుతోంది'' అని చిత్రబృందం పేర్కొంది.

● 970 స్క్రీన్స్‌లో భారీ ఎత్తున 'యాత్ర' విడుదలయింది. సాధారణంగా ఒక సినిమా హీరో బయోపిక్ లేదా బిగ్ కాస్టింగ్‌తో తీసిన సినిమాలు ఇంతటి భారీ స్థాయిలో రిలీజ్ కావటం చూశాం. కానీ, తొలిసారిగా ఓ రాజకీయ నాయకుడి బయోపిక్ తీస్తే ఒక్క ఓవర్‌సీస్‌లోనే 180 స్క్రీన్స్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 500 స్క్రీన్స్.. ఇలా ప్రపంచ వ్యాప్తంగా 970 స్క్రీన్స్‌లో ఈ చిత్రం విడుదలవటం చూస్తే 'యాత్ర'పై తెలుగు ప్రజల క్రేజ్ ఏంటో తెలుస్తోందని, అటు అమెరికా నుంచి అనకాపల్లి వరకూ ఈ సినిమాకి అనూహ్యమైన స్పందన లభిస్తోందని నిర్మాతల్లో ఒకరైన విజయ్ చిల్లా చెప్పారు.

● 'నాయకుడిగా మనకు ఏం కావాలో తెలుసుకున్నాం కానీ... జనానికి ఏం కావాలో తెలుసుకోలేకపోయాం' అంటూ అధిష్టానాన్ని సైతం లెక్కచేయక పేద ప్రజల కష్టాల్ని వినటానికి కడప గడప దాటి పాదయాత్ర చేసిన వైఎస్‌గారు జననేతగా, మహానేతగా, పేద ప్రజల గుండె చప్పుడుగా పదిలమైన చోటు సంపాదించుకున్నారు. వైఎస్‌గారి పాదయాత్ర 68 రోజులు జరిగింది. యాదృచ్ఛికంగా 'యాత్ర' షూటింగ్ కూడా 68 రోజుల్లో పూర్తికావటం ఆ పెద్దాయన ఆశీస్సులుగా టీమ్ భావిస్తున్నారు.

● వైఎస్‌గారి రాజకీయ జీవితంలో పాదయాత్ర కీలక ఘట్టం. ఆ సమయంలో జరిగిన ముఖ్య సంఘటనల సమాహారమే ఈ 'యాత్ర'. పాదయాత్రలో రైతుల కష్టాలు, పేదవాళ్ల ఆవేదనలు, ప్రతి ఒక్కరి భావోద్వేగాలని రాజన్న మనసుతో వినటమే ఈ చిత్రంలో కీలక భాగం. రాజకీయాలు లేని రాజకీయ నాయకుడి కథే ఈ సినిమా. ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని చూసి భావోద్వేగానికి లోనవుతారు. ఎందుకంటే కష్టం ఎవరికైనా కష్టమే. అందుకే ఈ యూనివర్సల్ సబ్జెక్ట్‌ని తెలుగుతోపాటు భారతదేశం మొత్తం విడుదల చేశాం. ఎమోషనల్ కంటెంట్‌తో ఉన్న ఈ చిత్రాన్ని చూసిన ప్రేక్షకుడు బరువైన గుండెతో థియేటర్స్ నుంచి బయటకి వస్తారు.

● మహి చెప్పిన 'యాత్ర' కథలోని పాత్రలు, వాటి కష్టాలు మమ్ముట్టిగారిని కలచి వేశాయి. ఆ తర్వాత ఆయన వైఎస్‌గారి గురించి పూర్తిగా తెలుసుకుని పాత్రలో పరకాయ ప్రవేశం చేశారు. 'ఇది రాజకీయ నాయకుడి కథ మాత్రమే కానీ, రాజకీయాలు ఉండవు.. ప్రజల కష్టాలు, రైతుల బాధలు ఉంటాయి.. ఇవన్నీ భారతదేశం అంతటా ఉంటాయి. ఏ రైతుని అడిగినా, ఏ పేదవాడిని అడిగినా వారి కష్టాలు చెప్తారు' అని మమ్ముట్టి చెప్పారు. 'యాత్ర'లో ఆద్యంతం ఎమోషన్‌తో కూడిన పాత్రలు, పాత్ర చిత్రణ కనిపిస్తాయి. తెలుగు ప్రజలందరూ తప్పకుండా చూడాల్సిన చిత్రంగా ఫ్యామిలీ ఎమోషన్స్‌ని దర్శకుడు చూపించారు. సినిమాని ప్రేమించే ప్రతి ఒక్కరూ చూడాల్సిన చిత్రమిదని నిర్మాతలు అన్నారు.

● ''యాత్ర' సినిమా చేయాలనుకున్నప్పటి నుంచి విడుదల వరకూ వైఎస్ జగన్‌గారు కానీ, వారి కుటుంబ సభ్యులు కానీ ఎక్కడా అభ్యంతరాలు పెట్టలేదు సరికదా కనీసం కథ వివరాలు కూడా అడగలేదు. దర్శకుడికి, ప్రొడక్షన్‌కి ఫ్రీ హ్యాండ్ ఇవ్వటం జగన్‌గారి గొప్పతనానికి నిదర్శనం. ఇటీవల జగన్‌గారిని మహి కలిసినప్పుడు.. 'మీ నాయకుడి చిత్రం మీరు తీస్తున్నారు.. ఆయన గురించి మీకే బాగా తెలుసు.. నాన్నగారు చేసిన పనులు చెప్పండి చాలు' అని జగన్‌గారు సున్నితంగా చెప్పటం మా యూనిట్‌కి నూతనోత్సాహం కలిగించింది. ఇందుకు జగన్‌గారికి, వారి కుటుంబ సభ్యులకి ప్రత్యేక ధన్యవాదాలు'' అని విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి అన్నారు.

పైరసీ చేస్తే మూడేళ్ల జైలు

చలనచిత్ర రంగానికి పెద్ద సమస్యగా మారింది పైరసీ భూతం. ఇకపై సినిమాకి చెందిన సంబంధిత వ్యక్తుల అనుమతులు లేకుండా సినిమాను కాపీ చేయాలనుకునే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా సినిమాటోగ్రఫీ 1952 సవరణ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం సరైన అనుమతులు లేకుండా పైరసీ చర్యలకు పాల్పడిన వ్యక్తులు మూడేళ్ల కారాగార శిక్ష లేదా పది లక్షల రూపాయల జరిమానా కట్టాల్సిన అవసరం ఉంటుంది. లేదా ఆ రెండిటికీ శిక్షార్హులవుతారు. కేంద్రప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన ఈ సవరణ బిల్లు గురించి సినీ ప్రముఖులు సోషల్ మీడియాలో స్పందిస్తూ తమ ఆనందాన్ని షేర్ చేసుకున్నారు. ''మన దేశంలోని మేధావుల సంపత్తిని కాపాడుకోవడంలో ఇది ముఖ్యమైన ముందడుగు'' అని 'ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా' ప్రెసిడెంట్ సిద్ధార్థ్‌రాయ్ కపూర్ అన్నారు.

భారత్ 103వ స్థానానికి...

ప్రపంచ ఫుట్‌బాల్ (ఫిఫా) ర్యాంకింగ్స్‌లో భారత్ టాప్-100లో చోటు కోల్పోయింది. గురువారం ప్రకటించిన తాజా ర్యాంకుల్లో భారత్ ఆరు స్థానాలు దిగజారి 103వ ర్యాంక్‌లో నిలిచింది. ఆసియా ర్యాంకింగ్స్‌లో కూడా 18వ స్థానానికి పడిపోయింది. ఇటీవల జరిగిన ఆసియా కప్‌లో పేలవ ప్రదర్శనతో యూఏఈ, బహ్రెయిన్‌ల చేతుల్లో ఓడటమే అందుకు కారణం. 2022 వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌లో పాల్గొనేందుకు భారత్ ర్యాంకు మెరుగు పడాల్సి ఉంది. ఇందు కోసం మున్ముందు పెద్ద జట్లతో భారత్ ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడనుంది. 21 ఏళ్ల తర్వాత 2017లో తొలిసారి టాప్-100లో నిలిచింది.



విదర్భ విజయ దర్పం

సాదాసీదా జట్టుగా గత సీజన్ బరిలో దిగి రంజీ ట్రోఫీని కైవసం చేసుకున్న విదర్భ... అదే అద్భుతాన్ని పునరావృతం చేసింది. నాలుగో ఇన్నింగ్స్ పోరాటాలతో ఫైనల్‌కు చేరిన సౌరాష్ట్రకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ట్రోఫీని మరోసారి ఒడిసిపట్టింది. తద్వారా తమ విజయ ప్రస్థానం గాలివాటం కాదని నిరూపించింది. దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నీని నెగ్గాలన్న సౌరాష్ట్ర కల మూడోసారి చెదిరిపోయింది.

వరుసగా రెండోసారి రంజీ ట్రోఫీ కైవసం
- ఫైనల్లో సౌరాష్ట్రపై 78 పరుగులతో విజయం
- ఆదిత్య సర్వతేకు 6 వికెట్లు

నాగ్‌పూర్: విజయంపై ఏమూలనో ఉన్న సౌరాష్ట్ర ఆశలను వమ్ము చేస్తూ... డిఫెండింగ్ చాంపియన్ విదర్భ 2018–19 సీజన్ రంజీ ట్రోఫీని ఖాతాలో వేసుకుంది. గురువారం ఇక్కడ ముగిసిన ఫైనల్లో ఆ జట్టు 78 పరుగుల తేడాతో విజయం సాధించింది. 206 పరుగుల లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 58/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర 127 పరుగులకు ఆలౌటైంది. ఎడమచేతి వాటం స్పిన్నర్ ఆదిత్య సర్వతే (6/59), ఆఫ్ స్పిన్నర్ అక్షయ్ వాఖరే (3/37) ప్రత్యర్థి పనిపట్టారు. మ్యాచ్‌లో మొత్తం 11 వికెట్లు పడగొట్టడంతో పాటు, రెండో ఇన్నింగ్స్‌లో విలువైన 49 పరుగులు చేసిన సర్వతేకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

వారిద్దరి పోరాటం కాసేపే...

చేతిలో ఉన్న ఐదు వికెట్లతో గెలుపునకు 148 పరుగులు చేయాల్సిన స్థితిలో గురువారం మైదానంలో దిగిన సౌరాష్ట్ర కాసేపు ప్రతిఘటించింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ విశ్వరాజ్ జడేజా (137 బంతుల్లో 52; 6 ఫోర్లు), కమలేశ్ మక్వానా (45 బంతుల్లో 17; 2 ఫోర్లు) ఆశలు రేపారు. దాదాపు 15 ఓవర్లు క్రీజులో నిలిచిన వీరు ఆరో వికెట్‌కు 33 పరుగులు జత చేశారు. కానీ, మక్వానాను ఔట్ చేసిన సర్వతే ఈ జోడీని విడగొట్టాడు. ఆ వెంటనే ప్రేరక్ మన్కడ్ (2)ను అక్షయ్ పెవిలియన్ పంపాడు. జట్టు స్కోరు 103 వద్ద విశ్వరాజ్‌ను సర్వతే ఎల్బీడబ్ల్యూ చేయడంతో సౌరాష్ట్ర ఓటమి ఖాయమైంది. ధర్మేంద్ర జడేజా (17), కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (7) వికెట్లను ఆరు పరుగుల తేడాతో పడగొట్టి విదర్భ జయకేతనం ఎగురవేసింది.

రూ.2 కోట్ల ప్రైజ్‌మనీ...
రూ.3 కోట్ల ప్రోత్సాహకం

ముంబై: రంజీ చాంపియన్‌గా నిలిచిన తమ జట్టుకు విదర్భ క్రికెట్ సంఘం (వీసీఏ) రూ.3 కోట్ల ప్రోత్సాహక నగదు బహుమతిని ప్రకటించింది. ఈ విషయాన్ని వీసీఏ అధ్యక్షుడు ఆనంద్ జైస్వాల్ తెలిపారు. టోర్నీ గెలిచినందుకు ప్రైజ్‌మనీగా విదర్భకు బీసీసీఐ రూ.2 కోట్లు ఇవ్వనుంది.


సంక్షిప్త స్కోర్లు

విదర్భ తొలి ఇన్నింగ్స్: 312 (కర్నెవార్ 73; అక్షయ్ వాద్కర్ 45; ఉనాద్కట్ 3/54, సకారియా 2/44); **రెండో ఇన్నింగ్స్:** 200 (సర్వతే 49, మోహిత్ కాలే 38; ధర్మేంద్ర జడేజా 6/96, మక్వానా 2/51).
సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్: 307 (స్నెల్ పటేల్ 102, ఉనాద్కట్ 46; సర్వతే 5/98, వాఖరే 4/80) **రెండో ఇన్నింగ్స్:** 127 (విశ్వరాజ్ జడేజా 52; సర్వతే 6/59, వాఖరే 3/37).

6 రంజీ ట్రోఫీని వరుసగా రెండో ఏడాది గెలుచుకున్న ఆరో జట్టుగా విదర్భ గుర్తింపు పొందింది. గతంలో ముంబై, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, రాజస్థాన్ ఈ ఘనత సాధించాయి. వీటిలో ముంబై ఆరు సార్లు వరుసగా రెండేసి, ఒక సారి వరుసగా మూడు టైటిల్స్ సాధించడంతో పాటు 1958-59 సీజన్ నుంచి 1972-73 వరకు వరుసగా 15 సార్లు నెగ్గడం విశేషం. కర్ణాటక రెండు సార్లు వరుసగా రెండు టైటిల్స్ గెలుచుకుంది.

10 వసీం జాఫర్ 10వ రంజీ టైటిల్ విజయంలో భాగమయ్యాడు. ముంబై తరఫున 8 సార్లు, విదర్భ తరఫున 2 సార్లు అతను గెలిచాడు.

మీరాబాయి చానుకు స్వర్ణం



న్యూఢిల్లీ: గాయంనుంచి కోలుకొని పునరాగమనం చేసిన తర్వాత భారత వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను ఘనమైన ప్రదర్శన నమోదు చేసింది. థాయిలాండ్‌లో జరిగిన ఈజీఏటీ కప్‌లో ఆమె 49 కేజీల విభాగంలో స్వర్ణం గెలుచుకుంది. మాజీ ప్రపంచ చాంపియన్ కూడా అయిన చాను వెన్నునొప్పితో గత ఏడాదిలో దాదాపు ఆరు నెలలు ఆటకు దూరమైంది. తాజా ఈవెంట్‌లో ఆమె స్నాచ్‌లో 82 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 110 కేజీలు కలిపి మొత్తం 192 కిలోల బరువెత్తింది. ఈజీఏటీ కప్‌ను ద్వితీయ శ్రేణి ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీగా వ్యవహరిస్తారు. ఇక్కడ సాధించే పాయింట్లను వరల్డ్ ర్యాంకింగ్ కోసం పరిగణలోకి తీసుకుంటారు. ఫలితంగా 2020 ఒలింపిక్స్‌కు అర్హత సాధించే క్రమంలో ఈ విజయం చానుకు ఎంతో మేలు చేస్తుంది.

భారత పర్యటనకు స్టార్క్ దూరం

మెల్‌బోర్న్: ఛాతీ కండరాల గాయంతో బాధపడుతున్న ఆస్ట్రేలియా ప్రధాన పేసర్ మిషెల్ స్టార్క్ భారత్‌లో జరిగే వన్డే, టి20 సిరీస్‌లనుంచి తప్పుకున్నాడు. అతని స్థానంలో ఆసీస్ సెలక్టర్లు మరో పేసర్ కేన్ రిచర్డ్సన్‌ను ఎంపిక చేశారు. శ్రీలంకతో కాన్‌బెర్రాలో జరిగిన రెండో టెస్టు సందర్భంగా స్టార్క్ గాయపడ్డాడు. ఇటీవల భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఆడిన జట్టులో ఉన్న ఆల్‌రౌండర్ మిషెల్ మార్ష్, పీటర్ సిడిల్, బిల్లీ స్టాన్‌లేక్‌లపై వేటు పడింది. ఫామ్‌లో ఉన్న బ్యాట్స్‌మన్ షాన్ మార్ష్ వ్యక్తిగత కారణాలతో కాస్త ఆలస్యంగా మూడో వన్డే సమయానికి జట్టుతో చేరతాడు. ఫిబ్రవరి 24న వైజాగ్‌లో జరిగే తొలి టి20తో ప్రారంభమయ్యే ఈ టూర్ మార్చి 13న న్యూఢిల్లీలో జరిగే ఐదో వన్డేతో ముగుస్తుంది.

భారత్‌ను గెలిపించిన అంకిత



ఫెడ్‌కప్ టెన్నిస్ టోర్నీ

ఆస్తానా (కజకిస్తాన్): ప్రతిష్టాత్మక ఫెడ్‌కప్‌లో భారత్ శుభారంభం చేసింది. భారత నెం.1 టెన్నిస్ సింగిల్స్ ప్లేయర్ అంకిత రైనా కీలక సమయంలో రాణించడంతో ఈ టోర్నమెంట్‌లో భారత్ ముందంజ వేసింది. గురువారం జరిగిన పోరులో 2–1తో థాయిలాండ్‌పై విజయం సాధించింది. తొలి సింగిల్స్ మ్యాచ్‌లో ప్రపంచ 211వ ర్యాంకర్ కర్మన్ కౌర్ తాండి (భారత్) 2–6, 6–3, 3–6తో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 712వ స్థానంలో ఉన్న నుడిండా లాంగమ్ చేతిలో పరాజయం పాలైంది. రెండో సింగిల్స్‌లో అంకిత 6–7 (3), 6–2, 6–4తో పియాంగ్‌టాన్ ప్లిపుచ్ (థాయిలాండ్)పై పోరాడి నెగ్గడంతో స్కోరు 1–1తో సమమైంది. నిర్ణాయక డబుల్స్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఈ మ్యాచ్‌లో అంకిత–కర్మన్ ద్వయం 6–4, 6–7 (6), 7–5తో పియాంగ్‌టాన్–నుడిండా జోడీపై కష్టపడి గెలిచి ఊపిరి పీల్చుకుంది. భారత్ శుక్రవారం జరిగే తదుపరి పోరులో కజకిస్తాన్‌తో తలపడుతుంది.

బ్లాక్ హాక్స్ హైదరాబాద్‌కు ఓటమి

కొచ్చి: నవీన్ రాజా జాకబ్ 16 పాయింట్ల (12 స్పైక్స్, 4 సర్వీస్)తో చెలరేగడంతో ప్రొ వాలీబాల్ లీగ్ (పీవీఎల్)లో చెన్నై స్పార్టన్స్‌కు తొలి గెలుపు దక్కింది. గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 4–1తో బ్లాక్ హాక్స్ హైదరాబాద్‌ను ఓడించింది. హైదరాబాద్ కెప్టెన్ కార్సన్ క్లార్క్ 12 పాయింట్లు (11 స్పైక్స్, 1 బ్లాక్) సాధించినా జట్టును గెలిపించలేకపోయాడు. నేడు జరిగే మ్యాచ్‌లో బ్లాక్ హాక్స్... కొచ్చి బ్లూ స్పైకర్స్‌తో తలపడుతుంది.

విజయంతో ముగించిన పాక్

చివరి టి20లో దక్షిణాఫ్రికా ఓటమి

సెంచూరియన్: దక్షిణాఫ్రికా గడ్డపై టెస్టు, వన్డే, టి20 సిరీస్‌లను కోల్పోయిన పాకిస్తాన్‌కు చివరి మ్యాచ్‌లో ఊరట విజయం లభించింది. బుధవారం జరిగిన చివరి టి20 మ్యాచ్‌లో పాక్ 27 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. తొలి రెండు మ్యాచ్‌లు నెగ్గిన సఫారీలు 2–1తో సిరీస్‌ను సొంతం చేసుకున్నారు. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఎవరూ భారీ స్కోరు సాధించకపోయినా... రిజ్వాన్ (26), ఆసిఫ్ అలీ (25), షాదాబ్ ఖాన్ (22 నాటౌట్) తలా ఓ చేయి వేశారు. బ్యూరాన్ హెండ్రిక్స్ (4/14) అద్భుతమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేశాడు. అనంతరం దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 9 వికెట్లకు 141 పరుగులు చేసింది. క్రిస్ మోరిస్ (29 బంతుల్లో 55 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ సెంచరీ సాధించగా, వాన్ డర్ డుసెన్ (35 బంతుల్లో 41; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడాడు. ఆమిర్‌కు 3 వికెట్లు దక్కాయి. బ్యాటింగ్‌లో చివరి ఓవర్లో మూడు భారీ సిక్సర్లు బాదడంతో పాటు 2 కీలక వికెట్లు తీసిన షాదాబ్ ఖాన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కగా, డేవిడ్ మిల్లర్ 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యాడు.



సిరీస్ కాపాడుకుంటారా..!

ఈ పర్యటనలో భారత్ నాలుగోవన్డేలో బంతుల పరంగా (212) భారీ తేడాతో ఓడింది. కానీ అంతకంటే ముందే భారత్ 3-0తో సిరీస్ నెగ్గింది. ఆ ఓటమి లెక్కలోకి రాలేదు. తాజాగా తొలి టి20లో 80 పరుగుల భారీతేడాతో ఓడింది. ఈ ఫలితమేమో సిరీస్‌ను తాడోపేడోదాకా తీసుకొచ్చింది. రెండో మ్యాచ్‌ను కీలకం చేసింది.

బ్యాట్స్‌మెన్ రాణింపే కీలకం • ఆత్మవిశ్వాసంతో న్యూజిలాండ్ • భారత్, కివీస్ రెండో టి20 నేడే



ఆక్లాండ్: భారత్ ఇక మెరుపుల తడాఖా చూపెట్టాల్సిందే. 'పొట్టి'ది గెలవాలంటే గట్టిగా పని చెప్పాల్సిందే. ఈ నేపథ్యంలో రెండో టి20లో గెలుపే లక్ష్యంగా ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచేందుకు సిద్ధమైంది. శుక్రవారం న్యూజిలాండ్‌తో తాడోపేడో తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో పుంజుకుంటేనే భారత్ సిరీస్ నెగ్గుకొస్తుంది. లేదంటే మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ ఆతిథ్య జట్టు ఖాతాలోకి వెళుతుంది. నిజానికి ఈ సిరీస్‌లో రిజర్వ్ సత్తాను పరిశీలించాలనుకున్న భారత్‌కు తొలి మ్యాచ్‌లోనే కఠిన పరీక్ష ఎదురైంది. దీంతో ఇప్పుడు ప్రయోగాలు పక్కనబెట్టి మ్యాచ్ విజయంపైనే దృష్టి పెట్టింది. సిరీస్‌నే లక్ష్యంగా పెట్టుకుంది.

ఆల్‌రౌండ్ దెబ్బ కొట్టాల్సిందే

టి20 ఫార్మాట్‌లో ఈ జట్టు ఫేవరెట్ అని ఉండదు. ఆ రోజు ఎవరి మెరుపులు మెరిస్తే వాళ్లే విజేత. కాబట్టి భారత్ తమ పటిష్టమైన బ్యాటింగ్ లైనప్‌లో 'నిలకడ' చూపెడుతూనే ప్రత్యర్థి ధాటిని నిలువరించేలా ప్రణాళికను సిద్ధం చేయాలి. గత మ్యాచ్‌లో కివీస్ ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ చెలరేగాడు. ఆరంభంలోనే అతనికి అడ్డుకట్ట వేయాలి. హార్దిక్ పాండ్యా సహా కీలకమైన పేసర్ భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్‌లు తమ కోటాలో అటు ఇటుగా 50 చొప్పున పరుగులు సమర్పించుకున్నారు. ఈ పొరపాట్లను ఈ మ్యాచ్‌లో కొనసాగిస్తే ఏకంగా 'సిరీస్' మూల్యం తప్పదు. కాబట్టి ఖలీల్ అహ్మద్ స్థానంలో సిద్ధార్థ్ కౌల్, సిరాజ్‌లలో ఒకరికి ఛాన్స్ ఇవ్వొచ్చు. అలాగే ముగ్గురు వికెట్ కీపర్‌లలో ఒకరిని తప్పిస్తే... రిషభ్ పంత్, దినేశ్ కార్తీక్‌లలో ఒకరికే తుది జట్టులో ఆడే అవకాశముంటుంది. మణికట్టు స్పిన్నర్లను ఆడించాలనుకుంటే మాత్రం ఆల్‌రౌండర్లలో పాండ్యా బ్రదర్స్‌లో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), ధావన్, శుబ్‌మన్/విజయ్ శంకర్, రిషభ్ పంత్, దినేశ్ కార్తీక్, ధోని, హార్దిక్ పాండ్యా, కృనాల్ / కుల్దీప్, భువనేశ్వర్, ఖలీల్ అహ్మద్/సిరాజ్, చహల్.

న్యూజిలాండ్: కేన్ విలియమ్సన్ (కెప్టెన్), సీఫెర్ట్, మున్రో, టేలర్, మిచెల్, నీషమ్/గ్రాండ్‌హోమ్, సాన్‌ట్నర్, కుగ్లీన్, సౌతీ, ఇష్ సోధి, ఫెర్గూసన్.

జోరుమీదున్న కివీస్

వన్డే సిరీస్‌ను తేలిగ్గానే కోల్పోయిన న్యూజిలాండ్ టి20ల్లో శుభారంభంతో టచ్‌లోకి వచ్చింది. భారత్‌కు టి20 చరిత్రలోనే భారీ పరాజయాన్ని రుచి చూపించిన కివీస్ ఇదే జోరుతో మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ చేజిక్కించుకోవాలని భావిస్తోంది. వన్డేల్లో రెండు వన్డేలుండగానే భారత్ గెలిచినట్లే... ఇప్పుడు టి20 సిరీస్‌లో అదే ఫలితాన్ని ఆతిథ్య జట్టు సాధించాలనుకుంటోంది. పైగా కివీస్ గడ్డపై ఇప్పటివరకైతే భారత్ నెగ్గనేలేదు. ఆడిన మూడింట ఓటములే! ఈ నేపథ్యంలో కలిసొచ్చే చరిత్ర కూడా న్యూజిలాండ్‌ను ఊరిస్తోంది. ఓపెనర్లు సీఫెర్ట్, మున్రో సహా టాపార్డర్ ధాటిగా ఆడుతోంది. తొలి మ్యాచ్‌లో కెప్టెన్ కేన్ విలియమ్సన్, రాస్ టేలర్‌లు మెరుపులు మెరిపించారు. భారత బౌలర్లు తేలిపోవడంతో టెయిలెండర్ కుగ్లీన్ కూడా చెలరేగిపోయాడు. బౌలింగ్‌లో సౌతీ, ఫెర్గూసన్, సాన్‌ట్నర్, ఇష్ సోధిలు సమష్టిగా రాణించారు. ఇదే ప్రదర్శనను ఇక్కడా కొనసాగిస్తే భారత బ్యాట్స్‌మెన్‌కు కష్టాలు తప్పకపోవచ్చు.

పిచ్, వాతావరణం

ఈడెన్ పార్క్ పిచ్ బ్యాటింగ్ స్వర్గధామమని గత ఫలితాలే చెబుతున్నాయి. ఇక్కడే ఆసీస్ 244 పరుగుల లక్ష్యాన్ని అవలీలగా ఛేదించింది. కివీస్ 143 పరుగుల లక్ష్యాన్ని పది ఓవర్లలోనే చేసేసింది. తొమ్మిది మ్యాచ్‌ల్లో ఆరు సార్లు ఛేదనకు దిగిన జట్టే గెలిచింది.

ఉదయం గం.11:30 నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

అమ్మాయిలూ తేల్చుకోవాలి...

- నేడు భారత్, కివీస్ మహిళల రెండో టి20 సమరం
- మిథాలీకి దక్కేనా ఛాన్స్!

ఆక్లాండ్: తొలి టి20లో పురుషుల జట్టులాగే ఓడిన భారత మహిళల జట్టు కూడా ఆతిథ్య కివీస్‌తో అమీతుమీకి సైఅంటోంది. నేడు జరిగే రెండో టి20లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. సిరీస్‌లో నిలవాలంటే గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో విశేష అనుభవజ్ఞురాలైన మిథాలీ రాజ్‌ను తుది జట్టులో ఆడించే అవకాశాలను టీమ్ మేనేజ్‌మెంట్ పరిశీలిస్తోంది. తొలి మ్యాచ్‌లో సాఫీగా లక్ష్యం దిశగా సాగుతున్న భారత్ అనూహ్యంగా 34 పరుగుల వ్యవధిలోనే 9 వికెట్లు కోల్పోయి ఓటమిని మూటగట్టుకుంది. ఓపెనర్ స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్ మినహా ఎవరూ నిలబడలేకపోయారు. మరోవైపు చేజారుతున్న మ్యాచ్‌ను కివీస్ జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చేతుల్లోకి తెచ్చుకుంది. ఇప్పుడు శుక్రవారం జరిగే మ్యాచ్‌తోనే సిరీస్‌నూ చేజిక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ నేపథ్యంలో ఒత్తిడంతా భారత బృందంపైనే ఉంది. ఈ మ్యాచ్‌లో భారత అమ్మాయిలు సర్వశక్తులు ఒడ్డాల్సిందే. లేదంటే మరో మ్యాచ్ ఆడకుండానే ప్రత్యర్థికి సిరీస్‌ను అప్పజెప్పాల్సి వస్తుంది.

ఉదయం గం.7:30 నుంచి స్టార్‌స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

రెస్టాఫ్ ఇండియా కెప్టెన్‌గా రహానే

ముంబై: రంజీ చాంపియన్ విదర్భతో ఇరానీ కప్ మ్యాచ్‌లో తలపడే రెస్టాఫ్ ఇండియా జట్టును సెలక్టర్లు గురువారం ప్రకటించారు. అజింక్య రహానేను ఈ టీమ్‌కు కెప్టెన్‌గా ఎంపిక చేశారు. రహానేతో పాటు ఇతర భారత టెస్టు ఆటగాళ్లు హనుమ విహారి, మయాంక్ అగర్వాల్ కూడా ఈ జట్టులో ఉన్నారు. వరుసగా ఆస్ట్రేలియాతో 4 టెస్టులు, 3 రంజీ ట్రోఫీ నాకౌట్ మ్యాచ్‌ల తర్వాత చతేశ్వర్ పుజారాకు బోర్డు విశ్రాంతినిచ్చింది. రంజీ ట్రోఫీలో ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను ఎంపిక చేశారు. ఈ నెల 12నుంచి 16 వరకు నాగపూర్‌లో ఈ మ్యాచ్ జరుగుతుంది.

రెస్టాఫ్ ఇండియా జట్టు: రహానే (కెప్టెన్), మయాంక్, అన్‌మోల్ ప్రీత్, విహారి, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, కె.గౌతమ్, ధర్మేంద్ర జడేజా, రాహుల్ చహర్, అంకిత్ రాజ్‌పుత్, తన్వీర్ ఉల్ హఖ్, రోనిత్ మోరె, సందీప్ వారియర్, రింకూ సింగ్, స్నెల్ పటేల్.

ఇంగ్లండ్‌తో వన్డేలకు గేల్

గ్రాస్ ఐలెట్: విధ్వంసక బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ వెస్టిండీస్ వన్డే జట్టులోకి వచ్చాడు. ప్రపంచ కప్ సన్నాహాల్లో భాగంగా... అతడిని ఇంగ్లండ్‌తో జరుగనున్న సిరీస్‌లో తొలి రెండు వన్డేలకు ఎంపిక చేశారు. 39 ఏళ్ల గేల్ గతేడాది జులైలో బంగ్లాదేశ్‌పై చివరి వన్డే ఆడాడు. ఓపెనర్ ఎవిన్ లూయీస్‌ను కూడా జట్టులోకి తీసుకున్నారు. యువ బ్యాట్స్‌మన్ నికోలస్ పూరన్‌కు తొలిసారిగా చోటుదక్కింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి వన్డే ఈ నెల 20న బ్రిడ్జిటౌన్‌లో జరుగనుంది. విండీస్ జట్టుకు ఆల్‌రౌండర్ జేసన్ హోల్డర్ నేతృత్వం వహిస్తాడు.

ఇంగ్లండ్ లయన్స్ 303/5

భారత్ 'ఎ'తో తొలి టెస్టు


బెన్

వాయనాడ్: భారత్ 'ఎ'తో గురువారం ప్రారంభమైన తొలి అనధికారిక టెస్టులో ఇంగ్లండ్ లయన్స్ మెరుగైన ప్రదర్శన కనబర్చింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 303 పరుగులు చేసింది. బెన్ డకెట్ (80), స్యామ్ హెయిన్ (61) అర్ధ సెంచరీలు సాధించగా... విలియం జాక్స్ (40 బ్యాటింగ్), స్టీవెన్ ములానీ (39 బ్యాటింగ్) రాణించారు. భారత 'ఎ' బౌలర్లలో నితిన్ సైని 2 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు ఇరు జట్ల మధ్య ఈ నెల 13నుంచి మైసూరులో జరిగే రెండో అనధికారిక టెస్టులో పాల్గొనే భారత 'ఎ' జట్టును సెలక్టర్లు ప్రకటించారు. ఈ జట్టుకు లోకేశ్ రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ప్రస్తుతం జరుగుతున్న మ్యాచ్‌లో కూడా రాహుల్ జట్టులో ఉన్నా... అంకిత్ బావ్నే నాయకత్వంలో జట్టు బరిలోకి దిగింది.

ప్రిక్వార్టర్స్‌లో సాకేత్ ఓటమి

చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్

చెన్నై: హైదరాబాద్ స్టార్ సాకేత్ మైనేని చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నమెంట్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించాడు. భారత టాప్ ర్యాంక్ ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్, శశికుమార్ ముకుంద్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో 11వ సీడ్ సాకేత్ 3–6, 6–7 (3/7)తో ఐదో సీడ్ డేవిడొవిచ్ ఫొకినా (స్పెయిన్) చేతిలో పరాజయం చవిచూడగా... అన్‌సీడెడ్ ముకుంద్ 6–3, 6–4తో మూడో సీడ్ మొహమద్ సఫ్వాత్ (ఈజిప్టు)కు షాకిచ్చాడు. టాప్ సీడ్ ప్రజ్నేశ్ 6–4, 6–2తో భారత్‌కే చెందిన అర్జున్ ఖడేను ఇంటిదారి పట్టించాడు. నేడు జరిగే క్వార్టర్స్‌లో ప్రజ్నేశ్... ఏడో సీడ్ జేమ్స్ డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)తో, శశికుమార్ ముకుంద్... బ్రిడన్ క్లెయిన్ (బ్రిటన్)తో తలపడతారు.



స్పీకర్ పోచారంను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌కే జోషి, రాజీవ్‌శర్మ తదితరులు

ధైర్యంగా ఉండండి

స్పీకర్ పోచారంను పరామర్శిస్తున్న సీఎం కేసీఆర్


బాన్సువాడ: ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. పోచారం తల్లి పాపమ్మ (107) ఈనెల 5వ తేదీన కన్నుమూసిన విషయం విదితమే. పోచారంను పరామర్శించడానికి ముఖ్యమంత్రి ఉదయం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో కామారెడ్డి జిల్లా బాన్సువాడకు వచ్చారు. అక్కడి నుంచి వాహనంలో పోచారం గ్రామానికి వెళ్లి పాపమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అరగంటపాటు ఆయన నివాసంలో ఉన్నారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీ కవిత, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వచ్చారు.

ప్రముఖుల పరామర్శ

శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, ఎంపీలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీబీ పాటిల్, రైతు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు పోచారంను పరామర్శించారు.

చైనాతో రాహుల్ రహస్య ఒప్పందం

నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ జాతీయ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



హన్మకొండ చౌరస్తా: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా చైనాతో రాహుల్‌గాంధీ రహస్య ఒప్పందం కుదుర్చుకున్నాడని, అవసరమైతే పాకిస్తాన్‌లో భారత్‌ను కలిపేందుకు సైతం వెనుకాడని దుస్థితిలో ఉన్నారని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ జాతీయ వైస్ చైర్మన్ ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం హన్మకొండలోని బీజేపీ అర్బన్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రస్తుతం రెండే వర్గాలు ఉన్నాయని.. ఒకటి ప్రధాని నరేంద్ర మోదీ కాగా.. రెండో వర్గం దొంగలంతా ఒక జట్టు కట్టారన్నారు. బడా దొంగలకు చంద్రబాబు రక్షకుడిలా ఉంటున్నాడని ధ్వజమెత్తాడు. సీబీఐ లాంటి సంస్థలను ఏపీలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నాడు కాబట్టే దొంగలు ఏపీలో ఉండేందుకు ఇష్టపడుతున్నారని పేర్కొన్నాడు. తెలంగాణలో నిజాం నవాబును తలపించేలా కేసీఆర్ పాలన సాగిస్తున్నాడని దుయ్యబట్టారు.

గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కిన రైతన్న

ఎర్రజొన్నలు, పసుపును ప్రభుత్వమే కొనాలని డిమాండ్

ఆర్మూర్: పసుపు, ఎర్రజొన్నలకు మద్దతు ధర కల్పించడంతో పాటు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని మామిడిపల్లి చౌరస్తాలో రైతులు నిరసనకు దిగారు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆత్మగౌరవ ర్యాలీ కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్‌లోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు హైవేపై బైఠాయించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు నిరసన కొనసాగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మహారాష్ట్రలోని సాంగ్లి మార్కెట్‌లో పసుపు ధర క్వింటాలుకు రూ.9 వేలు పలుకుతుంటే, నిజామాబాద్ మార్కెట్‌లో రూ.4 వేలనుంచి రూ. 5 వేల లోపే పలుకుతోందని పేర్కొన్నారు. మద్దతు ధర నిర్ణయించే సమయంలో రైతు కమిటీల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయాధికారి గోవింద, ఉద్యాన శాఖ జిల్లా అధికారి నర్సింగ్‌దాస్, మార్కెటింగ్ ఏడీ రియాజ్, ఆర్మూర్ ఆర్డీవో శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పసుపు పంటకు క్వింటాలుకు రూ.15 వేలు, ఎర్రజొన్నకు రూ.3,500 చొప్పున గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ నెల 11లోగా తమ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోతే 12వ తేదీన కుటుంబానికి ఇద్దరు చొప్పున ఆర్మూర్‌కు తరలి వచ్చి భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



సంరంభంగా ‘ఆల్ గో రిథం’

- సిద్దిపేట జిల్లా ములుగులో పోటీలు
- అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు హాజరు

గజ్వేల్/ములుగు/వర్గల్: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి సిద్దిపేట జిల్లా ములుగులో నిర్వహించిన ‘ఆల్ గో రిథం’కార్యక్రమం గురువారం సంబరంగా సాగింది. రాష్ట్రంలోని 13 రీజియన్ల నుంచి తరలివచ్చిన విద్యార్థులతో కోలాహలం నెలకొన్నది. రాష్ట్రంలోని 251 గురుకులాల్లో ఇటీవల పలు పోటీలను నిర్వహించారు. కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, సినిమా సమీక్ష, పద్య పఠనం, చేతిరాత, నాటకం, జానపద గేయాలు, నవలల్లోని పాత్రలపై సమీక్ష, ఫ్యాషన్ షో, బృంద గేయాలు, కవి సమ్మేళనం, రంగోలి.. ఇలా 12 అంశాల్లో పోటీలు నిర్వహించారు. ముందుగా గురుకుల స్థాయిలో ఈ పోటీలను నిర్వహించి అందులో విజేతలను రీజియన్ స్థాయికి ఎంపిక చేశారు. రీజియన్‌లో గెలుపొందిన వారిని ఒక్కో అంశం నుంచి ఒక్కొక్కరు చొప్పున రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఇలా అన్ని రీజియన్లలో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న 325 మంది బాలికలు, 175 మంది బాలురు.. ములుగులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. రాత్రి వరకు ఈ పోటీలు జరిగాయి. విజేతలకు సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర భాష, సంస్కృతి విభాగం డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఫిల్మ్ డైరెక్టర్ వేణు ఉడుగుల, గురుకులాల అధికారులు నిర్మల, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామీణ వస్త్రధారణలో జగిత్యాల జిల్లా విద్యార్థినులు

అక్రమ దందాకు రాచమార్గం!

జాతీయ రహదారిపై కనిపించని తనిఖీలు

- జోరుగా గంజాయి, అల్ప్రాజోలం, గుట్కా, కలప రవాణా
- నార్త్ నుంచి సౌత్‌కు, సౌత్ నుంచి నార్త్‌కు..

సాక్షి, కామారెడ్డి: దేశంలోనే అతి పొడవైనది, ఉత్తర, దక్షిణ భారతాన్ని అనుసంధానించే ఎన్‌హెచ్‌–44 రహదారి అక్రమ రవాణాకు రాచమార్గంగా మారింది. కశ్మీర్ (శ్రీనగర్) నుంచి కన్యాకుమారి వరకు దాదాపు 3,745 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిపై ఉత్తర భారత్ నుంచి దక్షిణ భారత్‌కు, దక్షిణ భారత్ నుంచి ఉత్తర భారత్‌కు వివిధ రకాల నిషేధిత వస్తువులు అక్రమంగా రవాణా అవుతున్నాయి. ప్రధానంగా మత్తు పదార్థాల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. జమ్మూ కశ్మీర్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల గుండా సాగే 44వ జాతీయ రహదారిపై రాష్ట్రీయ, జాతీయ చెక్‌పోస్టులు ఎన్ని ఉన్నా అక్రమ రవాణాను అడ్డుకోలేకపోతున్నాయి. ఈ ఏడాది జనవరి 2న గుజరాత్ నుంచి ఓ కారులో తరలిస్తున్న 40 కిలోల అల్ప్రాజోలం (కల్లులో కలిపే మత్తు పదార్థం)ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు కామారెడ్డి పట్టణానికి సమీపంలో పట్టుకున్నారు. చిక్కిన అల్ప్రాజోలం విలువ రూ.2.40 కోట్లు అని అధికారులు తేల్చారు. గుజరాత్ నుంచి దర్జాగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు అల్ప్రాజోలం తరలిస్తున్నారంటే జాతీయ రహదారిపై తనిఖీలు ఎలా ఉన్నాయో తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో 504 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 250 కిలోమీటర్లు సాగే 44వ జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున మత్తు పదార్థాల అక్రమ రవాణా సాగుతున్నట్టు స్పష్టమవుతోంది.

గుజరాత్ నుంచి నేరుగా..

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కృత్రిమంగా పెద్ద ఎత్తున కల్లు తయారవుతోంది. మత్తు కోసం కల్లు తయారీదారులు క్లోరోఫాం, డైజోఫాం, అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నారు. ఈ మత్తు పదార్థాలు విదేశాల నుంచి గుజరాత్, మహారాష్ట్ర, యూపీ తదితర రాష్ట్రాలకు వస్తుండగా, అక్కడి నుంచి మత్తు పదార్థాల దందా నిర్వహించే మాఫియా రకరకాల మార్గాల ద్వారా సరఫరా చేస్తోంది. 44వ జాతీయ రహదారిపై చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ చాలా చోట్ల చెక్‌పోస్టుల్లో అధికారులు, సిబ్బందిని మేనేజ్ చేసుకుని దర్జాగా తరలించారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా జాతీయ రహదారిపై కామారెడ్డి మీదుగా నిత్యం 30 వేలకుపైగా వాహనాల రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో అన్ని వాహనాలను తనిఖీ చేయడం సాధ్యం కాదని అధికారులు అంటున్నారు. అయితే అక్రమ రవాణా సాగించే వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచితే వాటిని పట్టుకోవడం పెద్ద సమస్య కాదనే విషయాన్ని విస్మరిస్తున్నారు. ట్రక్కులు, కార్లలోనే మత్తుపదార్థాలు ఎక్కువగా సరఫరా చేస్తున్నట్టు గతంలో దొరికిన ఘటనలను బట్టి స్పష్టమవుతోంది. అయితే కార్లు, ట్రక్కులే కాకుండా పెద్దపెద్ద వాహనాల్లోనూ మత్తుపదార్థాల అక్రమ రవాణా సాగుతున్నట్టుగా తెలుస్తోంది.

వైజాగ్ నుంచి గంజాయి..

ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ ప్రాంతం నుంచి గంజాయి తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అది కూడా 44వ జాతీయ రహదారి మీదుగానే పెద్ద ఎత్తున తరలుతోంది. ఎండు గంజాయిని కట్టలుగా ప్యాక్ చేసి కారు డిక్కీల్లో పెట్టుకుని దర్జాగా రవాణా చేస్తున్నారు. జాతీయ రహదారిపై కామారెడ్డి వద్ద ఉన్న చెక్‌పాయింట్‌కు సమాచారం అందడంతో రవాణా అధికారులు ఓ కారును తనిఖీ చేసి అందులో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ అధికారులకు కేసును అప్పగించారు. అప్పట్లో ఢిల్లీ ప్రాంతానికి చెందిన దొంగలు కూడా కంటెయినర్‌తో ఈ జాతీయ రహదారిపైనే మకాం పెట్టడం, బైక్‌లపై వెళ్లి చైన్‌స్నాచింగ్‌లు చేసి నేరుగా బైక్‌లను కంటెయినర్‌లలోకి ఎక్కించుకుని మరోచోటికి పారిపోవడం చేశారు. ఈ కేసును జిల్లా పోలీసులు గతంలో ఛేదించారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాన్లు, కంటెయినర్లు, లారీల్లో పెద్ద ఎత్తున డూప్లికేట్ మద్యం రవాణా చేస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అప్పుడప్పుడు వెలుగు చూస్తున్న డూప్లికేట్ మద్యం మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి తరలివస్తోందని తెలుస్తోంది.



కామారెడ్డి మీదుగా సాగుతున్న 44వ నంబరు జాతీయ రహదారి



జోరుగా గుట్కా రవాణా..

వివిధ రాష్ట్రాల్లో తయారయ్యే గుట్కాను పెద్ద ఎత్తున దేశంలోని వివిధ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. జాతీయ రహదారి మీదుగా పెద్ద ఎత్తున గుట్కా అక్రమ రవాణా సాగుతోంది. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి గుట్కా పెద్ద ఎత్తున తెలంగాణ జిల్లాలకు వస్తోంది. మారుమూల రోడ్ల నుంచి తరలిస్తే అనుమానం వస్తుందన్న ఉద్దేశంతో గుట్కా మాఫియా దర్జాగా జాతీయ రహదారి మీదుగానే లారీల్లో తరలిస్తోంది. చెక్‌పోస్టుల వద్ద మేనేజ్ చేసుకుని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కలప అక్రమ రవాణా కూడా జాతీయ రహదారిపై నుంచే సాగుతుండటం గమనార్హం. మధ్యప్రదేశ్ వైపు నుంచి జాతీయ రహదారి మీదుగా కలప పెద్ద ఎత్తున తరలివస్తోంది. జాతీయ రహదారిపై చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ వారిని మేనేజ్ చేసుకుని తరలిస్తున్నారు. అక్రమ రవాణాకు రాచమార్గంగా మారిన జాతీయ రహదారిపై నిరంతరం తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది.

నల్లగొండ నుంచి ఎంపీగా పోటీ చేస్తా



కోమటిరెడ్డి

నల్లగొండ: వచ్చే ఎన్నికల్లో తాను నల్లగొండ ఎంపీగానే పోటీ చేస్తానని కాంగ్రెస్ సీనియర్‌నేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, భువనగిరి టికెట్ అడిగితే అధిష్టానం ఇస్తుందని, కానీతాను నల్లగొండ నుంచే పోటీ చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రెండుసార్లు వచ్చి నల్లగొండను దత్తత తీసుకుంటానని చెప్పడం వల్లనే ప్రజలు అటువైపు మొగ్గారని పేర్కొన్నారు. అయితే తాను ఓడిపోయినందుకు కార్యకర్తలు ఎవరూ బాధ పడవద్దని ధైర్యం చెప్పారు.

ట్యాంకెక్కి.. సజీవదహనం

- కేసులు ఎత్తివేయాలని ఓ వ్యక్తి ఆత్మహత్య
- పురుగుల మందు తాగి.. ఆపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు
- అందరూ చూస్తుండగానే ఘోరం

చిల్పూరు: కేసులు ఎత్తివేయాలని కోరుతూ ఓ వ్యక్తి ట్యాంకుపైకెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముందు క్రిమిసంహారక మందు తాగి.. అనంతరం అందరూ చూస్తుండగానే పెట్రోలు పోసుకొని నిప్పంటించుకుని సజీవదహనమయ్యాడు. ఈ ఘటన జనగామ జిల్లా చిల్పూర్ మండలం వెంకటాద్రిపేటలో గురువారం చోటుచేసుకుంది. స్టేషన్‌ఘన్‌పూర్ సీఐ రాజిరెడ్డి, చిల్పూర్ ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. వెంకటాద్రిపేటకు చెందిన రాధమ్మ–రాజయ్య దంపతుల మూడో కుమారుడు బాలరాజు(37) పలు కేసుల్లో నిందితుడు. ఇద్దరు భార్యలు మరణించగా జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. ఉదయం బాలరాజు ఐదు లీటర్ల పెట్రోలు క్యాన్, క్రిమిసంహారక మందు డబ్బా తీసుకుని గ్రామ సమీపంలోని దేవాదుల రిజర్వాయర్‌లోకి వెళ్లి ఎత్తయిన వాటర్ ట్యాంకు ఎక్కాడు. అక్కడి నుంచి 100 నంబర్‌కు డయల్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. వారు చిల్పూరు ఎస్సై శ్రీనివాస్‌కు సమాచారం ఇవ్వగా.. ఆయన హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. తనకు అన్యాయం జరిగిందని, విలేకరులు వస్తేనే దిగుతానని అనడంతో వారంతా అక్కడికి చేరుకున్నారు. కిందికి దిగిన బాలరాజు.. తాను చేసిన తప్పు కారణంగా నా తమ్ముడిపైన కేసు పెట్టారు.. కేసు లేకుండా చేయాలని కోరాడు. ఇందుకు పోలీసులు హామీనిచ్చారు. అయితే.. వెంట తెచ్చుకున్న సామగ్రి తెచ్చుకుంటానని ట్యాంకుపైకెళ్లి ముందుగా క్రిమిసంహారక మందు తాగాడు. వెంటనే ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఎస్సై 108 సిబ్బందికి సమాచారం ఇచ్చి ట్యాంకు పైకి వెళ్లి చూసేసరికే అప్పటికే సజీవదహనం అయ్యాడు.





ట్యాంకుపై బాలరాజు

ధర తగ్గించడంపై రగడ

వరంగల్ మార్కెట్‌లో మిర్చి రైతుల ఆగ్రహం



బస్తాలపైనే సేద తీరుతున్న మిర్చి రైతు

వరంగల్: వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు తగ్గించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మిర్చి యార్డుకు సుమారు 16 వేల బస్తాల సరుకు వచ్చింది. బుధవారం 341–రకం మిర్చి క్వింటాలుకు రూ.8,300 ధర పలికింది. ఇదే రకం మిర్చిని గురువారం ఓ ట్రేడర్ రూ.8,400 ధరతో కొనుగోలు చేసిన అనంతరం పక్కనే ఉన్న వేరే రైతు సరుకు కొనుగోలు చేయకుండా దూరంలో ఉన్న కుప్ప వద్దకు వెళ్లి రూ.6,200 ధర చెల్లిస్తానని చెప్పాడు. మిగిలిన రైతులంతా కలసి ధర తగ్గిస్తే తమ పరిస్థితి ఏమిటని అతడిని ప్రశ్నించగా సరుకులో నాణ్యత లేదు.. నేను అంతే ధర పెడతానని అన్నాడు. దీంతో ఆగ్రహించిన రైతులు కమీషన్ దారు, కొనుగోలు దారుడు కుమ్మక్కై తమకు అన్యాయం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ధర్నాకు దిగారు. గిట్టుబాటు ధరలను అందించాలని ట్రేడర్లకు సూచించడంతో సాయంత్రం కాంటాలు కొనసాగాయి.

సిర్పూర్‌లో పేపర్ ఉత్పత్తి

ప్రారంభించిన మిల్లు డైరెక్టర్ పవన్‌కుమార్



యంత్రాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ పవన్‌కుమార్

కాగజ్‌నగర్: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్లులో పేపర్ ఉత్పత్తి ప్రారంభమైంది. గురువారం సాయంత్రం ఏడు గంటలకు మిల్లు డైరెక్టర్ పవన్‌కుమార్ సూరి సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలసి ఏడవ నంబర్ యంత్రం బటన్ నొక్కి పేపర్ ఉత్పత్తిని ప్రారంభించారు. అంతకు ముందు వేద పండితులతో ప్రత్యేక పూజలు, హోమం కార్యక్రమం చేపట్టారు. నాలుగున్నరేళ్ల అనంతరం ఎస్పీఎం పునరుద్ధరణకు నోచుకోవడంతో ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. మిల్లులో మొత్తం ఎనిమిది పేపర్ ఉత్పత్తి యంత్రాలు ఉండగా.. ప్రస్తుతం ఏడవ నంబర్ యంత్రాన్ని ప్రారంభించారు. మార్చిలో 8వ, మేలో 3వ, సెప్టెంబర్‌లో 6వ నంబర్ యంత్రాలను ప్రారంభిస్తామని మిల్లు డైరెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మిల్లు ఉపాధ్యక్షుడు మయాంక్ జిందాల్ (వర్క్స్), అనిల్‌దీక్షిత్(హెచ్‌ఆర్), కాగజ్‌నగర్ డీఎస్పీ సాంబయ్య, ఎఫ్‌డీ రాజరమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు మహర్దశ

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్రంలోని చేనేత కార్మికులకు మహర్దశ వచ్చిందని, కార్మికులకు చేతినిండా పని, కడుపునిండా తిండి కల్పించిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. గురువారం ఆయన సిద్దిపేటలో జాకార్డు మగ్గాల శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ డైరెక్టర్ శైలజారామయ్యర్, సిద్దిపేట జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కనుమరుగైన గొల్లభామ చీరలకు పూర్వవైభవం తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు చేనేత కార్మికులను పట్టించుకోకపోవడంతో ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో చేనేత వృత్తి ప్రమాదంలో పడిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో సూరత్, ముంబైలాంటి ప్రాంతాలకు వలస వెళ్లిన చేనేత కార్మికులు తిరిగి వస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో చేనేత కార్మికులకు పూర్తి స్థాయిలో ఉపాధి లభిస్తోందన్నారు. బతుకమ్మ చీరలతోపాటు గురుకుల పాఠశాలల యూనిఫామ్‌ల తయారీ బాధ్యత చేనేత కార్మికులకు అప్పగించామన్నారు. అనంతరం హరీశ్‌రావు చేనేత కార్మికుల శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. అంతకు ముందు పట్టణంలోని గోల్కొండ షోరూంను సందర్శించారు. చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమణ, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు పాల్గొన్నారు.



జాకార్డు మగ్గాలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు, శైలజారామయ్యర్

అది మహా కల్తీ కూటమి



ప్రధాని మోదీ 'ఎలక్షన్ మోడ్'లోకి వెళ్లిపోయారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చకు లోక్‌సభలో సమాధానమిస్తూ.. దాదాపు ఎన్నికల ప్రచార ప్రసంగమే చేశారు. ఇన్నాళ్లూ కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలకు.. అంశాలవారీగా ఘాటు సమాధానమిచ్చారు. దాదాపు గంటన్నరకు పైగా చేసిన ప్రసంగంలో.. తీవ్రమైన విమర్శలు, ఆరోపణలతో పాటు వ్యంగ్య వ్యాఖ్యలు, ఛలోక్తులతో కాంగ్రెస్‌ను చీల్చి చెండాడారు. వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నాడంటూ తనపై చేస్తున్న ఆరోపణలకు బదులిస్తూ.. ' దేశంలో ఎమర్జెన్సీ విధించింది మీరే.. న్యాయవ్యవస్థను, సీబీఐని, ఈడీని అవమానించింది మీరే.. వైమానిక దళ అధిపతిని గూండాగా అభివర్ణించింది మీరే.. సైన్యం బలోపేతం కాకూడదని కోరుకునేదీ మీరే' అంటూ తిప్పికొట్టారు. రఫేల్ డీల్‌ను తప్పుపట్టడంపై స్పందిస్తూ.. ఏ కంపెనీ తరఫున బిడ్డింగ్ చేస్తున్నారంటూ కాంగ్రెస్‌ను ఎద్దేవా చేశారు. విపక్ష మహా కూటమిని విలువల్లేని, అవసరార్థం కలిసిన 'కల్తీ' కూటమి అని, అందులోని నేతలంతా బెయిల్‌పై బయట ఉన్నవారేనని, ప్రజలు వారిని తప్పక తిప్పికొడతారని చురకలంటించారు. పనిలో పనిగా, గతంలో కాంగ్రెస్ పార్టీపై మహాత్మా గాంధీ, బీఆర్ అంబేద్కర్ చేసిన వ్యాఖ్యలనూ ప్రస్తావించారు. కాంగ్రెస్‌తో కలవడం ఆత్మహత్య చేసుకోవడంతో సమానమని అంబేద్కర్ నాడే చెప్పారని, స్వాతంత్ర్యం రాగానే కాంగ్రెస్‌ను రద్దు చేయాలని గాంధీ కోరుకున్నారని గుర్తు చేశారు. ఈ లోక్‌సభలో బహుశా చివరిదైన ప్రసంగాన్ని.. సభ సాక్షిగా దేశ ప్రజలకు తన వాదన వినిపించేందుకు ప్రధాని సమర్థంగా ఉపయోగించుకున్నారు.

అవినీతిపై..

దేశాన్ని దోచుకున్న అవినీతిపరులు నన్ను చూసి భయపడుతూనే ఉన్నారు. 2010 కామన్వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించేందుకు ఓ వైపు ఆటగాళ్లు కష్టపడుతోంటే, కాంగ్రెస్ పార్టీలోని కొందరు పెద్దలు తమ సంపదను పెంచుకునేందుకు దీన్ని ఒక అవకాశంగా మలుచుకున్నారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్ కుంభకోణ నిందితుల్ని దేశానికి తీసుకురావడం ద్వారా విపక్షాల్లో కొందరికి వణుకు పుడుతోంది. యూపీఏ హయాంలో ప్రభుత్వ పెద్దల నుంచి ఫోన్లు చేయించుకుని వ్యాపారవేత్తలు రుణాలు పొందిన సందర్భాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ధరలు పెరిగాయి. ధరల్ని అదుపులో ఉంచేందుకు మా ప్రభుత్వం కృషిచేసింది. విధానపర నిర్ణయాలను ప్రభావితం చేసేలా నిధుల సేకరణలో పారదర్శకత పాటించని సుమారు 20 వేల స్వచ్ఛంద సంస్థల్ని మేం మూసివేశాం.

- దాన్ని మన ప్రజాస్వామ్యం అంగీకరించదు
- విపక్షాల మహాకూటమిపై మోదీ ధ్వజం
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో ప్రసంగం

న్యూఢిల్లీ: 'కాంగ్రెస్ న్యాయ వ్యవస్థను బెదిరించింది. దేశంలో అత్యయిక పరిస్థితి విధించింది. రాజ్యాంగ నిబంధన పేరిట ఎన్నో రాష్ట్రాల్లో ప్రభుత్వాల్ని కూల్చింది. సైన్యాన్ని అవమానించింది. ఆర్మీ చీఫ్‌ను రౌడీగా చిత్రీకరించింది. కానీ అన్ని వ్యవస్థల్ని మోదీయే నాశనం చేస్తున్నారని రాద్ధాంతం చేస్తోంది' అని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. ఎన్నికల సీజన్‌లో లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న ప్రధాని పార్లమెంట్ సాక్షిగా కాంగ్రెస్ సహా అన్ని విపక్షాలపై విరుచుకుపడ్డారు. మూకుమ్మడిగా బెయిల్‌పై ఉన్న విపక్ష నాయకులు ప్రతిపాదిస్తున్న మహా కూటమి కల్తీమయమని, దాన్ని ఆరోగ్యవంతమైన మన ప్రజాస్వామ్యం తిరస్కరిస్తుందని అన్నారు. 55 నెలలుగా ఎన్డీయే పాలన సేవా దృక్పథంతో కొనసాగుతుండగా 55 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో మునిగితేలిందని చురకలంటించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం సహజమేనని, కానీ మోదీని, బీజేపీని విమర్శిస్తూ కొందరు దేశంపై దాడిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం లోక్‌సభలో జరిగిన చర్చకు మోదీ సమాధానమిచ్చారు. ఆ తరువాత తీర్మానాన్ని లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. నాలుగున్నరేళ్ల ఎన్డీయే పాలనలో జరిగిన అభివృద్ధిని నివేదించిన మోదీ..తమ ప్రభుత్వం అవినీతిని చాలా మటుకు తగ్గించిందని ఉద్ఘాటించారు. సుమారు గంటన్నర సేపు సాగిన మోదీ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

కాంగ్రెస్, ఇతర విపక్షాలపై..

ఎన్డీయే పనితనాన్ని ప్రజలు చూశారు. కాబట్టి కొన్ని పార్టీలు కలసి ఏర్పాటు చేయాలనుకుంటున్న అత్యంత కల్తీ అయిన కూటమిని దేశం కోరుకోవడం లేదు. ప్రభుత్వమనేది ప్రజల ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి. అవినీతికి స్థానం ఇవ్వొద్దు. దేశంలోనైనా, విదేశాల్లో అయినా, పార్లమెంట్ లోపల, వెలుపల అంతటా మేము సత్యమే మాట్లాడతాం. కానీ ఆ నిజాన్ని వినే సామర్థ్యం విపక్షాలకు తగ్గిపోయింది. ఎన్నికల సంఘం పనితీరును, ఈవీఎంలను కాంగ్రెస్ శంకించింది. దేశంలో ఎమర్జెన్సీని విధించింది. ఆర్మీని, ఆర్మీ చీఫ్‌ను అవమానించారు. ప్రణాళిక సంఘం జోకర్ల బృందమని ఎద్దేవా చేశారు. కానీ మోదీనే అన్ని వ్యవస్థల్ని



ధ్వంసం చేస్తున్నారని తిరిగి ఎదురుదాడి చేస్తున్నారు. ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసిన కాంగ్రెస్ చాలా సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వాల్ని రద్దుచేసింది. ఒక్క ఇందిరా గాంధీ హయాంలోనే ఈ ఆర్టికల్‌ను 50 సార్లు ప్రయోగించారు.

రక్షణ రంగంపై...

యూపీయే హయాంలో రక్షణ రంగం ఎన్నో ప్రతిబంధకాలు ఎదుర్కొంది. ఆర్మీ సర్జికల్ దాడులు చేసే స్థాయిలో లేకపోయింది. మన ఆర్మీ, వైమానిక దళం బలోపేతం కావడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు. రఫేల్ రక్షణ కొనుగోళ్లకు సంబంధించి కాంగ్రెస్ ఏదైనా కంపెనీ తరఫున బిడ్డింగ్ వేస్తోందా? అని సూటిగా ప్రశ్నిస్తున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన జాప్యం కారణంగా సైన్యానికి బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, సరైన బూట్లు, కమ్యూనికేషన్ ఉపకరణాలు సకాలంలో అందలేదు. ఇదీ ఒక రకంగా దేశాన్ని మోసం చేయడమే అవుతుంది. పొరుగు దేశాలు అధునాతన ఆయుధ సంపత్తిని సమకూర్చుకుంటున్న సమయంలో 30 ఏళ్ల పాటు అడ్వాన్స్‌డ్ జెట్ విమానాల్ని ఎందుకు కొనుగోలు చేయలేదు? ఈ పాపానికి దేశం మిమ్మల్ని క్షమించదు. ముడుపులు లేకుండా రక్షణ ఒప్పందం కుదుర్చుకోవడంపై కాంగ్రెస్ నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే వారి దృష్టిలో కమీషన్లు లేకుండా రక్షణ ఒప్పందం జరగడం అసాధ్యం.

బీసీ అంటే బిఫోర్ కాంగ్రెస్.. ఏడీ అంటే ఆఫ్టర్ డైనాస్టీ

కాలావధుల్ని సూచించే బీసీ(బిఫోర్ క్రైస్ట్), ఏడీ(ఆనో డొమిని)లకు మోదీ కొత్త అర్థాలు చెప్పారు. కాంగ్రెస్‌కు బీసీ అంటే బిఫోర్ కాంగ్రెస్ అని, ఏడీ అంటే ఆఫ్టర్ డైనాస్టీ అని ఎద్దేవా చేశారు. ' కాంగ్రెస్ దృష్టిలో బీసీ, ఏడీలకు వేరే అర్థాలున్నాయి. బీసీ(బిఫోర్ కాంగ్రెస్) అంటే కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు అక్కడేం లేదని, ఏడీ(ఆఫ్టర్ డైనాస్టీ) అంటే తమ కుటుంబం అధికారంలోకి వచ్చాకే అంతా జరిగిందని వారు ప్రచారం చేసుకుంటున్నారు' అని మోదీ అన్నారు.

గడ్కరీకి సోనియా ప్రశంసలు

రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీకి లోక్‌సభలో ఊహించని వ్యక్తి నుంచి ప్రశంసలు లభించాయి. దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు మీ శాఖ తరఫున చేస్తున్న కృషి ప్రశంసనీయమైనదని గడ్కరీని యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అభినందించారు. గురువారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో గడ్కరీ మంత్రిత్వ శాఖకు సంబంధించి సభ్యులు రెండు ప్రశ్నలు సంధించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, తన శాఖ పరిధిలో చేసిన వివిధ పనుల వివరాలు, రహదారుల అనుసంధానికి చేసిన కృషిని సభకు వివరించారు. 'పార్టీలతో సంబంధం లేకుండా అన్ని నియోజకవర్గాల్లో మా శాఖ తరఫున పనులు చేపట్టాం. దీనికి అన్ని రాజకీయ పక్షాలకు చెందిన సభ్యులు నన్ను అభినందించాలి'అని గడ్కరీ సమాధానమిచ్చారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ సభ్యుడు గణేశ్‌సింగ్ లేచి నిలబడి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ 'అద్భుత ఫలితాలు సాధించిన గడ్కరీ శాఖను సభ అభినందించాలని' సూచించారు. మౌనంగా గమనిస్తున్న యూపీఏ చైర్‌పర్సన్ సోనియా నవ్వుతూ బల్లను చరుస్తూ గడ్కరీని అభినందించారు.

ఉద్యోగ కల్పనపై..

రవాణా, ఆతిథ్యం, మౌలిక రంగాల్లో ఈ నాలుగున్నరేళ్లలో కోట్లాది కొత్త ఉద్యోగాలు కల్పించాం. వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాల్లో ఉద్యోగాల సృష్టి జరిగినట్లు జాతీయ భవిష్య నిధి, నేషనల్ పెన్షన్ పథకం(ఎన్‌పీఎస్), పన్ను రిటర్నుల సమాచారం ధ్రువీకరిస్తోంది. 2018 నవంబర్ వరకు కేవలం 15 నెలల్లో 1.8 కోట్ల మంది తొలిసారిగా ఉద్యోగ భవిష్య నిధిలో చందాదారులుగా చేరారు. అందులో 64 శాతం మంది వయసు 28 ఏళ్ల కన్నా తక్కువే. 2014 సంవత్సరంలో ఎన్‌పీఎస్ పథకంలో ఉన్న వారి సంఖ్య 65 లక్షలు కాగా, 2018 అక్టోబర్ నాటికి ఆ సంఖ్య 1.2 కోట్లకు పెరిగింది. నాలుగేళ్లలో కొత్తగా 6.35 లక్షల మంది వృత్తి నిపుణులు ఐటీ రిటర్నులు దాఖలు చేశారు. దేశంలో స్వయం ఉపాధిని ప్రోత్సహించడానికి స్కిల్ ఇండియా, స్టాండప్ ఇండియా, డిజిటల్ ఇండియా లాంటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాల్ని మా ప్రభుత్వం ప్రారంభించింది.

16 వేల మొక్కలు నాటండి




న్యూఢిల్లీ: 2జీ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దాఖలు చేసిన అప్పీళ్లపై స్పందన తెలిపేందుకు మరింత సమయంకోరిన వ్యక్తులు, టెలికామ్ సంస్థలపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మూడు నెలలు దాటినా ఇంకా సమయం కావాలని కోరడంతో వినూత్న రీతిలో శిక్ష విధించింది. ఢిల్లీలో 16 వేల మొక్కలు నాటాలని ప్రతివాదులను ఆదేశించింది. ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న స్వాన్ టెలికాం ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్ షాహిద్ ఉస్మాన్ బల్వా, కుసేగావ్ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్ డైరెక్టర్ రాజీవ్ అగర్వాల్ సహా డైనమిక్ రియాల్టీ, డీబీ రియాల్టీ లిమిటెడ్, నిహార్ కన్‌స్ట్రక్షన్స్ అనే 3 సంస్థలు ఢిల్లీలోని దక్షిణ రిడ్జ్ అటవీ ప్రాంతంలో 3 వేల మొక్కల చొప్పున నాటాలని ధర్మాసనం ఆదేశించింది. ప్రతివాదులు తమ స్పందన తెలిపేందుకు ఆఖరు అవకాశం ఇస్తున్నట్లు తెలిపింది. తదుపరి విచారణను మార్చి 26కి వాయిదా వేసింది.

'పీఎం-కిసాన్'కు వీరు అనర్హులు!

మార్గదర్శకాలను విడుదల చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి(పీఎం–కిసాన్) విధి విధానాలను కేంద్రం ప్రకటించింది. ఐదెకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు రూ.6వేలు సాయంగా అందించేందుకు ఉద్దేశించిన పీఎం–కిసాన్ తాజా మార్గదర్శకాల ప్రకారం.. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, పని చేస్తున్న/రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులు, ప్రస్తుత/మాజీ.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మునిసిపల్ మేయర్లు, జిల్లా పంచాయతీ అధ్యక్షులు ఈ పథకానికి అర్హులు కారు. గత ఏడాది ఆదాయ పన్ను చెల్లించిన వారిని కూడా అనర్హులుగా ప్రకటించింది. ఐదెకరాల్లోపు భూమి ఉన్నా కూడా.. కుటుంబంలో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది వృత్తి నిపుణులు (వైద్యులు, ఇంజినీర్లు, లాయర్లు, చార్టెర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్టులు)ఉన్నా అర్హులు కారని తెలిపింది. ఈ పథకం కింద కేంద్రం రూ.75వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. మార్చి 31వ తేదీ లోపు మొదటి విడతగా బ్యాంకు ఖాతాల్లో జమచేయనుంది. రెండో విడతకు మాత్రం ఆధార్ కార్డును జత చేయాల్సి ఉంటుంది.

రేపు రాజీవ్‌కుమార్‌ను విచారించనున్న సీబీఐ



న్యూఢిల్లీ/కోల్‌కతా: శారదా చిట్‌ఫండ్ కేసులో కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను ఈ నెల 9వ తేదీన మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో విచారించనున్నట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఆయనకు నోటీసులు పంపినట్లు తెలిపింది. ఇటీవల కోల్‌కతాలోని రాజీవ్‌కుమార్ నివాసంలో సోదాలకు వెళ్లిన సీబీఐ అధికారులను పోలీసులు నిర్బంధించడం, సీఎం మమతాబెనర్జీ ఆందోళనకు దిగడంతో ఈ వ్యవహారం సంచలనంగా మారింది. శారదా కుంభకోణంతో సంబంధమున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఎంపీ కునాల్ ఘోష్‌ను కూడా ఈ నెల 10వ తేదీన షిల్లాంగ్‌లో జరిగే విచారణకు హాజరు కావాలని సీబీఐ కోరింది.

పార్లమెంటు క్యాంటీన్ల ఖర్చు @ రూ.16 కోట్లు



ఇండోర్: పార్లమెంటులో 2017–18 ఆర్థిక సంవత్సరానికి క్యాంటీన్లను నిర్వహించినందుకు గానూ రూ.16.43 కోట్లు చెల్లించాలని ఉత్తర రైల్వే లోక్‌సభ సెక్రటేరియట్‌ను డిమాండ్ చేసింది. మధ్యప్రదేశ్‌లోని నీముచ్‌కు చెందిన సామాజిక కార్యకర్త చంద్రశేఖర్ గౌడ్ సమాచార హక్కు(ఆర్టీఐ) చట్టం కింద దాఖలు చేసిన పిటిషన్‌తో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పార్లమెంటు హౌస్ ప్రాంగణం, పార్లమెంటు రిసెప్షన్, లైబ్రరీ బిల్డింగ్ వద్ద క్యాంటీన్ ఔట్‌లెట్లను ఏర్పాటు చేసినట్లు ఉత్తర రైల్వే తెలిపింది. వీటి నిర్వహణకు 2017–18 కాలానికి రూ.16,43,90,598 ఖర్చయిందనీ, దీన్ని వెంటనే చెల్లించాలని బిల్లును పంపింది. 2019, జనవరి 16 నాటికి కూడా ఈ మొత్తాన్ని చెల్లించలేదని పేర్కొంది. ఈ మొత్తం ఖర్చును ఉత్తర రైల్వే 'సబ్సిడీ క్లెయిమ్–సిబ్బంది ఖర్చుల' కింద చూపింది. కాగా, ఈ బిల్లును పరిశీలించేందుకు నోట్‌ను కేంద్ర ఆర్థికశాఖకు పంపినట్లు తెలిసింది.



ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ 'యంగ్ ఇండియా అధికార్ మార్చ్' పేరిట ఢిల్లీలోఎర్రకోట నుంచి పార్లమెంట్ వరకు ర్యాలీగా బయల్దేరిన విద్యార్థులు. 50కి పైగా సంస్థలకు చెందిన యువకులు ర్యాలీలో పాల్గొన్నారు.

మోదీ పిరికి వ్యక్తి: రాహుల్

తనతో చర్చకు భయపడుతున్నారన్న కాంగ్రెస్ అధ్యక్షుడు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ పిరికివాడని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ వ్యాఖ్యానించారు. రాఫెల్ అంశంతోపాటు జాతీయ భద్రతపై తనతో కనీసం 5 నిమిషాల ముఖాముఖి చర్చకు వచ్చేందుకు మోదీ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ మైనారిటీ విభాగం సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. 'గత ఐదేళ్లుగా మోదీతో పోరాడుతున్న నాకు ఆయన అసలు రంగేమిటో తెలిసిపోయింది. ఆయన పిరికి వ్యక్తి. జాతీయ భద్రత, రాఫెల్ అంశాలపై నాతో 5 నిమిషాలు ముఖాముఖి చర్చకు రమ్మనండి' అంటూ సవాల్ విసిరారు. 'మీరంతా కలిసికట్టుగా ఉండి, ఆర్ఎస్ఎస్, బీజేపీ, మోదీని శాయశక్తులా ఎదుర్కోండి. వారు పిరికివాళ్లలా పారిపోతారు' అంటూ కార్యకర్తలకు రాహుల్ పిలుపునిచ్చారు. 'మోదీ అధికారంలో ఉండగా తమ పని తాము చేసుకోలేమంటూ నలుగురు సుప్రీంకోర్టు జడ్జీలు బహిరంగంగా చెప్పారు. సుప్రీంకోర్టు తన విధులను నిర్వర్తించకుండా చేసేది బీజేపీ చీఫ్ అమిత్ షా అని వారు పరోక్షంగా చెప్పారు' అని గుర్తు చేశారు. 'డోక్లాం వద్ద సరిహద్దుల్లోకి చైనా తన బలగాలను మోహరించిన సమయంలోనే ఎటువంటి ఎజెండా లేకుండానే చైనా అధ్యక్షుడితో భేటీకి వెళ్లి మోకరిల్లారు. ఇది చూసి మోదీకి 56 అంగుళాలు కాదు కదా కనీసం 4 అంగుళాల ఛాతీ కూడా లేదని చైనాకు తెలిసిపోయింది' అని ఎద్దేవా చేశారు.



ప్రధానకార్యదర్శిగా తొలిసారి ప్రియాంక

రాహుల్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన సోదరి ప్రియాంక గాంధీ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి హోదాలో గురువారం మొదటిసారిగా హాజరయ్యారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఏర్పాటైన ఈ సమావేశానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జులు హాజరయ్యారు. భేటీలో ముందు వరుసలో రాహుల్, కేసీ వేణుగోపాల్, ఆజాద్, ఖర్గే ఆసీనులు కాగా రాహుల్‌కు దూరంగా కుడివైపు వరుస మధ్యలో జ్యోతిరాదిత్య సింధియా పక్కన ప్రియాంక కూర్చున్నారు. వీరిద్దరూ ఇటీవల ఉత్తరప్రదేశ్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జులుగా నియమితులయిన విషయం తెలిసిందే. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో రాహుల్ చాంబర్ పక్కనే ఉన్న గదిని ప్రియాంకకు, జ్యోతిరాదిత్యకు కలిపి కేటాయించారు. దీని ద్వారా ఎవరూ ఎక్కువ కాదనే సందేశం పంపించడమే ఉద్దేశమని భావిస్తున్నారు. కాగా, శనివారం పీసీసీల చీఫ్‌లు, సీఎల్పీ నేతలతో సమావేశమై వచ్చే ఎన్నికలకు సన్నద్ధతపై రాహుల్ సమీక్షించనున్నట్లు సమాచారం.

ట్రిపుల్ తలాక్ చట్టం రద్దు చేస్తాం

మహిళా కాంగ్రెస్ చీఫ్ సుస్మితా

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్డీయే ప్రభుత్వం తెచ్చిన ట్రిపుల్ తలాక్ చట్టాన్ని రద్దు చేస్తామని ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ చీఫ్ సుస్మితా దేవ్ ప్రకటించారు. ఈ చట్టం ద్వారా ముస్లిం మహిళలు, పురుషుల మధ్య విద్వేష వాతావరణాన్ని ప్రధాని మోదీ సృష్టించారని విమర్శించారు. 'ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం పొందితే ముస్లిం మహిళలకు సాధికారత లభిస్తుందని చాలామంది చెప్పారు. కానీ ముస్లిం పురుషులను జైళ్లలో పెట్టేందుకు ప్రధాని దీన్ని ఓ ఆయుధంగా రూపొందించారు. కాగా, మహిళల సాధికారితకు ఏ ప్రభుత్వం చట్టాన్ని తెచ్చినా మేం సమర్థిస్తాం. ట్రిపుల్ తలాక్ బిల్లును వ్యతిరేకించిన ముస్లిం మహిళలను అభినందిస్తున్నా' అని అన్నారు.

మా ఆదేశాలనే ధిక్కరిస్తారా?

- సీబీఐ మాజీ చీఫ్ నాగేశ్వరరావుపై సుప్రీం ఆగ్రహం
- కోర్టు ధిక్కరణ నోటీసులు





న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్‌గా ఉన్నకాలంలో బిహార్‌లో షెల్టర్ హోం కేసుల దర్యాప్తు అధికారిని మార్చడంపై నాగేశ్వరరావుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కింద ఆయనకు నోటీసులిచ్చింది. 12వ తేదీన స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలంది. బిహార్‌లోని ముజఫర్‌పూర్‌తోపాటు 16 చోట్ల నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల నిర్వహణ తీరుపై ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ముజఫర్‌పూర్ లైంగిక వేధింపుల కేసుల విచారణ అధికారి ఏకే శర్మను సీబీఐ తాత్కాలిక చీఫ్ నాగేశ్వరరావు జనవరి 17న బదిలీ చేసిన అంశం వెలుగు చూసింది. దీంతో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విచారణ పూర్తయ్యేదాకా అధికారిని మార్చరాదంటూ తామిచ్చిన ఆదేశాలను బేఖాతరు చేయడంపై మండిపడింది. ఈ బదిలీ వ్యవహారంతో సంబంధమున్న అధికారులతోపాటు సీబీఐ దర్యాప్తు బృందానికి ఇన్‌చార్జిగా ఉన్న బాసురాం సైతం కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది.

బిహార్ ప్రభుత్వంపై అసంతృప్తి

బిహార్‌లోని ఆశ్రమ పాఠశాలల సంఖ్య, వాటి నిర్వహణ, ప్రభుత్వ పాత్రపై ధర్మాసనం పలు ప్రశ్నలు సంధించింది. ప్రభుత్వ న్యాయవాది సమాధానాలు సంతృప్తికరంగా లేకపోవడంతో మండిపడింది. 'జరిగిందేదో జరిగి పోయింది. బాలలను ఇలా చూడటం ఇకపై జరగకూడదు' అంటూ వ్యాఖ్యానించింది. ఈ కేసు విచారణను పట్నా నుంచి దేశ రాజధాని సాకేత్ జిల్లా కాంప్లెక్స్‌లో ఉన్న పోక్సో కోర్టుకు బదిలీ చేస్తున్నట్లు తెలిపింది.

శత్రుదుర్భేద్యంగా రాష్ట్రపతి, ప్రధాని విమానాలు

భారత్‌కు ఆధునిక క్షిపణి నిరోధక వ్యవస్థలను అమ్మేందుకు అమెరికా అంగీకారం



వాషింగ్టన్: అత్యాధునిక క్షిపణి నిరోధక రక్షణ వ్యవస్థలు రెండింటిని భారత్‌కు విక్రయించేందుకు అగ్రరాజ్యం అమెరికా ఆమోదం తెలిపింది. ఈ రెండింటి విలువ సుమారు రూ.1,355 కోట్లుగా ఉండనుంది. ఈ కొనుగోళ్ల ద్వారా రాష్ట్రపతి, ప్రధాని ప్రయాణించే విమానాలకు అత్యంత పటిష్టమైన రక్షణ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. లార్జ్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇన్‌ఫ్రారెడ్ కౌంటర్‌మెజర్స్, సెల్ఫ్ ప్రొటెక్షన్ సూట్స్‌గా పిలిచే ఈ వ్యవస్థల అమ్మకానికి సంబంధించి ట్రంప్ ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు అమెరికా డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ తెలిపింది. భారత రాష్ట్రపతి, ప్రధాని ప్రయాణించే ఎయిరిండియా వన్ విమానాలకు ఈ ఆధునిక వ్యవస్థలను అమర్చితే అమెరికా అధ్యక్షుడి ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంతో సమానమైన పటిష్టమైన భద్రత కలుగుతుంది. ఈ వ్యవస్థలను అమర్చేందుకు 2 బోయింగ్–777 ఈఆర్ విమానాలను ఎయిరిండియా నుంచి కొననున్నారు. ప్రమాద సమయంలో మధ్యశ్రేణి క్షిపణి వ్యవస్థలపై దానంతటదే ప్రతిదాడి చేయడం ఈ వ్యవస్థ ప్రత్యేకతల్లో ఒకటి. ఈ కొనుగోళ్లలో ప్రధాన కాంట్రాక్టర్ బోయింగ్ కంపెనీ.

భారత విద్యార్థులతో గౌరవంగా వ్యవహరించండి

ఇమ్మిగ్రేషన్ అధికారులకు అమెరికా కాంగ్రెస్ సభ్యుల లేఖ

వాషింగ్టన్: అమెరికాలోని ఫార్మింగ్టన్ విశ్వవిద్యాలయం వ్యవహారంలో అరెస్టయిన 129 మంది భారతీయ విద్యార్థులకు న్యాయ సహాయం అందించాలని రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీలకు చెందిన పలువురు ప్రముఖ నేతలు అధికారుల్ని కోరారు. వీరిపట్ల గౌరవంగా, మానవీయతతో వ్యవహరించాలని సూచించారు. ఈ మేరకు భారత సంతతి కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి, థామస్ సౌజ్జి, రాబ్ వూడల్, బ్రెండా లారెన్స్ తదితరులు హోంల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్ఎస్)తో పాటు యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ)కు లేఖ రాశారు. అమెరికాలో అక్రమ మార్గాల్లో స్థిరపడేందుకు విదేశీయులకు సాయంచేస్తున్న వారిని పట్టుకోవడానికి హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారులు 2017లో ఫార్మింగ్టన్ అనే నకిలీ వర్సిటీని గ్రేటర్ డెట్రాయిట్ ప్రాంతంలో స్థాపించారు. ఈ స్టింగ్ ఆపరేషన్‌లో భాగంగా దాదాపు 129 మంది భారతీయ విద్యార్థులను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సభ్యులు స్పందిస్తూ.. అరెస్టయిన భారతీయులకు చట్ట ప్రకారం అన్ని హక్కులు కల్పించాలనీ.. తమ న్యాయవాదిని కలుసుకునేందుకు అనుమతించాలని లేఖలో కోరారు.

నా భార్యను చంపేయాలి!

- కిరాయి హంతకుడిగా భావించి పోలీసుకే సుపారీ
- అమెరికాలో భారతీయుడి అరెస్ట్

వాషింగ్టన్: విడాకుల విషయంలో భార్యతో విసిగిపోయిన ఓ భారత సంతతి వ్యక్తి ప్రియురాలితో కలిసి ప్లాన్ వేశాడు. కిరాయి హంతకుడితో చంపించాలనుకున్నారు. కానీ పోలీసులు దొరికిపోయారు. అమెరికాలోని ఇండియానాకు చెందిన నర్సన్ లింగాల(55) తన భార్య నుంచి విడిపోయి ఉంటున్నాడు. అతనికి సంధ్యారెడ్డి(52) అనే ప్రియురాలు ఉంది. ఈ నేపథ్యంలో మిడిలెసెక్స్ కౌంటీ కోర్టు హౌస్‌లో 2018, జూన్‌లో ఓ కేసు విచారణ సందర్భంగా 'నా మాజీ భార్యను చంపాలి. నీకు ఎవరైనా కిరాయి హంతకుడు తెలుసా?' అని సహచర ఖైదీని నర్సన్ అడిగాడు. నర్సన్‌తో సరే అని చెప్పినా, తర్వాత ఆ విషయాన్ని ఆ ఖైదీ జైలు ఉన్నతాధికారులకు చేరవేశాడు. దీంతో ఓ అండర్‌కవర్ ఏజెంట్ రంగంలోకి దిగాడు. గతేడాది ఆగస్టులో కిరాయి హంతకుడిలా వచ్చిన పోలీస్ అధికారిని న్యూజెర్సీలోని ఓ షాపింగ్ మాల్‌లో నర్సన్, సంధ్య కలిశారు. 'నా జీవితం నుంచి ఆమె(మాజీ భార్య) శాశ్వతంగా వెళ్లిపోవాలి. ఇక ఎప్పుడూ తిరిగి రాకూడదు' అని నర్సన్ అతడితో చెప్పాడు. ఈ సందర్భంగా భార్య పూర్తి వివరాలను అందించాడు. ఇందుకోసం ఎంత ఖర్చవుతుందని నర్సన్ అడగ్గా..'దాదాపు 10,000 డాలర్లు ఖర్చవుతుంది. ముందే డౌన్‌పేమెంట్ ఇవ్వాలి'అని అధికారి అన్నాడు. దీంతో ముందు వెయ్యి డాలర్లు ఇస్తానని నర్సన్ చెప్పాడు. ఈ వ్యవహారం మొత్తాన్ని రహస్య కెమెరాల ద్వారా పోలీసులు రికార్డు చేశారు. డీల్ ముగిసిన వెంటనే పోలీసులు నర్సన్, సంధ్యలను అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ నేరం రుజువయితే వీరిద్దరికీ పదేళ్ల జైలుశిక్షతో పాటు 2.50 లక్షల డాలర్ల జరిమానా విధించే అవకాశముంది.



ప్రియురాలు సంధ్యారెడ్డితో నర్సన్(ఫైల్)

మళ్లీ ఈడీ ముందుకు వాద్రా

మనీల్యాండరింగ్ కేసులో రెండోరోజూ హాజరు

న్యూఢిల్లీ: మనీ ల్యాండరింగ్ కేసులో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ బావ రాబర్ట్ వాద్రా వరుసగా రెండో రోజు గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు హాజరయ్యారు. ముగ్గురు అధికారులు వాద్రాను దాదాపు 9 గంటలకుపైగా ప్రశ్నించారు. లండన్‌లో ఆస్తుల కొనుగోలు వ్యవహారంలో బుధవారం వాద్రా ఇచ్చిన సమాధానాలపై సంతృప్తిచెందకపోవడంతో రెండు రోజు విచారణకు పిలిచింది. తొలిరోజు మాదిరిగానే రెండో రోజు కూడా ఆయన వాంగ్మూలాన్ని అధికారులు నమోదుచేశారు. బికనీర్ భూకుంభకోణానికి సంబంధించి మరో మనీ ల్యాండరింగ్ కేసులో వాద్రా ఈ నెల 12న జైపూర్‌లో మళ్లీ ఈడీ విచారణకు హాజరుకానున్నారు.

మరో కేసులో కార్తీ చిదంబరం

ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం కూడా గురువారం ఈడీ విచారణ ఎదుర్కొన్నారు. రాజకీయ కుటుంబాలకు చెందిన ఇద్దరు ప్రముఖులు ఒకేరోజు విచారణకు రావడంతో ఢిల్లీలోని జామ్‌నగర్ హౌజ్ ఈడీ కార్యాలయంలో కోలాహలం నెలకొంది. ఆ ప్రాంగణంలో ఢిల్లీ పోలీసులు, ఐటీబీపీ సిబ్బందిని మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. మీడియా ప్రతినిధులను నియంత్రించడానికి బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఉదయం 11 గంటలకు కార్తీ ఈడీ కార్యాలయానికి చేరుకోగా, 11.25 గంటలకు వాద్రా వచ్చారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసుకే సంబంధించి పి.చిదంబరంను శుక్రవారం విచారించే అవకాశాలున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి.



మాల్యాతో తల్వార్‌కు సంబంధాలు: ఈడీ

బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగవేసి విదేశాలకు పరారైన వ్యాపారవేత్త విజయ్ మాల్యాతో కార్పొరేట్ మధ్యవర్తి దీపక్ తల్వార్‌కు సంబంధాలు ఉన్నాయని ఈడీ ఢిల్లీ కోర్టుకు తెలిపింది. విదేశాల్లో ఉన్న తల్వార్ కొడుకు ఫిబ్రవరి 11న తమ ముందు విచారణకు హాజరవుతున్నారని, ఇద్దరిని కలిపి ప్రశ్నించాల్సి ఉందని వెల్లడించింది. తల్వార్ కస్టడీని వారం పాటు పొడిగించాలని కోరగా కోర్టు ఫిబ్రవరి 12 వరకు అనుమతిచ్చింది.

కొలీజియం ఓ రహస్య బృందం: జస్టిస్ ఏపీ షా



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు కొలీజియం అనేది జవాబుదారీతనం, పారదర్శకత అంటూ లేని 'ఓ రహస్య బృందం' అని లా కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ అజిత్ ప్రకాశ్ షా అన్నారు. జడ్జీలపై వచ్చే ఫిర్యాదులకు సంబంధించి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. 'న్యాయవ్యవస్థ స్వతంత్రంగా పనిచేయాలంటే జడ్జీల ఎంపిక పారదర్శకంగా ఉండాలి. జడ్జీలను ఎంపిక చేసే కొలీజియం ఒక రహస్య గ్రూపు మాదిరిగా తయారైంది. అది అనుసరించే విధానాలు ఆశించిన ప్రయోజనాలను ఏమాత్రం నెరవేర్చడం లేదు' అని అన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
8-2-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	4 ▼	36,971
నిఫ్టీ	7 ▲	11,069

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి


విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

నాస్‌డాక్	7,261	▼ 114
డోజోన్స్	25,070	▼ 320
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,093	▼ 79
డాక్స్	11,022	▼ 303
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,618	▲ 34
నికాయ్	20,751	▼ 123

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	70.75	72.5
£	బ్రిటన్ పౌండ్	91.5	93.75
€	యూరో	80.35	82.35
¥	జపాన్ ఎన్ (100)	63.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	49.95	52.2
SS	సింగపూర్ డాలర్	51.15	54.5
SAR	సౌదీ రియాల్	17.7	20.8
UAE D	యూఏఈ దిర్హామ్	--	--
¥	చైనా యువాన్	9.5	11.25



చౌకగా రుణాలు...

ఆర్‌బీఐ రెపో రేటును 6.5 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించడం, తన విధానాన్ని తటస్థానికి మార్చడం ఆర్థిక రంగానికి బలాన్నిస్తుంది. చిన్న వ్యాపారులకు, ఇళ్ల కొనుగోలుదారులకు చౌకగా రుణాలు లభించేందుకు తోడ్పడుతుంది. ఇది ఉద్యోగ అవకాశాలకూ మరింత ఊతమిస్తుంది.


– పీయూష్ గోయల్, కేంద్ర ఆర్థిక మంత్రి



హౌసింగ్ డిమాండ్ జోరు..

ఈ నిర్ణయం గృహ కొనుగోలు డిమాండ్ పెరుగుదలకు దోహదపడుతుంది. ఆర్‌బీఐ కల్పించిన తాజా వెసులుబాటును బ్యాంకులు కూడా తమ కస్టమర్లకు బదలాయిస్తాయని భావిస్తున్నాం. మరోపక్క, రియల్టీ రంగానికి ద్రవ్య లభ్యత పెరుగుదల దిశగా మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– జక్సాయ్ షా, క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్



వ్యాపార వర్గాలకు శుభవార్త...

తాజా పాలసీలో ఆర్‌బీఐ రెపో రేటు తగ్గింపు, దీనితోపాటు 'జాగరూకతతో కూడిన కఠిన వైఖరి' నుంచి 'తటస్థ' దిశగా తన పాలసీ వైఖరిని మార్చుకోవడం పారిశ్రామిక రంగానికి శుభవార్తలు. వ్యవస్థలో వినియోగం, పెట్టుబడులు రెండూ పెరుగుతాయి. దీనివల్ల వృద్ధి జోందుకుంటుంది.

– రాకేశ్ భారతీ మిట్టల్, సీఐఐ ప్రెసిడెంట్



మరింత తగ్గే సంకేతాలు...

దేశంలో ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. దీంతో రేట్ల కోతకు వెసులుబాటు లభించింది. రానున్న కొద్దికాలంపాటు ధరలు కట్టడిలో ఉండే అవకాశాల నేపథ్యంలో రేటు మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయని ఆర్‌బీఐ పరపతి విధానం స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది.

– రజనీష్ కుమార్, ఎస్‌బీఐ చీఫ్

రుణాలిక. బిం'దాస్'!



రెపో రేటు పావు శాతం తగ్గించిన ఆర్‌బీఐ

రివర్స్ రెపో కూడా ఇదే స్థాయిలో..; 18 నెలల తర్వాత తొలి కోత

ఇకపై తటస్థ పరపతి విధానానికి సెంట్రల్ బ్యాంకు

కొత్త గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో ఎంపీసీ కీలక నిర్ణయాలు

గృహ, వాహన, కార్పొరేట్ రుణాలపై వడ్డీ రేటు తగ్గే అవకాశం

ముంబై: ఆర్‌బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ వృద్ధికే తన ప్రథమ ప్రాధాన్యం అని సంకేతమిచ్చారు. ధరలు తమ లక్ష్యానికి అనుగుణంగా స్థిరపడితే సమయానుకూలంగా వ్యవహరిస్తామంటూ అవసరానికి అనుగుణంగా భవిష్యత్తులోనూ రేట్ల కోతకు అవకాశాలు ఉంటాయని పరోక్షంగా సంకేతమిచ్చారు. ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్ట స్థాయిలకు దిగి రావడం, మరోవైపు రుణాలు భారంగా మారాయని, వడ్డీ రేట్లు తగ్గించాలంటూ పారిశ్రామిక రంగం, ప్రభుత్వం నుంచి వచ్చిన డిమాండ్లను మన్నించారు. బడ్జెట్‌లో తాయిలాలతో తిరిగి ద్రవ్యోల్బణానికి రెక్కలు వస్తాయన్న ఆందోళనలు ఉన్నప్పటికీ.. పరిమితంగా పావు శాతం రేట్లను తగ్గించి ఉపశమనం కల్పించారు. 18 నెలల తర్వాత మళ్లీ ఆర్‌బీఐ వడ్డీ రేటను తగ్గించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

ఆర్‌బీఐ కొత్త గవర్నర్ శక్తికాంతదాస్ తన ఆధ్వర్యంలో జరిగిన మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) తొలి భేటీలో (ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆరవ ద్వైమాసిక సమావేశం) అందరినీ ఆశ్చర్యపరుస్తూ కీలక రెపో, రివర్స్ రెపో రేట్లను పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో రెపో రేటు 6.25 శాతానికి, రివర్స్ రెపో 6 శాతానికి దిగొచ్చాయి. క్రమానుగత కఠిన విధానాన్ని ఇప్పటి వరకు అనుసరిస్తుండగా, దీన్ని తటస్థానికి (న్యూట్రల్‌కు) సడలించారు. ఈ నిర్ణయాలతో ఇంటి రుణాలు, ఇతర రుణాలు చౌకగా మారనున్నాయి. ఈఎంఐల భారం తగ్గనుంది. కీలకమైన సార్వత్రిక ఎన్నికల ముందు రుణాల వితరణకు, ఆర్థిక ఉద్దీపనానికి ఆర్‌బీఐ నిర్ణయాలు వీలు కల్పించనున్నాయి. గతానికి భిన్నంగా... ఆర్‌బీఐ గవర్నర్‌గా వచ్చిన తర్వాత శక్తికాంతదాస్ వివిధ రంగాల ప్రతినిధులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి కోర్కెల గురించి తెలుసుకున్నారు. ద్రవ్యోల్బణం చాలా కనిష్ట స్థాయిల్లో ఉండడం, వృద్ధి రేటు ఆశించినంత లేకపోవడంతో వడ్డీ రేట్లలో కోత విధించొచ్చని ఎక్కువ మంది భావించారు. కానీ, మధ్యంతర బడ్జెట్‌లో రైతులకు ప్రకటించిన ప్యాకేజీ, ఆదాయపన్ను మినహాయింపుల వంటి ప్రోత్సాహకాలతో వినియోగం పెరిగి ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపిస్తుందన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆర్‌బీఐ ఎంపీసీ రేట్లను తగ్గించకపోవచ్చని, తటస్థానికి తన విధానాన్ని మార్చొచ్చన్న అభిప్రాయాలూ వినిపించాయి. కానీ, బడ్జెట్‌కు ముందు వ్యక్తమైన అంచనాలను దాస్ నిజం చేశారు. రేట్ల కోత విధింపునకు ఆరుగురు సభ్యుల ఎంపీసీలో ఆర్‌బీఐ గవర్నర్ సహా నలుగురు అనుకూలంగా ఓటేశారు. తటస్థ విధానానికి మారేందుకు మాత్రం ఆరుగురు అంగీకారం తెలిపారు. 2014 జనవరి 28న కీలక రేట్ల పెంపు తర్వాత నుంచి... రేట్లు తగ్గుతూ వచ్చాయి. దీనికి విరామం పలుకుతూ 2018 జూన్, ఆగస్ట్ సమావేశాల్లో ఆర్‌బీఐ ఎంపీసీ కీలక రేట్లను పావు శాతం చొప్పున పెంచింది. ఈ మధ్య కాలంలో అంటే 2014 జనవరి నుంచి 2018 జూన్‌లోపు ఆరు సార్లు వడ్డీ రేట్లను తగ్గించడం జరిగింది.

వృద్ధి కోసమే కోత...

''పెట్టుబడుల ధోరణి పుంజుకుంటోంది. అయితే, ఇది ప్రధానంగా ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై వెచ్చిస్తున్న నిధుల వల్లే. ప్రైవేటు పెట్టుబడులను, ప్రైవేటు వినియోగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. మధ్య కాలానికి ద్రవ్యోల్బణాన్ని 4 శాతం స్థాయిలో కొనసాగించాలన్న లక్ష్యానికి లోబడే వృద్ధికి మద్దతు ఇచ్చేందుకు రేట్ల కోత చేపట్టడం జరిగింది'' అని ఆర్‌బీఐ పరపతి విధాన కమిటీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బోణీ
రుణ రేటు తగ్గింపు..



ముంబై: ఆర్‌బీఐ రేట్లు తగ్గించిన కొన్ని గంటల వ్యవధిలోనే బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ లెండింగ్ రేటును 0.05 శాతం తగ్గిస్తూ నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే, ఆరు నెలల కాల వ్యవధి కలిగిన రుణాలకే ఇది వర్తిస్తుందని తెలిపింది. ఏడాది సహా మిగిలిన కాల వ్యవధి రుణాలకు ఇంతకుముందు రేట్లే అమలవుతాయి. ఆరు నెలల రుణాలకు ఇక 8.55 శాతం రేటును బ్యాంకు అమలు చేస్తుంది.

పాలసీ ముఖ్యాంశాలు...

- ❒ రెపో రేటు 6.5 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గింపు. రివర్స్ రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గింపు. బ్యాంకు రేటు 6.5 శాతం.
- ❒ ఆర్‌బీఐ నుంచి బ్యాంకులు తీసుకునే రుణాలపై వసూలు చేసే వడ్డీని రెపో రేటుగా పేర్కొంటారు. ఆర్‌బీఐ వద్ద బ్యాంకులు ఉంచే నిధులపై పొందే వడ్డీ రేటును రివర్స్ రెపో రేటుగా వ్యవహరిస్తారు.
- ❒ నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్)లో ఎలాంటి మార్పుల్లేవు. 4 శాతంగానే కొనసాగుతుంది.
- ❒ వడ్డీ రేట్ల తగ్గింపునకు శక్తికాంతదాస్ సహా నలుగురు ఎంపీసీ సభ్యులు అనుకూలంగా ఓటు. చేతన్‌ఘటే, విరాళ్ ఆచార్య యథాతథానికి ఓటు.
- ❒ రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలు 2019 జనవరి–మార్చి త్రైమాసికానికి 2.8 శాతానికి తగ్గింపు. 2019–20 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలకు(ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలానికి) 3.2–3.4 శాతంగా అంచనా. అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి అంచనా 3.9 శాతం.
- ❒ జీడీపీ వృద్ధి రేటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతంగా ఉండొచ్చు. 2019–20లో ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య 7.2–7.4 శాతంగాను, అక్టోబర్–డిసెంబర్ కాలానికి 7.5 శాతంగానూ ఉండొచ్చు.
- ❒ చమురు ధరల్లో అస్పష్టత ఉండొచ్చు. వాణిజ్య ఉద్రిక్తతలు ప్రపంచ వృద్ధి అవకాశాలపై ప్రభావం చూపిస్తాయి.
- ❒ వ్యవసాయ రుణాలు, ప్రాంతీయ అసమానత, కవరేజీ విస్తృతికి ఓ అంతర్గత కమిటీ ఏర్పాటు.
- ❒ రూపాయి విలువలో స్థిరత్వానికి ఆఫ్‌షోర్ రూపీ మార్కెట్ల కోసం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు.
- ❒ కార్పొరేట్ డెట్ మార్కెట్లో పెట్టుబడుల విషయంలో ఎఫ్‌పీఐలపై ఉన్న నియంత్రణలు ఎత్తివేత.
- ❒ పేమెంట్ గేట్‌వే సర్వీసు ప్రొవైడర్లు, పేమెంట్ అగ్రిగేటర్లకు సంబంధించి త్వరలో చర్చా పత్రం విడుదల.
- ❒ కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు ఖర్చు చేసే ఆదాయాన్ని పెంచడం ద్వారా డిమాండ్‌కు ఊతమిస్తాయి.
- ❒ ఎన్‌బీఎఫ్‌సీల సమన్వయానికి త్వరలో మార్గదర్శకాలు.
- ❒ ఆర్‌బీఐ తదుపరి ఎంపీసీ భేటీ వచ్చే ఏప్రిల్ 2న జరగనుంది.

మరో రేటు కోత అంచనా!

తాజా రేటు తగ్గింపు వృద్ధికి దోహదపడే అంశమని పలు వర్గాలు, విశ్లేషకులు పేర్కొంటున్నారు. దీనితోపాటు త్వరలో మరో దఫా రేటు కోత తథ్యమని మెజారిటీ విశ్వసిస్తోంది. తాజా పాలసీపై పలువురి అభిప్రాయాలు ఇలా...



తటస్థ వైఖరి... సానుకూలం

పాలసీపై 'తటస్థం' దిశగా ఆర్‌బీఐ అడుగులు వేయడం ప్రస్తుత పరిస్థితుల్లో వృద్ధికి తగిన సానుకూలతను సృష్టిస్తోంది. ధరలు పెరక్కపోతే మరో కోతకు చాన్సుంది.

– అభీక్ బారువా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్



రెండు కీలక నిర్ణయాలు

ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాలతో రైతులకు మరింత రుణం అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల రైతుల రుణ సమస్యలు కొంత తీరుతాయి. ఇక వ్యవస్థలో మొత్తంగా రుణ డిమాండ్ పెరుగుతుంది.

– దినేష్ ఖేరా, ఎస్‌బీఐ ఎండీ



వేచి చూడాల్సి ఉంది

వృద్ధికి తాజా పాలసీ కొంత అవకాశం కల్పించింది. అయితే పూర్తి ఫలితానికి వేచి చూడాల్సి ఉంటుంది. ద్రవ్యలోటుసహా పలు అంశాలపై వృద్ధి జోరు ఆధారపడి ఉంటుంది.

– ప్రజుల్ భండారీ, హెచ్‌ఎస్‌బీసీ (ఇండియా) చీఫ్ ఎకనమిస్ట్



మరింత తగ్గింపు ఉండవచ్చు

ఆర్‌బీఐ నిర్ణయం హర్షణీయం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్న ప్రస్తుత తరుణంలో రేటు తగ్గింపు మరో విడత ఉండవచ్చని భావిస్తున్నాం. పెట్టుబడులు, వినియోగం పెరుగుదలకు ఇది అవసరం.

– సందీప్ సోమానీ, ఫిక్కీ ప్రెసిడెంట్



ఏప్రిల్‌లో మరో కోత

ఏప్రిల్‌లో మరో దఫా రేటు కోత ఉండే అవకాశం ఉంది. ద్రవ్యోల్బణం తక్కువగా ఉండడం, పారిశ్రామిక వృద్ధి మందగమనం దీనికి కారణం. ఆర్‌బీఐ నిర్ణయాలు వ్యవస్థలో లిక్విడిటీని పెంచుతున్నాయి.

– రాధికారావు, డీబీఎస్ ఎకనమిస్ట్




బ్యాంకింగ్ రంగానికి సానుకూలం

శక్తికాంతదాస్ మొదటి పాలసీ బ్యాంకింగ్‌పై పెద్ద స్థాయిలో సానుకూల ప్రభావం చూపుతుంది. వ్యవస్థలో రుణ వృద్ధికి అలాగే మొత్తంగా ఆర్థిక వ్యవస్థ పురోగతికి దోహదపడే నిర్ణయం ఇది.

– సునిల్ మెహతా, ఐబీఏ చైర్మన్

రిజర్వ్ బ్యాంక్ పాలసీ రేట్లు ఇలా...



కుదిరితే మరిన్ని కోతలు

ధరలు తగ్గుముఖం పట్టడంతో అన్ని రంగాలకు రుణాల వృద్ధి కోసమే రేట్లను పావుశాతం మేర తగ్గించామని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఎంపీసీ విధాన ప్రకటన తర్వాత మీడియాతో పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం అంచనాల పరిధిలోనే తక్కువగా ఉంటే భవిష్యత్తులో మరిన్ని రేట్ల కోతలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆర్‌బీఐ చట్ట నిబంధనల పరిధిని మించి ఎంపీసీ ఏమీ చేయలేదని స్పష్టం చేశారు. ''వచ్చే 12 నెలల కాలంలో ద్రవ్యోల్బణం 3.9 శాతం పరిధిలో... గరిష్టంగా 4 శాతం లేదా అంతకులోపు ఉంటే రేట్ల తగ్గింపును పరిశీలించే అవకాశం ఉంటుంది''అని దాస్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో ప్రతిపాదనల వల్ల ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణంపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే కొత్త ద్రవ్యోల్బణం అంచనాలకు వచ్చినట్టు చెప్పారు.

గవర్నర్ దాస్ స్పష్టీకరణ



లిక్విడిటీ సమస్య లేదు

వ్యవస్థలో లిక్విడిటీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, కీలకమైన ఏ రంగానికీ నిధుల లభ్యత (లిక్విడిటీ) సమస్య లేదని శక్తికాంతదాస్ తెలిపారు. అవసరమైనప్పుడు తగినన్ని నిధులను అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంవో) ద్వారా వ్యవస్థలోకి రూ.2.36 లక్షల కోట్లను తీసుకొచ్చామని, ఫిబ్రవరి నెలలో రూ.37,500 కోట్లను తీసుకురానున్నట్టు ఇప్పటికే ప్రకటించిన విషయాన్ని విరాళ్ ఆచార్య గుర్తు చేశారు.

ఎన్‌పీఏ నిబంధనల్లో మార్పుల్లేవు

రుణ చెల్లింపుల్లో ఒక్కరోజు విఫలమైనా ఎన్‌పీఏలుగా గుర్తించాలన్న 2018 ఫిబ్రవరి 12 నాటి ఉత్తర్వుల్లో ఎటువంటి మార్పులను చేయడం లేదని శక్తికాంతదాస్ స్పష్టం చేశారు. ఇప్పటికైతే ఇందుకు సంబంధించి ఎటువంటి ప్రతిపాదనా లేదన్నారు. నాటి ఉత్తర్వుల మేరకు బ్యాంకులు నిర్ణీత గడువులోపు రుణ చెల్లింపులు చేయని ఖాతాల విషయంలో నిర్ణీత వ్యవధిలోపు పరిష్కారం చూడడం, విఫలమైతే ఐబీసీ చట్టం కింద ఎన్‌సీఎల్‌టీకి నివేదించడం చేయాల్సి ఉంటుంది.

మధ్యంతర డివిడెండ్... న్యాయబద్ధమే

ప్రభుత్వం ఆర్‌బీఐ నుంచి మధ్యంతర డివిడెండ్‌ను కోరడం చట్టబద్ధమేనని, ఈ నిధులను దేనికి వినియోగించుకోవాలన్నది ప్రభుత్వ ఇష్టమేనని దాస్ చెప్పారు. ఆర్‌బీఐ నుంచి మరిన్ని నిధులను బదిలీ చేయాలన్న ప్రభుత్వ డిమాండ్లతోనే ఉర్జిత్ పటేల్ గవర్నర్ పదవి నుంచి తప్పుకున్నట్టు అప్పట్లో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ''మిగులు నిధులు లేదా మధ్యంతర డివిడెండ్‌ను ప్రభుత్వానికి చెల్లించడం అన్నది ఆర్‌బీఐ చట్టం పరిధిలోనిదే. ఈ చట్టపరమైన నిబంధనలను దాటి మేమేమీ చేయడం లేదు'' అని దాస్ స్పష్టం చేశారు.

చందాకొచర్‌పై నిర్ణయం దర్యాప్తు సంస్థలదే...

ఐసీఐసీఐ బ్యాంకు మాజీ సీఈవో చందాకొచర్ వ్యవహారంలో దాస్ తొలిసారి స్పందించారు. ఈ కేసులో చర్యలు తీసుకోవడం దర్యాప్తు సంస్థల పరిధిలోనే ఉందన్నారు. నిబంధనలను వ్యక్తులు లేదా గ్రూపు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే విషయంలో ఆర్‌బీఐ పాత్ర పరిమితమేనన్నారు. ఒకవేళ ఏదైనా అంశాల్లో దర్యాప్తు అవసరం అయితే తదుపరి చర్యల అధికారం వారి పరిధిలోనే ఉంటుందని స్పష్టం చేశారు.

సాగు రంగానికి వెసులుబాటు



హామీల్లేకుండా వ్యవసాయానికి ఇచ్చే రుణాల పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.1.6 లక్షలకు పెంచుతూ ఆర్‌బీఐ ఎంపీసీ నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ రంగానికి రుణాల పరిస్థితిని సమీక్షించి ఆచరణాత్మక విధానాన్ని సూచించేందుకు ఓ అంతర్గత వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేయనుంది. గత కొన్నేళ్లలో వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీ వృద్ధి గణనీయంగా ఉన్నప్పటికీ... ఈ రుణాల పంపిణీ విషయంలో ప్రాంతాల మధ్య అంతరాలు, కవరేజీ విస్తృతి వంటి సమస్యలు ఉన్నట్టు ఆర్‌బీఐ పేర్కొంది. ఈ అంశాలను ఆర్‌బీఐ వర్కింగ్ గ్రూపు పరిగణనలోకి తీసుకోనుంది.

డిపాజిట్లకు నిర్వచనంలో మార్పు



బ్యాంకులకు డిపాజిట్ల సమీకరణ విషయంలో ఆర్‌బీఐ కొంత స్వేచ్ఛ కల్పించింది. ప్రస్తుతం రూ.కోటి ఆపై మొత్తాలను బల్క్ డిపాజిట్లుగా పరిగణిస్తుంటే, దీన్ని రూ.2 కోట్లు, అంతకంటే ఎక్కువకు మార్చింది. బ్యాంకులు చిన్న డిపాజిట్ల కంటే బల్క్ డిపాజిట్లపై కొంత మేర అదనపు వడ్డీని ఆఫర్ చేస్తుంటాయి. బ్యాంకులు తమ అవసరాలు, ఆస్తులు, అప్పుల నిర్వహణ సమతుల్యత కోసం బల్క్ డిపాజిట్లపై భిన్నమైన రేటును ఆఫర్ చేసే స్వేచ్ఛ వాటికి ఉంటుంది. అర్బన్ కోపరేటివ్ బ్యాంకులకు అంబ్రెల్లా ఆర్గనైజేషన్ ఏర్పాటుకు త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది.

దివాలా ప్రక్రియలో పాల్గొనే బిడ్డర్లకు ఈసీబీ సదుపాయం



దివాలా అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) పరిధిలోని కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ (సీఐఆర్‌పీ)లో పాల్గొనే కంపెనీలు ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్ (ఈసీబీ) మార్గంలో నిధుల సమీకరణకు ఆర్‌బీఐ అవకాశం కల్పించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం విదేశీ కరెన్సీ లేదా రూపాయి మారకంలో ఈసీబీ ద్వారా సమీకరించే నిధులను తిరిగి చెల్లింపులు లేదా రూపాయి మారకంలోని రుణాలను తీర్చివేసేందుకు అనుమతి లేదు.

టాటా మోటార్స్ నష్టాలు రూ.26,961 కోట్లు

- ఇదే అత్యధిక త్రైమాసిక నష్టం
- వరుసగా మూడో క్వార్టర్‌లోనూ నష్టాలే
- కంపెనీ జోరుకు జేఎల్ఆర్ బ్రేకులు

న్యూఢిల్లీ: వాహన దిగ్గజం టాటా మోటార్స్‌కు ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో భారీగా నికర నష్టాలు వచ్చాయి. గత క్యూ3లో రూ.1,215 కోట్ల నికర లాభం రాగా, ఈ క్యూ3లో రూ.26,961 కోట్ల నికర నష్టాలు(కన్సాలిడేటెడ్) వచ్చాయని టాటా మోటార్స్ తెలిపింది. ఒక్క త్రైమాసికంలో ఈ స్థాయి నష్టాలు రావడం కంపెనీ చరిత్రలో ఇదే మొదటిసారి. వరుసగా మూడో క్వార్టర్‌లోనూ కంపెనీ నష్టాలనే ప్రకటించింది. విలాస కార్ల విభాగం, జాగ్వార్ అండ్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) వన్‌టైమ్ అసెట్ ఇంపెయిర్‌మెంట్(రూ.27,838 కోట్లు) కారణంగా ఈ స్థాయిలో నష్టాలు వచ్చాయని వివరించింది. జేఎల్ఆర్ మూలధన పెట్టుబడులకు సంబంధించిన పుస్తక విలువను తగ్గించడానికి ఈ అసాధారణమైన వ్యయాన్ని ప్రకటించామని జేఎల్ఆర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాల్ఫ్ స్పెత్ తెలిపారు. చైనాలో అమ్మకాలు తగ్గడం, తరుగుదల అధికంగా ఉండటం, పెట్టుబడి వ్యయాల అమోర్టైజేషన్ కారణంగా ఈ స్థాయి నికర నష్టాలు వచ్చాయని వివరించారు. వాహన పరిశ్రమ మార్కెట్, సాంకేతిక, విధాన సంబంధిత సమస్యలను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. అంతే కాకుండా కొత్త మోడళ్లు, విద్యుదీకరణ, ఇతర టెక్నాలజీల కోసం పెట్టుబడులు భారీగా పెట్టాల్సి వస్తోందని వివరించారు.

4 శాతం ఎగసిన ఆదాయం....

గత క్యూ3లో రూ.74,338 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో 4 శాతం వృద్ధితో రూ.77,583 కోట్లకు పెరిగిందని టాటా మోటార్స్ తెలిపింది. స్టాండెలోన్ పరంగా చూస్తే, గత క్యూ3లో రూ.212 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.618 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం రూ.16,186 కోట్ల నుంచి రూ.16,477 కోట్లకు ఎగసింది. జేఎల్ఆర్ ఆదాయం 1 శాతం తగ్గి 620 కోట్ల పౌండ్లకు చేరింది. వడ్డీ వ్యయాలు రూ.321 కోట్లు



పెరిగి రూ.1,568 కోట్లకు ఎగిశాయి. జేఎల్ఆర్ రిటైల్ అమ్మకాలు 6% తగ్గి 1,44,602కు, హోల్‌సేల్ అమ్మకాలు 11 శాతం తగ్గి 1,41,552కు చేరాయి. దేశీయంగా అమ్మకాలు 0.5% తగ్గి 1,71,354కు చేరాయి. జేఎల్ఆర్ అంతర్జాతీయ అమ్మకాలు జనవరిలో 11 శాతం తగ్గి 43,733కు పడిపోయాయి. జాగ్వార్ బ్రాండ్ అమ్మకాలు 9 శాతం, ల్యాండ్ రోవర్ అమ్మకాలు 12 శాతం చొప్పున తగ్గాయి.

మార్కెట్ వాటా పెరుగుతోంది...: దేశీయ వ్యాపారం జోరు కొనసాగుతోందని టాటా గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తెలిపారు. తమ మార్కెట్ వాటా పెరుగుతోందని, లాభదాయకత వృద్ధి కూడా పెరుగుతోందని పేర్కొన్నారు. టర్న్ అరౌండ్ 2.0 వ్యూహం మంచి ఫలితాలనిస్తోందని సంతృప్తి వ్యక్తం చేశారు. జేఎల్ఆర్ సమస్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అయితే వ్యాపారం భవిష్యత్తులో బాగుండేలా నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగా, బ్రెగ్జిట్ విషయమై ఎలాంటి ఒప్పందం కుదరలేనందున ఇంగ్లండ్‌లో జేఎల్ఆర్ ప్లాంట్లను 2–3 వారాల పాటు మూసివేయాల్సి వస్తుందని టాటా మోటార్స్ తెలిపింది. బ్రెగ్జిట్‌తో ఉత్పత్తి సంబంధిత సమస్యలు తలెత్తి దీర్ఘకాలంలో జేఎల్ఆర్ లాభదాయకత దెబ్బతింటుందని పేర్కొంది.

మార్కెట్ ముగిసిన తర్వాత ఫలితాలు వెలువడ్డాయి. కంపెనీ షేర్ గురువారం బీఎస్ఈలో 2.6 శాతం లాభపడి రూ.183 వద్ద ముగిసింది. అమెరికాలో ఏడీఆర్ గురువారం ఒకానొకదశలో 10 శాతం క్షీణించి 11.35 డాలర్లను తాకింది.

మార్కెట్ అక్కడక్కడే



- అంచనాలకు అనుగుణంగానే ఆర్‌బీఐ వైఖరి
- ఆశ్చర్యకరంగా రేట్ల కోత
- ఐదు రోజుల పరుగు నేపథ్యంలో లాభాల స్వీకరణ
- 4 పాయింట్ల నష్టంతో 36,971కు సెన్సెక్స్
- 7 పాయింట్లు పెరిగి 11,069కు నిఫ్టీ

అంచనాలకు అనుగుణంగానే ఆర్‌బీఐ పాలసీ వైఖరి మారడం, అనూహ్యాంగా రేట్ల కోత చోటు చేసుకోవడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ చేశారు. దీంతో గురువారం స్టాక్ మార్కెట్ ఒడిదుడుకుల మధ్య ట్రేడై, మిశ్రమంగా ముగిసింది. ఇంట్రాడేలో 197 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్ చివరకు 4 పాయింట్లు నష్టపోయి 36,971 పాయింట్ల వద్ద, నిఫ్టీ 7 పాయింట్లు పెరిగి 11,069 వద్ద ముగిశాయి. ఆర్‌బీఐ పాలసీ నేపథ్యంలో వడ్డీరేట్ల ప్రభావిత షేర్లు ఒడుదుడుకులకు గురై మిశ్రమంగా ముగిశాయి. వాహన షేర్లు లాభపడగా, బ్యాంక్, రియల్టీ షేర్లలో షేర్లు కొన్ని లాభాల్లో, కొన్ని నష్టాల్లో ముగిశాయి. రెపో తగ్గింపువల్ల ఈ ప్రభావితమైన వాహన షేర్లు లాభపడ్డాయి.

273 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...

సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. ఆర్‌బీఐ పాలసీ వెలువడక ముందు వరకూ పరిమిత లాభాల్లో ట్రేడైన స్టాక్ సూచీలు ఆ తర్వాత హెచ్చుతగ్గులకు గురయ్యాయి. డాలర్‌తో రూపాయి మారకం పుంజుకోవడం, ముడి చమురు ధరలు తగ్గడం సానుకూల ప్రభావం చూపించాయి. గత ఐదు రోజుల్లో స్టాక్ మార్కెట్ లాభపడినందున లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. చివరి అరగంటలో అమ్మకాలు జోరుగా సాగాయి. సెన్సెక్స్ ఒక దశలో 197 పాయింట్లు పెరగ్గా, మరో దశలో 76 పాయింట్లు పతనమైంది. మొత్తం మీద రోజంతా 273 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. కాగా అనిల్ కంపెనీల షేర్ల క్షీణత కొనసాగింది.

నేటి నుంచి రిలయన్స్ ఓపెన్ ఆఫర్

డెన్ నెట్ వర్క్స్, జీటీపీఎల్ హాత్‌వే షేర్ల కోసం



రిలయన్స్ ఇండస్ట్రీస్ ఓపెన్ ఆఫర్ నేటి నుంచి ప్రారంభం కానున్నది. డెన్ నెట్‌వర్క్స్, జీటీపీఎల్ హాత్‌వే కంపెనీలను రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన అనుబంధ కంపెనీలు టేకోవర్ చేస్తున్నాయి. ఈ టేకోవర్‌లో భాగంగా జీటీపీఎల్ హాత్‌వేకు చెందిన 25.64 శాతం వాటాకు సమానమైన 2.88 కోట్ల షేర్లను రిలయన్స్ అనుబంధ కంపెనీ ఒక్కో షేర్‌ను రూ.82.65కు కొనుగోలు చేయడానికి ఓపెన్ ఆఫర్‌ను ఇచ్చింది. అలాగే డెన్ నెట్‌వర్క్స్‌కు చెందిన 25.58 శాతం వాటాకు చెందిన 12.21 కోట్ల షేర్లను ఒక్కోటి రూ.72.66 ధరకు ఓపెన్ ఆఫర్‌లో కొనుగోలు చేస్తుంది.

సెప్టెంబర్‌కు ముందే ఇరెడా ఐపీఓ



ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్‌ఈడీఏ) ఐపీఓ ఈ ఏడాది సెప్టెంబర్ కంటే ముందే ఉండనున్నది. ఈ ఐపీఓలో భాగంగా 15 శాతం వాటాకు సమానమైన 13.90 కోట్ల తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తామని ఐఆర్‌ఈడీఏ సీఎండీ కుల్జీత్ సింగ్ పొప్లి తెలిపారు. ఇష్యూ సైజు రూ.750 కోట్ల రేంజ్‌లో ఉండొచ్చని పేర్కొన్నారు.


అంతర్జాతీయ ఐపీ సూచీలో భారత్‌కు 36వ స్థానం

8 స్థానాలు పురోగతి



అంతర్జాతీయ మేధో సంపత్తి హక్కుల (ఐపీ) సూచీలో భారత్ తన స్థానాన్ని గణనీయంగా మెరుగుపరచుకుంది. 2018లో ఈ సూచీ 44 వద్ద ఉండగా, తాజాగా ఇది 8 స్థానాలు మెరుగుపడి 36కు చేరింది. 50 ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై విశ్లేషణ ఆధారంగా ఈ సూచీ రూపొందింది. ఈ సూచీలో అమెరికా, బ్రిటన్, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ దేశాలు మొదటి తొలి ఐదు ర్యాంకుల్లో కొనసాగుతున్నాయి. 45 ప్రమాణాల ప్రాతిపదికన అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ ఇన్నోవేషన్ పాలసీ సెంటర్ (జీఐపీసీ) ఈ సూచీని ఆవిష్కరిస్తుంది. పేటెంట్, ట్రేడ్‌మార్క్, కాపీరైట్, వాణిజ్య రహస్యాల రక్షణ వంటి అంశాలు ఈ 45 ప్రమాణాల్లో ఉన్నాయి. సూచీలో భారత్ సాధించినంత పురోగతి మరేదేశమూ సాధించలేకపోవడం గమనార్హం. భారత విధాన నిర్ణేతలు తీసుకున్న చర్యలే దీనికి కారణమని ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన పేర్కొంది.

ఫోర్టిస్ హెల్త్‌కేర్ సీఈఓగా అశుతోష్ రఘువంశీ



న్యూఢిల్లీ: ఫోర్టిస్ హెల్త్ కేర్ కంపెనీకి సీఈఓగా అశుతోష్ రఘువంశీ నియమితులయ్యారు. ప్రస్తుత సీఈఓ భావదీప్ సింగ్ స్థానాన్ని ఈయన భర్తీ చేయనున్నారు. మార్చి 18 నుంచి పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్లు సంస్థ గురువారం వెల్లడించింది. నారాయణ హృదయాలయకు 18 ఏళ్ల పాటు వివిధ కీలక హోదాల్లో ఈయన సేవలందించినట్లు తెలియజేసింది.

శుక్రవారం బోర్డ్ మీటింగ్స్

మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, బీపీసీఎల్, నాల్కో, సన్ టీవీ నెట్‌వర్క్, యూకో బ్యాంక్, కొచ్చిన్ షిప్‌యార్డ్, దిలిప్ బిల్డ్‌కాన్, ఇంజినీర్స్ ఇండియా, జనరల్ ఇన్సూరెన్స్ ఆఫ్ ఇండియా లీ, ఐనాక్స్ విండ్, జైప్రకాశ్ అసోసియేట్స్, జేకే లక్ష్మీ సిమెంట్, ఆర్‌ఈసీ, ఎస్‌ఎంఎల్ ఇసుజు, థెర్మాక్స్, అబాట్ ఇండియా, అవంతి ఫీడ్స్, మిధాని, ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌డీటీవీ, టీవీ టుడే, వాటెక్ వాబాగ్, వీఐపీ ఇండస్ట్రీస్

కార్పొబ్రీఫ్

మోల్డ్‌టెక్: రిజిడ్ ప్లాస్టిక్ కంటైనర్ల తయారీకై కర్నాటకలోని మైసూరు వద్ద నెలకొల్పిన ప్లాంటును ప్రారంభించింది.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	33,980	▼ 270
బంగారం (22 క్యారెట్లు)	32,360	▼ 260
వెండి (కిలో)	43,300	▼ 300
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	33,140	▼ 300
బంగారం (22 క్యారెట్లు)	31,560	▼ 260
వెండి (కిలో)	43,300	▼ 300
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	33,140	▼ 300
బంగారం (22 క్యారెట్లు)	31,560	▼ 260
వెండి (కిలో)	43,300	▼ 300
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	33,400	▼ 350
బంగారం (22 క్యారెట్లు)	31,200	▼ 20
వెండి (కిలో)	41,100	▼ 400
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	33,950	▼ 110
బంగారం (22 క్యారెట్లు)	31,580	▼ 100
వెండి (కిలో)	41,500	▼ 500
విజయవాడ		
బంగారం(24 క్యారెట్లు)	34,200	▼ 200
బంగారం (22 క్యారెట్లు)	31,400	▼ 100
వెండి (కిలో)	41,100	▼ 300
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	34,120	▼ 280
బంగారం (22 క్యారెట్లు)	31,560	▼ 260
వెండి (కిలో)	41,100	▼ 300

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	52.22 (రాత్రి 11.30కు)	$54.01 (బుధవారం ముగింపు)
బ్రెంట్	61.05 (రాత్రి 11.30కు)	$62.69 (బుధవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 08-02-2019

విశాఖ	420-00
చిత్తూరు	448-00
వరంగల్	411-00
చెన్నై	455-00
ముంబై	462-00
విజయవాడ	411-00
నమక్కల్	440-00
గోదావరి	411-00
07-02-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	409-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.70
బెంగళూరు	440-00
కోల్‌కత్త	443-00
ఢిల్లీ	437-00

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	2,503
ఎన్‌ఎస్‌ఈ	30,955
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	17,97,505
ఎఫ్‌ఐఐ	418
డీఐఐ	294

ఛాలెట్ లిస్టింగ్...స్వల్ప లాభం



ఛాలెట్ హోటల్స్ షేర్ స్వల్ప లాభాలతో స్టాక్ మార్కెట్లో లిస్టయింది. బీఎస్‌ఈలో ఈ షేర్ ఇష్యూ ధర, రూ.280తో పోలిస్తే 3.9 శాతం లాభంతో రూ.291 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో 5.4 శాతం లాభంతో రూ.292 వద్ద గరిష్ట స్థాయిని తాకింది. చివరకు 3.7 శాతం లాభంతో రూ.290 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో 9.45 లక్షల షేర్లు, ఎన్‌ఎస్‌ఈలో 94 లక్షల షేర్లు ట్రేడయ్యాయి. గురువారం మార్కెట్ ముగిసే సమయానికి ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.5,954 కోట్లుగా నమోదైంది. మెట్రో నగరాల్లో లగ్జరీ హోటళ్లు నిర్వహించే ఈ కంపెనీ గత నెల 29–31 మధ్య ఐపీఓకు వచ్చింది.

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
ZEEL	405.7	4.56
SUNPHARMA	433.8	4.13
EICHERMOT	21,855.00	3.56
BAJAJ-AUTO	2,853.65	3.01
GRASIM	754.5	2.86
INFRATEL	304.7	2.82
TATAMOTORS	183.2	2.63
COALINDIA	224	1.84
HEROMOTOCO	2,933.00	1.84
ULTRACEMCO	3,564.45	1.54

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
JSWSTEEL	272.75	-2.35
RELIANCE	1,288.00	-1.7
LT	1,295.15	-1.46
POWERGRID	184.6	-1.18
HDFC	1,965.50	-1.13
HINDALCO	209.2	-1.04
IBULHSGFIN	647.45	-0.98
NTPC	135.9	-0.88
SBIN	287	-0.71
BAJFINANCE	2,692.00	-0.71



హెచ్.సి.హాంగ్‌తో బిగ్ సి టీమ్

‘శామ్‌సంగ్’ టాప్-3లో ‘బిగ్ సి’

భారత్‌లో ఈ బ్రాండ్ ఫోన్ల విక్రయాల్లో జోరు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: శామ్‌సంగ్ మొబైల్స్ విక్రయాల్లో భారత్‌లో టాప్–3 స్థానాన్ని మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చైన్ ‘బిగ్ సి’ దక్కించుకుంది. ఈ సందర్భంగా శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ సౌత్ వెస్ట్ ఆసియా ప్రెసిడెంట్ హెచ్.సి.హాంగ్ హైదరాబాద్‌లోని బిగ్ సి కార్యాలయానికి గురువారం విచ్చేశారు. బిగ్ సి ఫౌండర్ ఎం.బాలు చౌదరిని ప్రత్యేకంగా అభినందించారు. శామ్‌సంగ్ ప్రవేశ పెట్టిన ప్రతి మోడల్ అమ్మకాల్లో 16 ఏళ్లుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో తాము మొదటి స్థానంలో ఉన్నట్టు బాలు చౌదరి వెల్లడించారు. భవిష్యత్తులో కొత్త లక్ష్యాలను చేరుకుంటామన్న ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బిగ్ సి డైరెక్టర్లు వై.స్వప్న కుమార్, జి.బాలాజీ రెడ్డి, కైలాష్ లఖ్యాని పాల్గొన్నారు.

ప్రపంచ బ్యాంక్ కొత్త ప్రెసిడెంట్ డేవిడ్ మాల్పాస్!



వాషింగ్టన్: ప్రపంచబ్యాంక్ కొత్త అధ్యక్షునిగా ప్రముఖ ఆర్థికవేత్త డేవిడ్ మాల్పాస్ పేరును అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారు. 189 సభ్యదేశాలు సభ్యులుగా ఉన్న ప్రపంచబ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ఆమోదంతో ఆయన ఈ బాధ్యతలను చేపట్టగలుగుతారు. ఇది దాదాపు లాంఛనప్రాయమే అయినా, పలు దేశాలు తమ అభ్యర్థుల పేర్లు ప్రతిపాదించడానికి మార్చి 14 వరకూ బోర్డ్ సమయం ఇచ్చింది. ట్రంప్ ప్రభుత్వంలో ప్రస్తుతం మాల్పాస్ ఆర్థిక శాఖకు సంబంధించి అంతర్జాతీయ వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పదవీ విరమణ కాలానికి మూడేళ్ల ముందే పపంచబ్యాంక్ ప్రెసిడెంట్‌గా జిమ్ యాంగ్ కిమ్ జనవరిలో తన రాజీనామాను ప్రకటించడంతో ఆ స్థానానికి మాల్పాస్ పేరును ట్రంప్ ప్రతిపాదించారు. ట్రంప్‌కు మాల్పాస్ అత్యంత విశ్వసనీయుడు. చైనాకు వ్యతిరేకంగా పలు వ్యాఖ్యలు చేయడంతో పాటు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విధివిధానాల మారాల్సిన అవసరం ఉందని ఆయన తరచూ ప్రకటనలు చేస్తూ వస్తున్నారు.

లంబోర్గిని ‘హురాకన్ ఇవో’ @ రూ.3.73 కోట్లు



న్యూఢిల్లీ: ఇటలీకి చెందిన ప్రముఖ సూపర్ స్పోర్ట్స్ కార్ల తయారీ కంపెనీ లంబోర్గిని.. ’హురకన్ ఇవో’ కారును గురువారం భారత మార్కెట్లో విడుదలచేసింది. వాణిజ్యపరంగా తొలి కారు విడుదల భారత్‌లోనే జరిగింది. ఈ కారు ప్రారంభ ధర రూ.3.73 కోట్లు. విడుదల సందర్భంగా పలు అంశాలపై మాట్లాడిన లంబోర్గిని ఇండియా హెడ్ శరద్ అగర్వాల్.. ‘కంపెనీ అమ్మకాలు ఈ ఏడాదిలో 60 శాతం వృద్ధిని నమోదుచేశాయి. 2016 నుంచి ఇప్పటివరకు మూడురెట్లు పెరిగాయి. సగటున 55– 60 శాతం వృద్ధిరేటు నమోదైంది. భారత సూపర్ స్పోర్ట్స్ కార్ల విభాగంలో మార్కెట్ లీడర్‌గా కొనసాగుతున్నాం. రానున్నకాలంలో సంస్థ వాటా మరింత పెరగనుందని భావిస్తున్నాం.’ అని వ్యాఖ్యానించారు.

మార్కెట్లోకి హోండా స్పెషల్ ఎడిషన్స్

అమేజ్, జాజ్, డబ్ల్యూఆర్–వీ



న్యూఢిల్లీ: హోండా కార్స్ ఇండియా (హెచ్‌సీఐఎల్).. తన పోర్టిఫోలియోలోని మూడు మోడల్ కార్ల స్పెషల్ ఎడిషన్స్‌ను విడుదల చేసింది. అమేజ్, జాజ్, డబ్ల్యూఆర్–వీ నూతన వేరియంట్లను గురువారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. రూపురేఖల్లో మార్పులతో పాటు ఇంటీరియర్ యుటిలిటీ ఫీచర్లను ఈ కార్లలో జోడించినట్లు కంపెనీ వివరించింది. వీటి ధరల శ్రేణి రూ.7.86 లక్షల నుంచి రూ.10.48 లక్షల వరకు ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ ఇంజిన్ అప్షన్లలో అందుబాటులోకి వచ్చిన హోండా నూతన ఎడిషన్ అమేజ్ ధర రూ.7.86 లక్షల నుంచి రూ.8.96 లక్షలు కాగా.. పెట్రోల్ సీవీటీ పవర్‌ట్రైన్ జాజ్ ధర రూ.9.22 లక్షలుగా ఉంది. డబ్ల్యూఆర్–వీ ధర రూ.9.35 లక్షల నుంచి రూ.10.48 లక్షలుగా కంపెనీ ప్రకటించింది. నూతన ఎడిషన్స్ వినియోగదారులను ఆకట్టుకుంటాయని భావిస్తున్నట్లు ఈ సందర్భంగా సంస్థ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ గోయల్ వ్యాఖ్యానించారు.

14 రెట్లు పెరిగిన సెయిల్ లాభం



ప్రభుత్వ రంగ ఉక్కు కంపెనీ, సెయిల్ ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో రూ.616 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.43 కోట్ల నికర లాభం వచ్చిందని, దాదాపు 14 రెట్లు వృద్ధి సాధించామని సెయిల్ తెలిపింది. ఆదాయం అధికంగా రావడం, నిల్వల స్థాయి తక్కువగా ఉండటంతో ఈ స్థాయి నికర లాభం వచ్చిందని సెయిల్ చైర్మన్ అనిల్ కుమార్ చౌధురి చెప్పారు. గత క్యూ3లో రూ.15,443 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో రూ.15,910 కోట్లకు పెరిగిందని తెలిపారు. మొత్తం వ్యయాలు రూ.15,318 కోట్ల నుంచి రూ.14,937 కోట్లకు తగ్గాయని వివరించారు. గత క్యూ3లో 3.9 మిలియన్ టన్నులుగా ఉన్న ముడి ఉక్కు ఉత్పత్తి ఈ క్యూ3లో 10 శాతం వృద్ధితో 4.3 మిలియన్ టన్నులకు పెరిగిందని అనిల్ కుమార్ వెల్లడించారు. ఇదే తమ కంపెనీ చరిత్రలో అత్యధిక ఉత్పత్తి అని పేర్కొన్నారు. భారత్‌లో ఇదే అతి పెద్ద ఉక్కు కంపెనీ. ఐదు సమగ్ర ప్లాంట్లు, మూడు ప్రత్యేక స్టీల్ ప్లాంట్లతో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో సెయిల్ షేర్ 2.6 శాతం లాభంతో రూ.48.60 వద్ద ముగిసింది.

స్టీల్ ధరలు పెరుగుతాయ్ !

అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిన ప్రభావం

న్యూఢిల్లీ: ఉక్కు ధరలను ప్రధాన కంపెనీలు పెంచే అవకాశాలున్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఇనుప లోహం ధరలు పెరగడంతో ఉక్కు ధరలు టన్నుకు 70 డాలర్ల మేర పెరిగాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ కూడా ధరలను పెంచాలని ఉక్కు కంపెనీలు భావిస్తున్నాయని సమాచారం. ఇప్పటికే జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ధరలను టన్నుకు రూ.750 చొప్పున పెంచింది. ఇతర కంపెనీలు కూడా పెంచితే తాము కూడా ధరలను పెంచుతామని జేఎస్‌పీఎల్ కంపెనీ పేర్కొంది. ఉత్పత్తి వ్యయాలు పెరగడమూ ఇక్కడ గమనార్హం.

అక్టోబర్-డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు

అరబిందో మధ్యంతర డివిడెండు 125 శాతం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ సంస్థ అరబిందో ఫార్మా రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రెండవ మధ్యంతర డివిడెండు 125 శాతం చెల్లించాలన్న ప్రతిపాదనకు బోర్డు సమ్మతి తెలిపింది. డిసెంబరు త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో అరబిందో ఫార్మా మెప్పించింది. ఈ కాలంలో నికర లాభం రూ.712 కోట్లు సాధించింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 19.66 శాతం అధికం. టర్నోవరు రూ.4,336 కోట్ల నుంచి రూ.5,269 కోట్లకు ఎగసింది. ఎబిటా 20.6 శాతంగా ఉంది. యూఎస్ ఫార్ములేషన్స్ అమ్మకాలు తోడవడంతో మంచి వృద్ధిని సాధించింది. ఈ విభాగం 27.4 శాతం వృద్ధితో రూ.2,433 కోట్లు నమోదైంది. యూరప్ ఫార్ములేషన్స్ ఆదాయం 10.3 శాతం అధికమై రూ.1,293 కోట్లు, గ్రోత్ మార్కెట్లు 36 శాతం వృద్ధితో రూ.340 కోట్లు, ఏఆర్‌వీ సేల్స్ 17.8 శాతం అధికమై రూ.281 కోట్లుగా ఉంది. ఏపీఐ అమ్మకాల ఆదాయం 20.4 శాతం పెరిగి రూ.922 కోట్లు సాధించింది. ఆర్‌అండ్‌డీ వ్యయం మొత్తం ఆదాయంలో 4.8 శాతం ఉందని కంపెనీ ఎండీ ఎన్.గోవిందరాజన్ ఈ సందర్భంగా తెలిపారు. కంపెనీ ఏప్రిల్–డిసెంబరు పీరియడ్‌లో రూ.14,271 కోట్ల టర్నోవరుపై రూ.1,779 కోట్ల నికరలాభం పొందింది. గురువారం బీఎస్‌ఈలో అరబిందో షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే 2.38 శాతం అధికమై రూ.778.75 వద్ద స్థిరపడింది.

నవభారత్ లాభం రూ.33.4 కోట్లు



నవభారత్ వెంచర్స్ నికరలాభం రూ.31.6 కోట్ల నుంచి రూ.33.4 కోట్లకు ఎగసింది. టర్నోవరు రూ.321 కోట్ల నుంచి రూ.364 కోట్లకు చేరింది. ఏప్రిల్–డిసెంబరులో రూ.1,079 కోట్ల టర్నోవరుపై రూ.129 కోట్ల నికరలాభం పొందింది.

77 శాతం పెరిగిన పిట్టి లాభం..

డిసెంబరు త్రైమాసికంలో పిట్టి ఇంజనీరింగ్ నికరలాభం అంత క్రితం ఏడాదితో పోలిస్తే 77 శాతం అధికమై రూ.5.2 కోట్లకు ఎగసింది. టర్నోవరు రూ.77 కోట్ల నుంచి రూ.165 కోట్లకు చేరింది. ఏప్రిల్–డిసెంబరులో రూ.472 కోట్ల టర్నోవరుపై రూ.17.4 కోట్ల నికరలాభం సాధించింది.

ఎమ్‌ఆర్‌ఎఫ్ లాభం 18 శాతం డౌన్



టైర్ల కంపెనీ ఎమ్‌ఆర్‌ఎఫ్‌కు ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.279 కోట్ల నికర లాభం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.341కోట్ల నికర లాభం ఆర్జించామని కంపెనీ తెలిపింది. వ్యయాలు పెరగడంతో నికర లాభం 18 శాతం క్షీణించిందని వివరించింది. గత క్యూ3లో రూ.3,799 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో రూ.4,034 కోట్లకు పెరిగిందని పేర్కొంది. ఒక్కో షేర్‌కు రూ.3 మధ్యంతర డివిడెండ్‌ను ఇవ్వనున్నామని పేర్కొంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో ఎమ్‌ఆర్‌ఎఫ్ షేర్ 0.6 శాతం క్షీణించి రూ.59,637 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో తాజా ఏడాది కనిష్ట స్థాయి, రూ.59,090ను తాకింది.

ఆర్సెలర్ మిట్టల్ లాభం 16 శాతం అప్



అంతర్జాతీయ ఉక్కు దిగ్గజం, ఆర్సెలర్ మిట్టల్ కంపెనీ నికర లాభం డిసెంబర్ 31, 2018తో ముగిసిన క్వార్టర్‌లో 16 శాతం వృద్ధితో 119 కోట్ల డాలర్లకు పెరిగింది. అంతకు ముందటి ఏడాది ఇదే క్వార్టర్‌లో 103 కోట్ల డాలర్ల నికర లాభం వచ్చిందని ఆర్సెలర్ మిట్టల్ తెలిపింది. అమ్మకాలు అధికంగా ఉండటం, ఇతర కారణాల వల్ల నికర లాభం పెరిగిందని పేర్కొంది. 2017, క్యూ4లో 1,771 కోట్ల డాలర్లుగా ఉన్న మొత్తం అమ్మకాలు గతేడాది నాలుగో క్వార్టర్‌లో 1,832 కోట్ల డాలర్లకు పెరిగాయని తెలిపింది.

మరికొన్ని కంపెనీల ఫలితాలు (రూ. కోట్లలో)

కంపెనీ	నికర లాభం 2018–19	నికర లాభం 2017–18	వృ/క్షీ(%)	మొత్తం ఆదాయం 2018–19	మొత్తం ఆదాయం 2017–18	వృ/క్షీ(%)
బ్రిటానియా ఇండస్ట్రీస్	300	264	14	2,902	2,603	11
సుజ్లాన్ ఎనర్జీ	(40)	(33)	-	1,112	2,220	-49
ఇర్కాన్	103	112	-8	1,256	964	30
హెచ్‌సీసీ	10	31	-68	1,126	1,293	-13
గ్రాసీం ఇండస్ట్రీస్	1,144	787	45	18,591	15,344	21
క్యాడిలా హెల్త్‌కేర్	511	543	-6	3,609	3,285	10
అదానీ గ్రీన్ ఎనర్జీ	(119)	(14)	-	471	456	3
పీ అండ్ జీ	124	131	-5	830	711	17
పీటీసీ ఇండియా	51	59	-13	2,935	2,717	8
బజాజ్ ఎలక్ట్రికల్స్	64	37	73	2,162	1,145	88

(నష్టం)


ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	332.35	330.35
ASIAN PAINT	1472.45	1469.4
AXIS BANK L	730.15	725.75
BAJAJ AUTO	2853.6	2770.15
BAJAJ FINSE	6253.1	6208.65
BAJAJ FINAN	2696.6	2711.25
BHARTI AIRT	311.15	308.75
BPCL	339.4	339.3
CIPLA LTD	532.9	534.95
COAL INDIA	224.2	219.95
EICHER MOTO	21904.2	21104.25
GAIL (INDIA	339.95	339.8
GRASIM INDU	752.75	733.5
HCL TECHNOL	1062.9	1055.2
HDFC LTD	1969.65	1987.95
HDFC BANK L	2117.25	2122.65
HERO MOTOCO	2939.05	2880.05
HINDALCO I	209.2	211.4
HPCL	236.85	233.9
HUL	1839.05	1829.95
INDIABULLS	652.35	653.85
ICICI BANK	358.65	359.3
INDUSIND BA	1514.95	1526.05
BHARTI INFR	305.85	296.35
INFOSYS LIM	764	763.3
INDIAN OIL	138.05	137.85
ITC LTD	280.3	277.7
JSW STEEL L	273.1	279.3
KOTAK MAHIN	1284.55	1279.5
LARSEN & T	1296.05	1314.4
MAHINDRA &M	700.9	695.1
MARUTI SUZU	7302.55	7183.4
NTPC LTD	135.95	137.1
OIL AND NAT	147.9	146.7
POWER GRID	184.6	186.8
RIL	1290.4	1310.25
SBI	287.4	289.05
SUN PHARMAC	434.9	416.6
TATA MOTORS	182.85	178.5
TATA STEEL	489.05	485.1
TCS	2082.9	2074.8
TECH MAHIND	805	811.35
TITAN COMPA	1056.8	1059.05
ULTRATECH C	3570.55	3510.35
UPL LIMITED	809	805.25
VEDANTA LIM	163.45	163.75
WIPRO LTD	373.6	372.2
YES BANK LI	176.95	176.45
ZEE ENTERTA	408.75	388

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1266.5	1259.9
ADITYA BIRL	83.55	82.35
ACC LIMITED	1421.6	1401.45
AMBUJA CEME	214.95	214.5
ASHOK LEYLA	87.75	82.55
BANDHAN BAN	460.45	440.4
BANK OF BAR	108.9	109.2
BHARAT ELEC	81.65	81.9
BHEL	62.2	60.8
BIOCON LIMI	655.6	634.55
BOSCH LIMIT	19224.75	19248.25
BRITANNIA I	3214.1	3181.4
CADILA HEAL	321.95	317.95
COLGATE PAL	1297.65	1294.9
CONTAINER C	513.5	510.45
DABUR INDIA	459.8	453.7
DLF LIMITED	160.4	160.35
AVENUE SUPE	1496.35	1512.65
GENERAL INS	236.5	241.45
GODREJ CONS	700.55	705.25
HAVELLS IND	748.15	737.5
HDFC LIFE I	368.4	369.6
HINDUSTAN Z	255.7	256.9
ICICI LOMBA	888.95	899.05
ICICI PRU L	311.9	288.35
VODAFONE ID	32	30
INTERGLOBE	1203.95	1197.05
L&T FINANCE	135.5	128.6
LIC HOUSING	466.5	459.8
LUPIN LIMIT	822.8	842.1
MARICO LIMI	368.45	364.95
MOTHERSON S	141.9	137.6
MRF LTD	59410.55	59936
NHPC LTD	24.15	24.2
THE NEW IND	174.1	174.6
NMDC LTD.	95.25	95.1
ORACLE FIN	3839.75	3879.7
OIL INDIA L	170.7	171.35
PIRAMAL ENT	2237.35	2171.3
PETRONET LN	222.3	219.45
P&G HYGIENE	10002.65	9977.9
PIDILITE IN	1163.65	1125
STEEL AUTHO	48.65	47.3
SBI LIFE IN	577.25	579.4
SHREE CEMEN	16245.7	16031.15
SIEMENS LTD	1047.6	1020.55
SHRIRAM TRA	1100.85	1068.1
SUN TV NETW	532.35	543.55

కొత్తా డైట్ అండి.. పేగన్ వచ్చేనండి..



ఇది తింటే మంచిది..
అది తింటే మంచిది కాదు..
దీన్ని ఇలా తీసుకోవాలి..
దాన్ని అలా తీసుకోవాలి..
రకరకాల ఆహారపు విధానాలు..
కీటో డైట్ అని.. చిరుధాన్యాలు అని
ఇలా చాలా..
తాజాగా ఈమధ్య ఇంకో ఆహారపు విధానం ప్రపంచానికి పరిచయమైంది..
శాకాహారానికి... పేలియో డైట్‌ను కలిపేసిన ఈ పేగన్ ఆహారం
మంచి చెడూ తెలుసుకుందామా...

దీనికి ముందు 'పేలియో డైట్' అంటే ఏమిటో తెలుసుకోవాలి. ఎప్పుడో కొన్ని వేల ఏళ్ల క్రితం మనుషులు తిన్న ఆహారాన్ని తీసుకోవడమే పేలియోడైట్. ఉదాహరణకు గుడ్లు, మాంసం.. కాయగూరలు తదితరాలు. తృణధాన్యాలతోపాటు పప్పులు, చక్కెర, శుద్ధి చేసిన ఆహార పదార్థాలు, రిఫైన్డ్ నూనెలు, ఉప్పు, కృత్రిమ చక్కెరలను అస్సలు తీసుకోకూడదు. పేలియో డైట్ వల్ల ప్రిజర్వేటివ్స్ రూపంలో కృత్రిమ రసాయనాలు కడుపులోకి చేరవని.. మొక్కల ద్వారా యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా అందడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నది అంచనా. ఇక శాకాహారం అంటే ఏమిటో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మాంసపు ఉత్పత్తుల జోలికి వెళ్లకుండా.. కాయగూరలు, అన్ని రకాల ధాన్యాలను వాడటం సంతులిత ఆహారమని దీన్ని అనుసరించే వారు చెబుతారు. అయితే... మార్క్ హైమన్ అనే ఓ అమెరికన్ డాక్టర్ ఈ రెండు ఆహార విధానాలను కలిపేసి పేగనిజమ్ అనే కొత్త పద్ధతిని ప్రవేశపెట్టారు. గత ఏడాది ఫిబ్రవరిలో హైమన్ 'వాట్ ద హెక్ షుడ్ ఐ ఈట్' పేరుతో రాసిన పుస్తకం సూపర్‌హిట్ కావడంతో పేగనిజమ్ ప్రాచుర్యంలోకి వచ్చేసింది.

కలిపి కొట్టర కావేటి రంగ...

పేగనిజమ్ అంటే రెండు ఆహారపు పద్ధతులను కలిపి తీసుకోవడం అని ముందుగానే చెప్పుకున్నాం. ఇందులో ఎక్కువగా తీసుకునేది మొక్కల ఆధారిత ఆహారమే. దీంతోపాటు మార్కెట్‌లో దొరికే ముదురు రంగు కాయగూరలు, పండ్లు బాగా తినాలి. దీనివల్ల శరీరానికి పీచుపదార్థాలు ఎక్కువగా చేరతాయని, గుండెజబ్బులు రాకుండా చూడటంతోపాటు కేన్సర్, మరీ ముఖ్యంగా పేవు కేన్సర్ నివారణకు పేగనిజం ఉపయోగపడుతుందని హైమన్ చెబుతున్నారు. పీచుపదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల ఈ ఫలితాలు పొందవచ్చునని ఇప్పటికే కొన్ని పరిశోధనలు రుజువు చేసిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. పేగన్ డైట్‌లో పండ్లు, కాయగూరల మోతాదు 75 శాతం వరకూ ఉంటే.. అవిశ గింజలు (ఫ్లాక్స్ సీడ్స్), చేపలు... డ్రైఫ్రూట్స్, అవకాడో, ఆలివ్ సంబంధిత నూనెలు, గడ్డిమాత్రమే తిని పెరిగిన పశువుల నుంచి సేకరించిన మాంసం, వెన్న, నెయ్యి, ఆర్గానిక్ కొబ్బరి నూనె మిగిలిన పావు వంతు భాగాన్ని ఆక్రమిస్తాయి.

నష్టాలూ ఉన్నాయి..

పేగన్ డైట్‌తో ఆరోగ్యానికి ఎన్ని లాభాలు ఉన్నాయో.. నష్టాలు కూడా అన్నే ఉన్నాయంటున్నారు శాస్త్రవేత్తలు. పోషక విలువలు ఉన్నట్లు రూఢీ అయిన అనేక ఆహార పదార్థాలు.. ఉదాహరణకు గోధుమలు, బీన్స్ వంటివాటిపై నిషేధం ఉండటాన్ని నిపుణులు తప్పుపడుతున్నారు. గోధుమలోని గ్లుటెన్ కొంతమందికి ఇబ్బంది కలిగించవచ్చుగానీ.. పేగన్ డైట్‌లో గోధుమలతోపాటు క్వినోవా, బ్రౌన్ రైస్, ఓట్స్, రాజ్‌గిరా వంటివాటిని కూడా తినకూడదనడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇవన్నీ రక్తంలో చక్కెర మోతాదులను పెంచుతాయని.. పైగా రోగ నిరోధక వ్యవస్థను బలహీన పరుస్తాయని హైమన్ సూత్రీకరణ.నాలుగేళ్ల క్రితం హైమన్ ఒక బ్లాగ్ రాస్తూ.. పాడి ఉత్పత్తులన్నింటినీ మానేయాలని సూచించినప్పటికీ తరువాతి కాలంలో ఆయన తన అభిప్రాయాన్ని మార్చుకున్నారు. ఫలితంగా మేక లేదా గొర్రె పాల నుంచి పెరుగు, వెన్న తీసుకోవచ్చు. అయితే పాడి ఉత్పత్తుల వల్ల వ్యాధులు వస్తాయనే హైమన్ అంచనాకు ఇప్పటివరకూ శాస్త్రీయ ఆధారమేమీ లేకపోవడం గమనార్హం.

'పేగన్ డైట్' ఆరోగ్యానికి కలిగించే మేలు కొంతే. అదేసమయంలో మాంస ఉత్పత్తులను పరిమితం చేయడం వల్ల పర్యావరణానికి మేలు కలుగుతుంది. అతితక్కువ చక్కెరలు తీసుకోవడం.. చేపలు, అవిశగింజల నుంచి అందే ఒమేగా –3 ఫ్యాటీయాసిడ్లు పేగనిజానికి సానుకూల అంశాలైనప్పటికీ నిషేధిత జాబితాలో బోలెడన్ని ఆహార పదార్థాలు ఉండటం ప్రతికూల

ఏతా వాతా...

అంశమని నిపుణులు అంటున్నారు. ఆహార పద్ధతులేవీ మార్చుకోకుండానే.. శాకాహారాన్ని ఎక్కువ తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చునని, తద్వారా పక్కా నియమాలతో తిండి తినాల్సిన అవసరం తప్పుతుందని చెబుతున్నారు.

సాక్షి నాలెడ్జ్ సెంటర్

'డెత్‌ట్రాక్స్'పై స్పెషల్ డ్రైవ్

- సాక్షి కథనంపై కదిలిన దక్షిణ మధ్య రైల్వే
- ప్రమాదాల నియంత్రణకు చర్యలు షురూ
- ఆర్పీఎఫ్, జీఆర్పీతో కలిసి కార్యాచరణ: సీపీఆర్వో రాకేశ్
- అవసరమైన చోట సైడ్‌వాల్స్, ఫెన్సింగ్ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: రాజధానిలో రక్తసిక్తమవుతున్న రైలుపట్టాల గురించి 'సాక్షి'ప్రచురించిన ప్రత్యేక కథనంపై దక్షిణ మధ్య రైల్వే స్పందించింది. నగరంలో ప్రమాద ఘంటికలు మోగిస్తున్న 'డెత్ ట్రాక్స్'నివారణకు చర్యలు చేపట్టింది. ప్రమాదాలకు అవకాశం ఉన్న అన్ని చోట్లా స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ గురువారం వెల్లడించారు.

సాక్షి ఎఫెక్ట్..

ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులతో కలిసి సంయుక్తంగా కార్యాచరణ కొనసాగించనున్నట్లు ఆయన వెల్లడించారు. జంటనగరాల్లో ప్రమాదకరంగా మారిన రైల్వే పట్టాలపై.. 'డెత్ ట్రాక్స్'శీర్షికన 'సాక్షి' గురువారం ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ కథనం నేపథ్యంలో కదిలిన రైల్వే శాఖ.. పోస్టర్లు, కరపత్రాలు, తదితర రూపాల్లో ప్రచారం చేయడంతోపాటు రైల్వే చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించింది. గతంలో కంటే ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని, పట్టాలు దాటకుండా అనేక చర్యలు చేపట్టామని రాకేశ్ తెలిపారు. అయితే.. కొన్ని చోట్ల ప్రజలు నిర్లక్ష్యంగా పట్టాలు దాటుతున్నట్లు గమనించామన్నారు. అవసరమైన అన్ని చోట్లా సైడ్‌వాల్స్, ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రయాణికులు, ప్రజల భద్రత దృష్ట్యా ట్రాక్‌లపై రైల్వే శాఖ చేపట్టే అవగాహన కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు సహకరించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పట్టాలపైకి రావద్దని సూచించారు. నగరంలోని సుమారు 48 కిలోమీటర్ల ఎంఎంటీఎస్ ట్రాక్ మార్గంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు సీపీఆర్వో స్పష్టం చేశారు.

ప్రభుత్వానికి ఏకీకృతం ఫైలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌కు సంబంధించిన ఫైలు గురువారం ప్రభుత్వం ఆమోదానికి పంపినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆర్థిక శాఖ ఆమోదం తర్వాత ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందన్నారు. లేదంటే ప్రభుత్వం న్యాయ సలహా తీసుకున్న తర్వాత ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఇంజనీరింగ్‌లో 10 వేల సీట్లు కోత!

- కాలేజీల రద్దు కోసం 13 దరఖాస్తులు
- ఏఐసీటీఈ మంజూరు చేసిన సీట్ల ఆధారంగానే ఫ్యాకల్టీ
- జేఎన్‌టీయూహెచ్ నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈసారి దాదాపు 10 వేల సీట్లు తగ్గిపోయే పరిస్థితి కనిపిస్తోంది. కాలేజీల మూసివేత, బ్రాంచీల రద్దుకు యాజమాన్యాల నుంచి వచ్చిన దరఖాస్తుల నేపథ్యంలో ఈ సీట్లు తగ్గిపోయే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలోని 173 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 13 కాలేజీలు మూసివేత కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వాటిలోనే 6 వేలకుపైగా సీట్లు తగ్గిపోనుండగా, ఉన్న కాలేజీల్లో మరో 4 వేల వరకు సీట్లు తగ్గనున్నాయి. ఇందుకోసం యాజమాన్యాలే స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకున్నాయి. అందులో బీటెక్‌లో 26 బ్రాంచీలు, ఎంటెక్‌లో 66 బ్రాంచీలు, ఎంబీఏలో ఐదు, బీఫార్మసీ, ఎంఫార్మసీ తదితర కోర్సుల్లో 140 వరకు బ్రాంచీలను రద్దు చేసుకునేందుకు యాజమాన్యాలు దరఖాస్తు చేసుకున్నాయి. మరోవైపు యూనివర్సిటీల అధికారులు అనుబంధ గుర్తింపు ఇచ్చే క్రమంలో ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలతో (ఎఫ్ఎఫ్‌సీ) తనిఖీలు చేపట్టనున్నారు. ఆ సమయంలో నిబంధనల ప్రకారం ప్రమాణాలు, సౌకర్యాలు లేకుంటే మరిన్ని సీట్లకు కోత పడే అవకాశం ఉంది. కాలేజీల్లో చేరే సంఖ్యకు అనుగుణంగా కాకుండా అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆమోదం తెలిపిన సీట్ల సంఖ్య ప్రకారమే ఫ్యాకల్టీని నియమించాలని గురువారం జేఎన్‌టీయూహెచ్ నిర్ణయించింది. అనుబంధ గుర్తింపు ఇచ్చే క్రమంలో దానినే పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేసింది. కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఫ్యాకల్టీని నియమిస్తామని చెబుతున్న యాజమాన్యాల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోబోమని తేల్చిచెప్పింది.

మూసివేతకు దరఖాస్తు చేసుకున్న కాలేజీలివే...

అల్ హబీబ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, అయాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, జయముఖి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, కృష్ణమూర్తి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్, నిశిత కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, పల్లవి వీఐఎఫ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్రిన్‌స్టన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, విద్యాభారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పీఆర్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజ్, ధ్రువ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, షాజ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కేబీఆర్ ఇంజనీరింగ్ కాలేజ్.

బోర్డు ఆదేశాలు బేఖాతరు

- శ్రీశైలంలో కనీస మట్టాలకు దిగువన మొదలైన నీటి వినియోగం
- హంద్రీనీవా కోసం ఏపీ, కల్వకుర్తి కోసం తెలంగాణ జలాల తరలింపు

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం ప్రాజెక్టులో కనీస నీటి మట్టాల దిగువన నీటిని తోడటం మొదలైంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా, తమ అనుమతి లేకుండా కనీస నీటిమట్టాల దిగువన నీటిని తీసుకోరాదన్న కృష్ణా బోర్డు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు నీటి వినియోగం మొదలుపెట్టాయి. 2,124 క్యూసెక్కుల మేర నీటిని ఇరు రాష్ట్రాలు తమతమ అవసరాల నిమిత్తం శ్రీశైలం నుంచి వాడుకున్నాయి. గతేడాదితో పోలిస్తే శ్రీశైలంలో ఈ ఏడాది నీటి వినియోగం గణనీయంగా పెరగడంతో ముందుగానే ప్రాజెక్టులో నీటి మట్టాలు తగ్గాయి. గతేడాది 885 అడుగుల నీటిమట్టానికి గాను 856 అడుగుల మట్టంలో నీరుండగా, ఈ ఏడాది అది 833.80 అడుగుల మట్టానికి పడిపోయింది. ప్రాజెక్టు కనీస నీటిమట్టం 834 అడుగులే. నీటి మట్టం తగ్గుతున్న నేపథ్యంలో రెండ్రోజుల కిందటే ఎట్టి పరిస్థితుల్లోనూ కనీస నీటి మట్టాల దిగువకు వెళ్లరాదని కృష్ణా బోర్డు తెలుగు రాష్ట్రాలను హెచ్చరించింది.

త్రిసభ్య భేటీ వరకు వద్దన్నా..

కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ భేటీ జరిగే వరకు కనీస నీటిమట్టాల దిగువకు వెళ్లే అంశంపై ఎలాంటి నిర్ణయాలు చేయరాదని ఇదివరకే సూచించింది. అయినప్పటికీ ఇరు రాష్ట్రాలు నీటి వినియోగాన్ని మొదలుపెట్టాయి. గురువారం ఏపీ శ్రీశైలం నుంచి హంద్రీనీవా కాల్వలకు 860 క్యూసెక్కులు, తెలంగాణ కల్వకుర్తి అవసరాలకు 1,264 క్యూసెక్కుల నీటిని తరలించాయి. దీంతో జలాలు కనీస నీటిమట్టానికి దిగువకు పడిపోయాయి. అయితే ఇరు రాష్ట్రాలు ఎంతకాలం, ఏ మేర నీటిని తరలించుకుంటాయన్న దానిపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో బోర్డు ఎలా స్పందిస్తుందన్నది వేచి చూడాల్సిందే. గతంలో కనీస నీటిమట్టాల దిగువన నీటిని తోడినప్పుడు పూర్తి స్థాయి బోర్డు సమావేశాల్లోనే వీటిపై ఏ నిర్ణయం అనేది తీసుకున్నారు. ఈ నేపథ్యంలో అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ వచ్చే వారం బోర్డు సమావేశం జరుగుతుండొచ్చని నీటి పారుదల వర్గాలు చెబుతున్నాయి.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792